ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. మూగవాడి సాక్ష్యం—చైతన్య
21. హాస్టల్లో దొంగతనాలు—ఏ. వీ. మోహన్రావ్
34. చేయకురా చెలిమి—మోదుకూరి జతీంద్రశర్మ
56. విషఘడియలు—యస్. క్రిష్ణవేణి
69. శవాన్ని చంపినహంతకుడు—కె. రవీంద్రప్రసాద్
84. యమదూతలు వస్తున్నారు—వసుంధర
101. శవం పిలుస్తుంది—మల్లిబాబు
110. న్యాయాన్ని గెలవలేవు—పి. వి. సుధాకరరావు
121. రైలుప్రయాణం—ప్రభాకరదేవ్
130. హంతకుడి ఉత్తరం—విద్వాన్ షీలాదేవి
145. మర్డర్ పార్ట్నర్—కె. బి. ఎస్. కుమార్
162. అతీంద్రియ శక్తులు(సీరియల్)—రమణశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. అడుగడుగునా ఆటంకాలే!—'సికిందర్'
56. కాలభైరవస్వామి—శ్రీరాజ్
77. ఎదురు చూడని ప్రమాదం—ఏ.వీ. మోహన్రావ్
[16. నరబలి—వసుంధర
160. ఇద్దరు దొంగలు—అజీజ్

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, పాఠకుల పరిశోధన పోటీ, అపరాధ పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు, పాఠకుల ప్రశ్నలు, మీ తీర్పు ఏమిటి, మరెన్నో ఆకర్షణలు!!!

రాత్రి ఎనిమిది గంటలు దాటింది. భోజనం ముగించి మేడ మీద గదిలోకి నడిచాను.

నౌకరు వెంకన్న లోపలికి వచ్చాడు.

"నేను వచ్చానని చెప్పి, రాజారావుగార్ని పిలుచుకురా" చెప్పాను అలసటగా మంచంమీద వాలుతూ.

వెంకన్న వెళ్లిపోయాడు. సిగరెట్ త్రాగుతూ మంచం మీద వెల్లకిలా పడుకున్నాను.

రాజారావుగారు మా ఫామిలీ లాయర్. అంతేకాదు మా

నాన్నకు మంచిస్నేహితుడు కూడ. ఆయన్ని చిన్నతనం నుంచి ఎరిగి ఉండడంవల్ల 'అంకుల్' అని పిలుస్తాను.

అసలు ఆయన ప్రాక్టీసు మద్రాసులోనే అయినా, నా ఇంటి వ్యవహారాలు చూడడానికి అడపా దడపా ఇక్కడికి వస్తుంటాడు. నా చిన్ననాటి స్నేహితుడు నారాయణ, రాజా రావుగార్కి దూరపు బంధువు అవుతాడు. అందుకే రాజా రావుగారు ఇక్కడకు వచ్చినప్పుడల్లా నారాయణ ఇంట్లోనే గడుపుతాడు.

నేను మద్రాసులో బి. ఏ. ఫైనలియరు చదువు తున్నాను.

అయితే ఈరోజు ఉదయం వెంటనే బయలుదేరిరమ్మని నాకు టెలిగ్రాం వచ్చింది.

బి. ఏ. ఫైనలియర్ పరీక్షలు ఇంక పదిరోజులున్నాయి. ఈ ఒక్క సంవత్సరం గడిస్తే డిగ్రీ చేతికి వస్తుంది. ఇంకా పైకి చదివి ఉద్యోగం చెయ్యాలనే తలంపు నాకు లేదు. ఈ పరీక్ష అయిపోగానే చెఱకు తోటలు చూచు కుంటూ ఉంటే చాలు, నా జీవితం హాయిగా గడిచి పోతుంది.

వంద ఎకరాల చెఱకుతోట, మా నాన్నగారు పోయేసరికి అరవై ఎకరాలు మిగిలింది. ఆయన పోయేసరికి నేను ఫస్టి యర్ బి. ఏ. చదువుతున్నాను. కేవలం వ్యవసాయం చూచుకోడానికిగాను నా చదువు మానుకోదల్చుకోలేదు.

అందుకే ఇద్దరు మానేజర్లను నియమించాను. అప్పు డప్పుడు రాజారావుగారు వచ్చి ఆస్తిపాస్తుల వ్యవహారాలు చూచి వచ్చేవారు. ఏ చీకూచింతా లేకుండా నా జీవితం హాయిగా గడిచిపోతుంది.

అయితే ఉదయంనుంచి ఈ టెలిగ్రాం నాకో సమస్య

అయింది. రాజారావుగారిక్కి తెలుసు, నా పరీక్షలు పదిరోజులే ఉన్నాయని. తెల్సి కూడా వెంటనే రమ్మని టెలిగ్రాం ఎందుకు ఇచ్చినట్లు?

ఏదైనా జరగరాని సంఘటన జరిగిందా? కాని నాకిక్కడకు వచ్చింది మొదలు అలాంటిదేమీ జరిగినట్లు అన్పించ లేదు. వాతావరణం ప్రశాంతంగానే ఉంది.

మరెందుకు పిలిపించినట్లు నన్ను? ఆలోచిస్తున్నాను.

2

రాజారావుగారు లోపలికి వచ్చారు.

"నువ్వు రేపు వస్తావేమో అనుకున్నాను. ఈ రోజే వచ్చావు. మంచిపని చేశావ్!" అన్నారు కుర్చీలో కూర్చుంటూ.

నేను తల వూపి, "టెలిగ్రాం అందగానే బయలు దేరాను. నాకేమీ విషయం అర్థంకాలేదు. అసలేం జరిగింది అంకుల్....!" అడిగాను ఆయన యెదురుగా కుర్చీలో కూర్చుంటూ.

రాజారావుగారు లేచి నిలబడ్డారు. "చెబుతాను. అయితే దానికి ముందే నీకో విషయంచెప్పాలి. నిజానికి ఆ విషయం ఇలా, ఇప్పుడే చెప్పవలసి వస్తుందని అనుకోలేదు. అయినా తప్పలేదు...." క్షణం ఆగి, సిగరెట్ వెల్గించి చెప్పనారంభించాడు.

"నీకు తెలుసు. నేను, మీ నాన్న ప్రాణస్నేహితులమని. ముప్ఫైఏళ్ల స్నేహం మాది. మా ఇద్దరిమధ్య యెలాంటి రహస్యాలు లేవు. ఎంతో ఇదిగా ఉండేవాళ్లం.ఆ నమ్మకం తోనే, నిన్ను చదువుకోసం అని, ఆరేళ్ల పిల్లవాడప్పుడే నాతో మద్రాసు పంపించాడు."

"అసలు విషయం ఏమిటో చెప్పండి అంకుల్" ఆతృ

తగా అడిగాను.

"అదే చెబుతున్నా! మీ నాన్నగారు చెఱకు తోటలమీద బాగా సంపాదించాడు. కాని ఆయన యెంత సంపాదించినా ఆయనకు మనశ్శాంతిలేదు. అందుకు కారణం ఆయన దాయాదులు.

నువ్వు ఆయనకు ఒక్కగా నొక్క బిడ్డవు. ఇంత కాలం తనను చూచి బెదిరి ఊరుకున్న వాళ్లంతా, రేపు తన తదనంతరం, ఆస్తికోసం నిన్ను ఏమైనా చెయ్యవచ్చు.లేదా ఏదో విధంగా ఆస్తి కాజెయ్యవచ్చు. కాని ఎట్టి పరిస్థితు లలోనూ నువ్వు బికారివి కాకూడదని ఆయన కోరిక.

అందుకే ఎవ్వరికి తెలియకుండా, లక్షలాది ఆస్తిని నగల రూపంలోకి మార్చి, రహస్యంగా ఒకచోట దాచి పెట్టాడు. ఆయన చనిపోయేముందు ఆ వివరాలన్నీ నాకు చెప్పి, దాయాదులనుంచి నీ ప్రాణాల్ని కాపాడే బాధ్యతతో పాటు, ఆ రహస్యనిధి గురించికూడ చెప్పి, ఎట్టి పరిస్థితు లలో నయినా, ఒకవేళ నీ ఆస్తి దాయాదుల హస్తగత మైతే, ఆ రహస్యపు నిధి నీకు అందేలా చేయమన్నాడు. అంతేకాని, ఈలోపల ఎట్టి పరిస్థితులలోకూడ, ఒక్క నా మరణానికి ముందు తప్ప నీకు తెలియనివ్వవద్దని చెప్పాడు. నేను ఆ విధంగానే ఆయనకు మాట ఇచ్చాను. కాని ఇప్పుడా మాట నిలుపుకోలేకపోతున్నందుకు చాలా బాధగా వుంది. నేను నిన్ననే వచ్చాను. కాని చూస్తే...."

"ఏం జరిగింది?" ఆత్రుతగా అడిగాను.

"జరగరానిదే జరిగింది. మా ఇద్దరికి తప్ప ఇంకెవ్వ రికి తెలియదనుకొన్న ఆ రహస్య నిధి మాయ మయింది."

"మైగాడ్!" ఆశ్చర్యపోయాను.

"అవును. ఇంచుమించు ఎనిమిదీ లక్షలు విలువ వుంటుంది. సామాన్యుడు హరాయించుకోవడం కష్టం."

"ఎలా పోయిందీ మీకేమైనా తెలుసా?"

"ఎలా పోయిందన్నదికాదు మనకు కావలసింది. ఎవరు తీసారు అన్నది. ఇది ఒక్కరి పని అయివుండదని నా అనుమానం" అన్నారు రాజారావుగారు.

"మీకెవరిమీద అయినా అనుమానం వుందా....?" అడిగాను.

"అవును. మేనేజర్లు ఇద్దరూ, భూషణం, చలపతి ప్రవర్తన నాకు అనుమానాస్పదంగా ఉంది. అంతేకాదు. నేను వచ్చినరోజునే, తామింక ఇక్కడ పని చెయ్యలేమనీ వెళ్లిపోవడానికి అనుమతించమని, మీకు వ్రాయమని చెప్పారు. నేను ఇప్పుడే వీలుకాదని చెప్పాను."

"పోనీ పోలీసు రిపోర్టు ఇస్తే?" అన్నాను.

"ప్రయోజనం ఉండదు. ఎనిమిదిలక్షల ఆస్తి ఎంతకైనా తెగింపజేస్తుంది. బెదిరింపులకు దండనకు భయపడేలా లేరు. ఉపాయంతో రాబట్టాలి" అన్నారు రాజారావుగారు.

"అయితే ఏం చేద్దామంటారు?" అడిగాను.

"అదే ఆలోచిస్తున్నాను. అసలు విషయం చెప్పాలనే నిన్ను వెంటనే పిలిపించాను. ఈ రాత్రికి హాయిగా రెస్టు తీసుకో. రాత్రికి ఆలోచించి ఏం చెయ్యవలసింది చెబుతాను" అన్నారు.

3

హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఎందుకొచ్చిందో తెలియదు. ఎదురుగా టేబిల్‌మీద రేడియం డయల్ టైంపీస్ చూశాను. పన్నెండు దాటింది.

ఆవులిస్తూ యధాలాపంగా పక్కకు చూశాను. అదిరి



పడ్డాను. గుండె ఆగినంత పనయింది. కెవ్వున అరిచాను. క్షణంలోనే మొహమంతా చెమటలు పట్టి ధారలుగా కారుతుంది.

ఎదురుగా కిటికీ అవతల చీకట్లో, మసక వెలుతురులో- ముళ్లపంది శరీరంలా ఏదో ఆకారంవుంది.

అంగుళం యెత్తున నిక్కబొడుచుకున్న వెంట్రుకలు, నల్లటి మొహంమీద మరింత నల్లగా కాలిన మచ్చలో కత్తిగాట్లో అర్థంకాన్నంత అసహ్యంగా గుంటలుపడిన మొహం, యెర్రగా చింతనిప్పుల్లాంటి కళ్లు, తెరచిన పెదాలు, వెడల్పాటి ముక్కు, భుజాలవరకు చేతుల్లేని శరీరం.... గుండె లవిసిపోతున్నాయి ఆ దృశ్యం చూస్తుంటే.

ఎవరో పరుగెత్తుకొస్తున్న చప్పుడు విన్పించింది. చటుక్కున ఆ వ్యక్తి తప్పుకోబోయాడు. అప్పటికే వెంకన్న అతడ్ని వాటేసి పట్టుకున్నాడు.

"ఎవడ్రా నువ్వు దొంగవెధవా?...." అంటూనే సగంలో ఆపేసి 'నువ్వా!' అన్నాడు ఆశ్చర్యంగా.

చటుక్కున తేరుకొని బైటలైటు వెల్గించాను.

ఆ వెలుతురులో ఆ వ్యక్తిమొహం చూచాక వాంతి వచ్చినంత పనయింది.

"ఎవరితను?" గుండె దిటువుచేసుకుంటూ అడిగాను.

"మీకు తెలియదా చినబాబూ? వాడు సాంబడు!" చెప్పాడు వెంకన్న.

"సాంబడా?" ఆశ్చర్యపోయాను. దగ్గరగా వెళ్లాను. పదహారేళ్లుంటాయి సాంబడికి. మా ఇంట్లో ఇంతకుముందు వంటచేస్తున్న రత్నమ్మ కొడుకు. ఆవిడ పోయాక నాన్నే వాడ్ని చేరదీసాడు. చిన్నప్పుడు ముద్దుగా, బొద్దుగా వుండేవాడు.

"ఏం జరిగింది? ఇలా వున్నాడేమిటి?" ఆతృతగా అడిగాను.

"మీరేం కంగారు పడకండి. సాంబడికి మతి చలించింది" చలపతి అన్నాడు అప్పుడే వస్తూ.

"మతి చలించిందా?"

"అవును. పోయిన ఏడు ఆ తోటల్లో తిరుగుతూ ఏదో కాయ తిన్నాడు. విషం ఉందేమో అందులో మనిషి మెలికలు తిరిగిపోయాడు. డాక్టరు దగ్గరకు తీసుకువెళితే, నాలుక తీసెయ్యాలని చెప్పాడు. నాలుక తీయించాం. ప్రాణాలతో బ్రతికాడు. కాని, ఆ విషం ఇంకా మిగిలివుండి మతి చలించింది" చెప్పాడు చలపతి.

సానుభూతిగా చూచాను సాంబడి వైపు. వెంకన్న చేతుల్లో గింజుకుంటూ మూలుగుతున్నాడు.

"మరి ఆ చేతులు?" అడిగాను.

"మతి చలించింది కదా? ఏంచేసేది తెలియక చెఱకు రసంతీసే మిషన్‌లో చేతులుపెట్టాడు. రెండుచేతులూ పోయాయి" కళ్ళొత్తుకుంటూ అన్నాడు చలపతి.

నేనేం మాట్లాడలేదు. సాంబడ్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. చిన్నప్పుడు యెంత ముద్దుగా వుండే వాడు? సాంబడి వైపొకసారి సానుభూతిగా చూచి, భారంగా లోపలకు నడిచాను.

"తీసుకువెళ్లి బోనులో కట్టిపడెయ్యండి వెధవని" చలపతి మాటలు విన్పిస్తున్నాయి వెనక నుంచి.

లైటార్పి మంచంమీద పడుకున్నాను గాని నిద్ర పట్ట లేదు. ఆలోచిస్తూ గడిపేసాను ఆ రాత్రంతా.

4

మరుసటి రోజు ఉదయాన్నే లేచి, స్నానంచేసి టిఫిన్ చేసాక నా మిత్రుడు నారాయణ ఇంటికి బయలుదేరాను.

నే వెళ్లేసరికి నారాయణ వాకిట్లో కూర్చొని యెవరితోనో మాట్లాడుతున్నాడు.

"రారా! రాత్రి బాబాయ్ చెప్పాడు నువ్వొచ్చావని. నేనే వద్దాం అనుకుంటున్నాను" ఆప్యాయంగా పలకరించాడు నారాయణ నన్ను చూడగానే.

కుశలప్రశ్నలయ్యాక అడిగాను "రాజారావుగారు ఇంట్లో లేరా?"

"బాబాయ్ లేడు. ఏదో పని వుందని వుదయాన్నే వెళ్లారు. ఇంకాసేపట్లో రావచ్చు కూర్చో!" అన్నాడు కుర్చీ తెచ్చివేస్తూ.

నారాయణే అడిగాడు. "జరిగిన విషయం బాబాయ్ చెప్పాడు. యెనిమిదిలక్షల ఆస్తి అంటే మాటలుకాదు. నా అనుమానం ఆ భూషణం, చలపతి ఇద్దరూ కలిసి దాన్ని తస్కరించారని. కాని, వాళ్లిప్పుడు బెదిరింపులకు లొంగేలా కన్పించడంలేదు....

ఇంకో విషయం మరిచాను. మీ ఇంట్లో సాంబడు

కన్పించాడా నీకు? ఘోరం. వాడి అవతారం చూడలేం. పాపం! అన్యాయం అయిపోయాడు. అయితే వాడి స్థితికి కారణం వాళ్లిద్దరే అని నా అనుమానం" అన్నాడు నారాయణ నెమ్మదిగా.

ఆశ్చర్యపోయాను. అయినా నమ్మకం కల్గలేదు.

నా మొహం వైపొకసారి, "నాకు తెల్సు! నీకు నమ్మకం కల్గడంలేదు. కాని, సరిగ్గా ఏడునెలల క్రిందట హఠాత్తుగా సాంబడు మాయం అయిపోయాడు. ఆ తర్వాత రెండు రోజులకు చలపతి సాంబడ్ని తీసుకువచ్చాడు.

అప్పటికే వాడి నాలుక పోయింది. అయినా యింట్లో వుండేవాడు కాదట. నౌకర్లు చెప్పారు. చలపతిని, భూషణాన్ని రాళ్లతో, వస్తువులతో కొడుతుంటే పిచ్చి పట్టిందని నమ్మించి వైద్యాలపేరిట మొహం అంతా కాల్చి, వాడు బైటకు రాకుండా ఒక బోనులో పెట్టించారు. అయితే ఒక రోజు యెలాగో తప్పించుకొని పారిపోతుండగా చూచి మళ్లీ పట్టుకున్నారు.

అంతే, ఆ మరుసటిరోజే సాంబడి చేతులు తెగిపోయాయి.

ఊళ్లో అంతా ఆశ్చర్యపోయారు. మతి స్థిమితంలేక చెఱకురసం మిషన్‌లో చేతులు పెడితే తెగిపోయాయని చెప్పారు. కేవలం అందరికి వాళ్లమీద ఏదో అనుమానం తప్పితే, ఇవన్నీ వాళ్లే చేసారనడానికి ఋజువులులేవు.

కాని సాంబడి పరిస్థితి చూచాక నాకొక అనుమానం కల్గింది. అదేమిటంటే, బహుశా వాళ్లిద్దరూ కల్సి ఆ నిధిని తస్కరిస్తుండగా గాని, లేదా మరెక్కడైనా దాస్తుండగా గాని సాంబడు చూచివుండవచ్చు. అందుకే వాళ్లు ఎవ్వరికి యెలాంటి ఆధారాలు యివ్వకుండా వుండేలా ఇలా చేసారని



నా అనుమానం" నారాయణ చెప్పడం ఆపాడు.

ఒక్కక్షణం ఆలోచనల్లో పడ్డాను. వయసుమళ్లి, పిల్లా జెల్లలతో కాపురంచేసే వాళ్లిద్దరూ ఇంత ఘోరం చేస్తారని ఊహించుకోడానికి మనస్సు ఒప్పడంలేదు.

"ఒకవేళ నువ్వన్నట్లే జరిగివుంటే, అసలు వాణ్ని హత్యచేసి వుండవచ్చు కదా?" నా అనుమానం బైట పెట్టాను.

"నిజమే! కాని అంత రిస్కు తీసుకోవడం యెందు కనుకొనివుంటారు. అదీగాక, హత్య అంటే, పోలీసులు తప్పకుండా రంగంలోకి దిగుతారు. అప్పుడు తప్పనిసరిగా తమ బండారం బైటపడుతుందని బెదిరిపోయి ఉండవచ్చు" చెప్పాడు.

నారాయణ భార్య కాఫీ తెచ్చి అందించింది. కాఫీ త్రాగి, రాజారావుగారొస్తే ఇంటిదగ్గర కలవమని నారాయణతో చెప్పి ఇంటికి బయలుదేరాను.

నారాయణ మాటలు విన్నాక మనస్సంతా వికలం అయి పోయింది. భయంకరమైన సాంబడి మొహం అనుక్షణం

గుర్తుకొస్తుంది. ఆ బాధతోపాటు భూషణం, చలపతిమీద కోపం ముంచుకొస్తుంది.

ఇంటికి రాగానే నౌఖర్ను పిలిచి, మేనేజర్ల నిద్దరిని పిలవమని చెప్పాను.

ఇద్దరూ వచ్చారు. "మీరు వెళ్లిపోతామన్నారట! ఎందుకు?" కోపాన్ని అణచుకుంటూ నెమ్మదిగా అడిగాను.

"అవును బాబూ! మాకా! వయస్సు అయిపోయింది. ఈ ఆస్తి; లెఖలన్నీ చూసే ఓపిక కన్పించడం లేదు. అందుకే తమరు శెలవిస్తే యెక్కడో దూరంగా మా శేషజీవితం ప్రశాంతంగా గడిపేస్తాం!" అన్నాడు భూషణం నెమ్మదిగా.

"వీల్లేదు! మీరు ఇప్పుడల్లా వెళ్ళడానికి వీల్లేదు. నా ఇంట్లో బ్రహ్మాండమైన దొంగతనం జరిగింది. ఆ విషయం తేలేవరకు యెవ్వరూ వెళ్లడానికి వీల్లేదు!" కోపంగా అరిచాను.

"అంటే? ఆ దొంగతనం మేము చేసామనా?" తీవ్రంగా అడిగాడు చలపతి.

"ఆ విషయం పోలీసులు తేలుస్తారు. ముందు ఈ విషయం చెప్పండి. సాంబడికి నిజంగా పిచ్చిపట్టిందా?" అడిగాను కరుగ్గా.

చలపతి హేళనగా నవ్వాడు. "మీరు చూడలేదా? ఇంకా నమ్మకం కుదరకపోతే సాంబడినే అడగండి చెబుతాడు."

అంతలోనే రాజారావుగారొచ్చారు.

"ఆల్ రైట్! మీరు వెళ్లండి! నేను పొమ్మనేంతవరకు మీరీ ఊరు దాటడానికి వీల్లేదు" హెచ్చరించాను.

ఇద్దరూ వెళ్లిపోయాక అన్నారు రాజారావుగారు. "నాకు నారాయణ చెప్పాడు. ఆ విషయం వినగానే నువ్వేదో చేస్తావనే భయపడుతూ పరుగెత్తుకొచ్చాను. మనం తెగించి అడి

గితే, వాళ్లు తెగించి, తెగతెంపులు చేసుకుని వెళ్లేలా వున్నారు. వాళ్లతో నువ్వింకేం మాట్లాడకు. మిగతా విషయం నేను చూచుకుంటాను" అన్నారు.

తల ఊపి, "ఉదయాన్నే యెక్కడికో వెళ్లారట?" అడిగాను.

"అవును రాత్రి అయిడియా వచ్చింది. ఈ మధ్య ఎప్పుడైనా వాళ్లు వేరే ఊరికి వెళ్లివచ్చారా? అని కనుక్కోడానికి వెళ్లాను."

"ఎందుకు?"

"ఎందుకేమిటి? అపహరించిన నగలు, నగదుగా మార్చుకోడానికిగాని, లేదా దాచిపెట్టడానికిగాని."

తల ఊపి, "ఏమైనా తెల్సిందా?" అడిగాను.

"లేదు. ఈ మధ్య వీళ్లిద్దర్లో ఎవ్వరూ ఊరుదాటి వెళ్లినట్లు చెప్పలేదు ఎవ్వరూ."

"మరయితే...."

"అదే తెల్సుకోవాలి. ఇక్కడే ఎక్కడైనా వుంచారా? లేక మరెక్కడికైనా చేరవేసారా?...." ఆలోచనల్లోపడ్డారు రాజారావుగారు.

"అసలు ఆ గుప్తనిధి యెక్కడ దాచి వుంచారు మీ నాన్న" అడిగాను కుతూహలం ఆపుకోలేక.

"ఇలారా! చూపిస్తాను" అంటూ బాత్‌రూంలోకి తీసుకెళ్లి, అక్కడున్న అద్దం ఊడదీసారు.

అద్దం వెనుకవైపు చిన్న అరలా వుంది. చేతితో నెమ్మదిగా నొక్కారు. మూతవతలికి వెళ్లి పెద్దపెట్టెలాంటిది బైటకి వచ్చింది. లోపలికి చూచాను. ఏమీ లేదు. ఖాళీగా వుంది.

"నిజానికి ఈ ఘోరం జరగడంలో నాదీ తప్పు వుంది.

ఇంతకు ముందు, రెండు మూడు సార్లు ఈ ఊరువచ్చి నప్పుడు వీటినిగురించి పట్టించుకోలేదు. ఎందుకంటే, మాటి మాటికి చూస్తుంటే, ఎవరికైనా అనుమానం కలుగుతుందని. అంతే కాకుండా, ఈ రహస్యం యింకెవరికి తెలియదు అనే ధీమా నేను నిర్లక్ష్యం చేసేలా చేసింది'' అన్నారు నిట్టూరుస్తూ.

నేనేం మాట్లాడలేదు. యెనిమిది లక్షలు కళ్ల ముందు తిరుగుతున్నాయి. గదిలోకి వచ్చి మంచంమీద వాలాను.

రాజారావుగారు చెప్పి వెళ్లిపోవడం లీలగా గుర్తుంది. గాఢనిద్ర పట్టేసింది.

నిద్ర లేచేసరికి నాలుగయింది.

మధ్యాహ్నం భోజనం చెయ్యకపోవడంవల్ల చాలా ఆకలిగా వుంది. గబగబా స్నానంచేసి, టిఫిన్‌చేసి, నారాయణ ఇంటికి వెళ్లాను.

రాజారావుగారు ఇంట్లో లేరు.

బాగా నమ్మకస్తులకు, భూషణం, చలపతులను ఒక కంట కనిపెట్టి వుండమని చెప్పి, నేను, నారాయణ చెఱకు తోటకు బయలుదేరాం.

నాకు మనస్సంతా వికలంగా వుంది. ఇంకో వారం రోజుల్లో పరీక్షలు. ఏం చెయ్యాలో పాలుపోలేదు. పోనీ పరీక్షలకు వెళదామా అంటే, మనస్సు వొప్పలేదు. ఎన్నేళ్లు కష్టపడితే యెనిమిది లక్షలు సంపాదించగలను? అలా అని యింతకాలం చదివి, చివర్లో పరీక్ష పాడుచేసుకో బుద్ధి కావడం లేదు. ఆలోచిస్తూ చిరాగ్గా నడుస్తున్నాను.

నా పరిస్థితి గమనించి కాబోలు నారాయణకూడ మౌనంగా నడుస్తున్నాడు.

చుట్టూ కనుచూపుమేర పచ్చిక పచ్చటి తివాసీలా వుంది. ఇంకా చీకటి పడలేదు. నీరెండకు పచ్చిక మెరుస్తుంది.

నారాయణ "నేచర్‌కాల్" కోసం ఆగాడు. నేను నెమ్మదిగా నడుస్తున్నాను.

ఉన్నట్లుండి హఠాత్తుగా కెవ్వున అరిచాను. నడుం విరిగినంత పనయింది. నేలమీద బోర్లా పడ్డాడు. మొహం అదిరిపోయింది. చటుక్కున లేచి కూర్చొని వెనక్కు తిరిగాను.

ఎదురుగా సాంబడు రొప్పుతూ, యెర్రబడ్డ కళ్లతో నా వైపు చూస్తున్నాడు.

క్షణంపాటు ఆశ్చర్యపోయాను. అంతలోనే కోపం ముంచుకొచ్చింది. లేవబోయాను. నడుం కలుక్కుమంది.

నాకు అర్ధంకాలేదు. సాంబడికి నన్ను కొట్టవలసిన అవసరం ఏమిటి? చేతులు లేకపోవడంవల్ల తలతో నడుంమీద పొడిచాడు. చలపతి చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి. సాంబడికి పిచ్చి కాకపోతే నన్నెందుకు కొడతాడు? చిన్న

ప్పుడు నేనంటే, సాంబడికి ప్రాణం. అలాంటివాడు నన్నెం దుకు కొడతాడు?

దూరంగా నారాయణ వస్తూ కన్పించాడు.

నెమ్మదిగా లేవబోయాను. అంతలోనే పొట్టేలులా దూసుకొచ్చాడు సాంబడు. నా తల అదిరిపోయింది. వెల్ల కిలా పడ్డాను. ఒక్క క్షణం కళ్లు బైర్లుకమ్మాయి. నా జీవి తంలో యింత దెబ్బ యెప్పుడూ తినలేదు. సాంబడిమీద కోపం ముంచుకొచ్చింది.

చటుక్కున లేచి నిలబడ్డాను. నారాయణ చూచినట్లు న్నాడు. పరుగెత్తుకొస్తున్నాడు. మా ఇద్దర్నీ చూడగానే పరుగుతీసాడు సాంబడు.

నేను వదల్లేదు. అసలే చిరాకుగావున్న మనసు కోపంతో మండిపోతుంది. ఇలాంటి పిచ్చి వెధవల్ని వదిలేస్తే చిన్న పిల్లలైనా కొట్టి చంపేస్తారు.

సాంబడు ఎక్కుపెట్టి వదలిన బాణంలా దూసుకుపోతు న్నాడు. నాలోకూడ పట్టుదల పెరిగింది. నారాయణకూడ నా వెనుకే పరుగెత్తుకొస్తున్నాడు.

సాంబడు గుడ్డిగా పరుగెత్తుతున్నాడు. అక్కడ బ్రహ్మాండమైన నేలబావి వుంది.

"అంతే! సాంబడు చిన్న మూసుగుతోపాటు "ధబ్" మని పడిన చప్పుడయింది.

పరుగెత్తాను బావి దగ్గరకు. నాకు తెలుసు. ఒకప్పుడు సాంబడికి ఈతవచ్చు. కాని యిప్పుడు? చేతుల్లేని మనిషి యెలా ఈదగలడు?

లోపలికి చూచాను. చిన్నచిన్న బుడగలు వస్తున్నాయి. సాంబడు మునిగిపోతున్నాడు. పదహారేళ్లుకూడా నిండని వాడి నిండు జీవితం నీళ్లపాలైపోతుంది.

అన్నీ తెల్సి, చూస్తూ మౌనంగా వుండిపోయాను. ఏం చెయ్యను? నాకు ఈతరాదు.

నారాయణ వచ్చాడు. వస్తూనే బావిలోకి దూకాడు. ఆతృతగా చూస్తూ నిలబడ్డాను. క్షణాలు నిముషాలు.... గడుస్తున్నాయి.

చటుక్కున పైకి వచ్చాడు నారాయణ.

"రవీ! ఇక్కడేదో పెద్ద మూట వుంది" అరిచాడు.

"మూటా!" ఆశ్చర్యపోయాను.

నారాయణ మాట్లాడకుండా లోపలికి మునిగి రెండు నిముషాల్లో పెద్ద గోనెసంచితో పైకి వచ్చాడు.

"చాల బరువుగా వుంది. ఏమిటో ఇది" రొప్పు తున్నాడు.

ఏం చెయ్యాలో తోచలేదు.

బావికి మెట్లులేవు. పైకి లాగడానికి తాడులేదు. పెద్దగా అరిచాను.

దూరంగా ఇళ్లకు వెళుతున్న ఇద్దరు రైతులు వచ్చారు. చేతిలోవున్న నాగళ్లు దించి, భుజానవున్న పలుపుతాళ్లు ముడేసి, బావిలోకి వదిలారు.

నారాయణ మూట తాడుకుకట్టి మళ్లీ లోపలికి వెళ్లాడు. అందరం కలిసి మూట పైకి తీసాం.

"రవీ!" అర్చాడు నారాయణ.

క్రిందకు చూచాను. నారాయణ భుజంమీద సాంబడు. చూడగానే తెలుస్తుంది ప్రాణంలేదని. మ్రాన్పడిపోయాను.

ఇద్దర్నీ బైటకు తీసాక రైతులు వెళ్లిపోయారు, సాంబడు చనిపోయిన సంగతి ఊర్లో చెప్పేందుకు.

సాంబడి శవం చూస్తోంటే గుండె తరుక్కుపోతుంది. భయంకరంగా వున్న ఆ మొహంలో యెంత ప్రశాంతత?

"ఏమిటిది?" నారాయణ మూట విప్పాడు. కళ్లు జిగేలు మన్నాయి. గోనెసంచీ నిండా నగలు. నా ఆస్తి. యెనిమిది లక్షల ఆస్తి.

నాకు కళ్లు తిరుగుతున్నాయి. నీరసంగా కూలబడ్డాను.

రాజారావుగారితోపాటు భూషణం, చలపతి కూడ వచ్చారు. నగలు చూడగానే యిద్దరూ ౹మాన్పడిపోయారు.

సాంబడి శవాన్ని, నగల్ని యింటికి తెచ్చాం. ఆ రాత్రికే భూషణాన్ని, చలపతిని పంపేశాను.

సాంబడి శవాన్ని దహనం చేసొచ్చాక గదిలో కూర్చున్నాను. యెదురుగా నగలమూట.

నేలమీద కుమ్మరించాను. గదంతా వెలుగుపరచుకున్నట్లయింది.

ఎన్ని నగలు? యెంత ఆస్తి? నాకు సంతోషం కలగడం లేదు. నోరులేని మూగజీవి త్యాగం గుర్తుకొస్తుంది. చేతులు తెగి వికృతంగా మారిన సాంబడి మొహం కన్పిస్తోంది అందులో.

రెండు కన్నీటిబొట్లు రాలాయి. ★

ఆక్సిడెంట్ ?

గిరి :—నిన్న రాత్రి కాజీపేట జంక్షన్‌లో జయంతి జనతా ఎక్స్‌ప్రెస్‌లకు ఆక్సిడెంట్ అయిందిరా!

రవి :—పాపం! ఎంతమంది చనిపోయారో?

గిరి :—నేను సుమారు యాభైమందిని లెక్కపెట్టే సరికి మా అమ్మ నన్ను నిద్రలేపిందిరా!?

సి. హెచ్. అంజయ్య, బహదుర్‌పుర.

హాస్టల్లో దొంగతనాలు

క్వీన్స్ మెడికల్ కాలేజి హాస్టలు వార్డెను అనూరాధ, తలుపులు దబదబ చప్పుడు కావడంతో, మంచంపైనుంచి బద్ధకంగా లేచి తలుపు తీసింది.

ఎదురుగా నలుగురు అమ్మాయిలు కనుపించారు. అందరి ముఖాల్లోనూ ఆతృత, ఆందోళన కనుపించాయి.

"ఏమయింది. ఇంత తెల్లవారే పరుగెత్తుకొచ్చారు?" అడిగింది అనూరాధ.

"మళ్లీ దొంగతనం జరిగింది!" అంది అందరికీ ముందున్న మాధురి.

"ఎవరి గదిలో?"

"మా గదిలోనే!"

"అంటే నలుగురూ ఒక గదిలోనే వున్నారా?"

"లేదండీ! వాళ్లిద్దరూ వాళ్ల గదిలోనేవున్నారు. నేనూ, సరిత మాత్రం వున్నాం మా గదిలో" అంది మాధురి.

"ఈసారి ఏం పోయింది?"

"నా బంగారు చైన్ పోయింది" అంది మాధురి ఏడుపు మొఖం పెడుతూ.

వార్డెన్‌కు ఆశ్చర్యంగావుంది. అందరూ మెడిసన్ చదువుతున్న అమ్మాయిలు. మొత్తం అరవైమంది మించి లేరు. ప్రతి అమ్మాయి తల్లిదండ్రులూ బాగా ఆస్తిపాస్తులు వున్నవారు. తమ పిల్లలకు ఏది కావాలన్నా, నిముషాల్లో తెచ్చి యివ్వగల సమర్థతగల వాళ్లు. అలాంటప్పుడు ఇలా దొంగతనాలు చెయ్యవలసిన అవసరం యెవరికి కలుగుతున్నదో అర్థం కావటంలేదు.

పోయినవారం సుందరి రిస్టువాచీ పోయింది. మొన్న మరో అమ్మాయి పర్సు, ఇంకో అమ్మాయి డబ్బులు, ఇలా చిన్నవీ, పెద్దవీ, అడపాదడపా పోతూనేవున్నాయి.

"నీ గదికిలోపలనుండి బోల్ట్‌చేశావా?"

"లేదండీ!" అంది మాధురి.

"ఎందుకని?" అడిగింది అనూరాధ.

"రాత్రి చదువుకుంటూ వుండిపోయాను. అలా తెలీకుండానే నిద్రపోయాను. సరిత తలనొప్పిగా వుందంటూ టాబ్లెట్ వేసుకుని పడుకొంది. లైటు ఆర్పడం కూడా మరచిపోయాం" అంది మాధురి.

"చైన్ మెళ్లో వుండిందా? లేక తీసి బైటపెట్టావా?"

"కాలేజి నుండి రాగానే తీసి డ్రాయరులో పడేశాను. దాంతో పర్సు కూడా పెట్టాను. పర్సులో మూడొందలుంది. దాన్ని తాకలేదు. కానీ చైన్ మాత్రం దొంగిలించారు."

"చిత్రంగా వుందే?"

"చిత్రమేమిటండీ! ఇదెవరో బయటవాళ్లు వచ్చి చేసింది గాదు. ఇక్కడున్నవాళ్లే చేసివుండాలి. ఆ దొంగెవరో పట్టుకొని మీరు హాస్టలు నుంచి తరిమేస్తే తప్ప మేము సుఖంగా ఇక్కడుండి చదువుకోలేము మేడమ్!" అంది మాధురి.

"అంతేనండీ!" అన్నారు చుట్టూ వున్న మిగిలిన అమ్మాయిలు.

"సరే మీరు వెళ్లండి! నేను ఏం చెయ్యాలో ప్రిన్స్‌పాల్ గారితో ఆలోచిస్తాను. ఆ తర్వాత మీకు చెబుతాను" అంది వార్డెన్ అనూరాధ.

"మాకే సంగతి సాయంత్రం చెప్పండి. లేకుంటే పోలీస్ రిపోర్ట్ ఇస్తాం!"

"పోలీసుల జోలికి పోకండి. అనవసరమైన బాధలు కలుగుతాయి. ఆ దొంగెవరో మీలో ఒకరు అంటున్నారు కాబట్టి. మనం జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. ఇంకంతా వెళ్లిపొండి!" అంది అనూరాధ.

కాలేజీ కెళ్లాక అనూరాధ ప్రిన్స్‌పాల్‌గార్ని కలుసుకుని జరుగుతున్న దొంగతనాల గురించి వివరంగా చెప్పింది.

ఆయన అంతా విని, కొన్ని సూచనలు చేసి అవి అమలుజరిపి చూడమన్నాడు. కొన్నాళ్లపాటు, యెవరి గెస్టలను హాస్టల్‌లో రాత్రిపూట వుండనీయవద్దని చెప్పాడు. హాస్టలుకు కాపలావుండే గూర్ఖాను ఒకకంట కనిపెట్టి

వుండమన్నాడు. ఏ పరిస్థితిల్లోనూ పోలీసులకు మాత్రం పిర్యాదు చెయ్యవద్దని అనూరాధకు సలహా ఇచ్చాడు.

అనూరాధ అన్నీ విని వచ్చేసింది.

ఆ సాయంత్రం అందర్నీ భోజనాల టైములో కలుసుకుంది. వాళ్లు ఏయే జాగ్రత్తలు తీసుకోవలసిందీ చెప్పింది. తను భోజనంచేసి వచ్చి, తన గదిలో పడుకుని పుస్తకం చదువుకోసాగింది.

ఆమెకు క్రిమినాలజీపైన చదివిన కొన్ని వ్యాసాలు గుర్తొచ్చాయి. కొంతమంది సరదాకోసం, మరికొంతమంది ఒక విధమైన థ్రిల్‌కోసం, మరి కొంతమంది ఆరోగ్య కారణాల వలన, చిన్నచిన్న దొంగతనాలు చేస్తుంటారని చదివింది.

ఇంకొంత మంది నిద్రలో నడిచే అలవాటువున్న వాళ్లుంటారు. ఆ అలవాటుకు తోడు దొంగతనాలుచేసే అలవాటు కూడా వుండివుండే అవకాశం వుందేమోననిపించింది.

హాస్టలులోవున్న అరవై మందిలో యెవరో ఒకరు ఈ దొంగతనాలు చేస్తూవుండాలనేది ఆమెకు నిస్సందేహంగా తోచింది. అయితే పట్టుకోవడమెలాగన్నదే ప్రస్తుత సమస్య.

అలారం టైమ్‌పీస్‌కేసి చూసింది. గంట పన్నెండు చూపించింది.

ఓ మారు లేచివెళ్లి రౌండ్స్ తిరిగొద్దామనుకుంది. 'ఎల్' ఆకారంలో వుంది బిల్డింగ్. ఒక్కోవైపు పదిహేను గదులున్నాయి. గదికి ఇద్దరు చొప్పున వుంటున్నారు స్టూడెంట్స్. వరండాలో లైట్లు వెలుగుతున్నాయి. ఒక్కొక్క గదే పరిశీలిస్తూపోతూ వుంది.



ఆ రాత్రి ఆమె చెప్పినట్లు అందరూ లోపలివైపు నుంచి తలుపులకు గొళ్ళెం పెట్టుకొన్నారు. కిటికీల తలుపులు మాత్రం తీసివుంచుకున్నారు.

అన్నీ గదులు చూసి తిరిగి వచ్చి పడుకుంది. స్విచ్ ఆపబోయేంతలో కరెంటు పోయింది. అలా రోజు నాలుగైదుసార్లు కరెంటు పోవటం మామూలే అయినా, స్విచ్ ఆఫ్‌చేసి మళ్లీ తలుపు తెరచుకొని వెలుపలకు వచ్చింది.

తనగది గుమ్మం దగ్గరే నిలుచునే, దూరంగావున్న గదులకేసి పరిశీలనగా చీకటిని చీల్చుకుంటూ నిశితంగా చూడసాగింది. ఎవరూ తలుపులు తెరిచినట్లు కనుపించలేదు. లోనికివెళ్లి పడుకుంది.

ఆ తర్వాత పది నిముషాలకు కరెంటు వచ్చింది ఫాను తిరగడం మొదలెట్టడంతో ఆమెకు ఆ సంగతి అర్థమయింది. తలగడలు, తలక్రింద సర్దిపెట్టుకొని, దుప్పటి కప్పుకుని పడుకుంది.

అంతదాకా మేలుకుని వుండటంతో ఆమెకు తెలీకుండానే శరీరం నిద్రమత్తులో వాలిగిపోయింది.

2

తెల్లవారేసరికి నళిని మరో ఇద్దరు వచ్చి తలుపులు తట్టడంతో లేచి తలుపుతీసింది వార్డెన్ అనూరాధ.

"ఏమైంది?"

"మళ్లీ దొంగతనం జరిగింది!" చెప్పింది నళిని.

"ఎవరి గదిలో?"

"నా గదిలో."

"ఏం పోయింది?"

"నిన్న కొనితెచ్చుకున్న గాజి సిల్కుచీర పోయింది."

"ఎక్కడ పెట్టావ్!"

"కిటికీ ప్రక్కనేవున్న టేబుల్‌పైన పెట్టాను."

"అయితే కిటికీ ఇవతలనుంచి యెవరైనా లాగేసుకుపోవచ్చు. రాత్రి పన్నెండు గంటలదాకా నేను మేలుకునే వున్నాను. ఈ దొంగతనం ఆ తర్వాత జరిగివుండాలి. సరిగ్గా అప్పుడే పదిహేను నిముషాలు కరెంటు పోయింది" అంది వార్డెన్.

"ఏమోనండీ! ఈ పరిస్థితి చూస్తూంటే మమ్మల్నెవరన్నా ఎత్తుకుపోయినా దిక్కులేనట్లుంది. హాస్టల్‌లో వుండాలంటే భయంగానే వుంది. ఏదో విధంగా దొంగతనాలు చేసిన మనిషిని పట్టుకోకపోతే మేమంతా హాస్టలు ఖాళీచేసి వెళ్లిపోవలసి వస్తుంది" అంది నళిని నిరాశ నిస్పృహ, కోపం మేళవించి.

"ఏమిటా వాగుడు? కావాలని మేనేజిమెంటు దొంగతనాలు చేయిస్తున్నదంటారా? ఆ దొంగలెవరో మీలోనే వున్నారు. మీలో దొంగను మీరు పట్టుకోలేకపోతే మరె

వరు పట్టుకుంటారు. మీకందరికీ జాగ్రత్తగా వుండమనీ, విలువైన వస్తువులు దాచిపెట్టుకోవాలనీచెప్పాను. ఏమాత్రం అలికిడి అయినా, లైటువేసి అరవమన్నాను. అంతకన్నా నేను చేయగలిగిందేమీ కనిపించడంలేదు"అంది అనూరాధ ఆవేశంగా.

"మీరు చేయగలిగింది కనుపించడంలేదు గాబట్టే, మేము ఇలా భయపడి చస్తున్నాం. మా నాన్నగారు పోలీసు ఆఫీసరు. మీరు అనుమతిస్తే ఆయనకు ఫోన్‌చేసి చెపుతాను. క్షణంలో ఆ దొంగను పట్టుకుంటారు...." అంది నళిని.

"ఈ కాంపౌంట్‌లోకి పోలీసుల్ని రానివ్వటమా లేదా అన్నది నేను నిర్ణయించేది గాదు. ప్రిన్సిపాల్‌గార్ని పర్మిషను అడగాలి. నిన్న ఆయనతో మాట్లాడాను. ఆయన ఒప్పుకోలేదు. ఆయన చెప్పిందంతా రాత్రి మీకు చెప్పాను. ఆయన తీసుకోమన్న జాగ్రత్తలన్నీ తీసుకున్నాం" అంది అనూరాధ.

"అయినా రాత్రి మళ్లీ దొంగతనం జరిగింది" అన్నారు అక్కడున్న అమ్మాయిలంతా యేక కంఠంతో.

వార్డెన్ అనూరాధ మౌనంగా వుండిపోయింది.

"అందుకే పోలీసుల్ని పిలవమంటున్నాం!"

"మీ యిష్టం! మీరు వెళ్లి ప్రిన్సిపాల్‌గార్ని అడగండి" ఇక ఈ గొడవలో తనకు సంబంధం లేదన్నట్లు లోనికి వెళ్లిపోయింది అనూరాధ.

హాస్టలు అమ్మాయిలంతా కలపి కట్టుగా వెళ్లి ప్రిన్సిపాల్‌ని చూశారు. జరిగిందంతా వివరించి చెప్పారు.పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పర్మిషన్ కావాలని అడిగారు.

ప్రిన్సిపాల్‌గారు అంతా విన్నారు.

"పోలీసులు కోర్టులు వీటి విషయం మీకు బాగా తెలిసినట్లులేదు. వాళ్ల కేసులు సాక్ష్యాలపైన ఆధారపడతాయి. మీలో ఒకరు దొంగతనం చేసినట్లు పదిమంది సాక్ష్యం చెప్పారనుకుందాం. ఆ అమ్మాయిని వాళ్లు అరెస్టుచేసి కేసు పెడతారు శిక్ష పడుతోంది. వెంటనే జరిగేదేమిటో తెలుసా? నేను ఆ అమ్మాయిని కాలేజినుంచి డిస్మిస్ చేస్తాను. ఇదంతా లేనిపోని గందరగోళం అవుతుంది.

నాకు తెలిసినంతవరకు మీలో యెవ్వరికీ మరొకరి వస్తువులు దొంగలించవలసిన అవసరంలేదు. అందువల్ల ఇదేదో మిస్టరీలాగుంది. ఇవాల్టినుంచి నాలుగురోజులు నేను హాస్టలుకు వస్తాను. రాత్రంతా కాపలా కాస్తాను. నాతోపాటు మీలో కొందరికన్నా కూడా కాపాలాకాసే పని అప్పచెపుతాను. ఆ తర్వాత చూద్దాం!" అన్నాడు ప్రిన్సిపాల్.

అందరూ మరేం మాట్లాడలేక వెళ్లిపోయారు.

ఆ తర్వాత ఫోన్ తీసుకుని ఒక నెంబరు డయలు చేశాడు. అవతలివైపునుండి రెస్పాన్స్ రాగానే "హల్లో! నేను మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌ను మాట్లాడుతున్నాను" అన్నాడు.

"ఏమిటి విశేషాలు?" అడిగింది అవలివైపు కంఠం.

"మీతో కొద్దిగా పనివుంది" అన్నాడు ప్రిన్సిపాల్.

"రమ్మంటారా?"

"వద్దు! నేనే గంటలో వస్తాను" అన్నాడు ప్రిన్సిపాల్.

"అయితే మీకోసం కాచుకుని వుంటాను" అన్నాడవతలి వ్యక్తి.

ప్రిన్సిపాల్ ఫోన్ పెట్టేస్తూండగా, అనూరాధ లోనికొచ్చింది.

"హాస్టలుమేట్స్ వచ్చారు గదండీ!" అడిగింది కూర్చుంటూ.

"ఆఁ! వాళ్ళకేదో సర్దిచెప్పి పంపాను. పోలీసు కంప్లయింటు ఇవ్వాలని పట్టుపట్టారు. లాభం లేదన్నాను. ఇంతకు ముందే నా ఫ్రెండ్‌కి పెద్ద పోలీసాఫీసరుతో మాట్లాడాను. ఆయనతో సంప్రదిస్తాను. ఇవాళ రాత్రినుండి నాలుగు రోజులు నేను హాస్టల్‌లో వుంటాను. మీరు శెలవు తీసుకోండి. ఆ దొంగను పట్టుకున్నాక రావచ్చు" అన్నాడు ప్రిన్సిపాలు.

"థాంక్స్! నా గది తాళాలివిగోండి. ఈ నాలుగురోజులు నా గదే వాడుకోండి!" అంది అనూరాధ.

"అలాగే!" అంటూ తాళాలు అందుకున్నాడు ప్రిన్సిపాలు.

అనూరాధ లేచి వెళ్ళిపోయింది.

3

ఆ రాత్రి హాస్టలులో అందరి అమ్మాయిల్ని సమావేశ పరిచాడు ప్రిన్సిపాల్.

"మీలో వస్తువులు పోగొట్టుకున్నవాళ్లు లేచి నిల బడండి!" అన్నాడు.

ఐదుగురు అమ్మాయిలు లేచి నిలుచున్నారు.

"అందరూ నా దగ్గరకు రండి!" అన్నాడు ప్రిన్సిపాలు.

ఐదుగురు అమ్మాయిలు వచ్చారు ప్రిన్సిపాల్ దగ్గరకు.

"మీవి ఒక్కొక్క వస్తువే పోయిందా, లేక రెండేసి పోయాయా?" అడిగాడు ప్రిన్సిపాలు.

"ఒక్కొక్కటే సార్!"

"రైట్! మిగిలినవాళ్లంతా ఇక్కడే కూర్చునుండండి" అంటూ అంతకు ముందే సేకరించిన అన్ని గదుల తాళాలు తీసుకుని ఆ ఐదుగుర్నీ వెంటబెట్టుకుని ఒక్కొక్క గదే వెతికించసాగాడు. అర అంగుళంకూడ వదలకుండా ప్రతి గదీ తనిఖీచేశాడు. దొంగిలించబడ్డ ఏ వస్తువూ చిక్కలేదు.

"సారీ అనవసరంగా శ్రమపడ్డాం! ఆ వస్తువులు దొంగిలించినవాళ్లు యిన్నిరోజులు యింకా యిక్కడ వుంచుతారా? యెప్పుడో వాట్ని మాయంచేసి వుంటారు?" అంది నళిని.

"అయినా ఇది పద్ధతి. ముందు మీలో యెవరూ దొంగతనం చేయలేదనీ; యెవ్వరి గదుల్లోనూ దొంగిలించబడ్డ వస్తువులు లేవని ఋజువు చేసుకోవడం మంచిది" అన్నాడు ప్రిన్సిపాల్.

"తర్వాత కార్యక్రమమేమిటి సార్!" అడిగింది సుందరి.

"మీరు ఐదుగురు. నాతో కలిపి మొత్తం ఆరుగురం. అటుప్రక్కనున్న గదుల ముందు ముగ్గురూ, ఈవైపు గదుల ముందు ముగ్గురూ, తెల్లవారిందాకా పహరా తిరుగుదాం!" అన్నాడు ప్రిన్సిపాల్.

"తెల్లవారిందాకానా?"

"ఆఁ!"

"అబ్బ నిద్రలేకుండా యెలాసార్ తిరగడం" అడిగింది నళిని.

"ఒక్కరోజుకు నిద్రలేకపోయినా ఫరవాలేదు.... దొంగను పట్టుకోవాలి. ఆ దొంగ చిక్కితే...." అంటూ ఆగిపోయారు.

"సార్! మీరేమీ అనుకోనంటే నాదొక చిన్న విన్నపం!" అందో అమ్మాయి.

"ఏమిటి?"

"మీరు స్టూడెంట్స్ గదులన్నీ వెతికారు. కానీ కిచెన్, వంటామె గది, వార్డెన్ రూం వెతకలేదు. అవికూడా వెతికితే బాగుంటుందనిపిస్తుంది" అందా అమ్మాయి.

"అరే! నాకు గుర్తేలేదు. మీకు మీ వార్డెన్ అనూరాధ పైనకూడా అనుమానం వుందన్నమాట. పదండి ముందు ఆమె గదే వెతుకుదాం!" అన్నాడు ప్రిన్సిపాల్.

అంతా అనురాధ గదికేసి వెళ్లారు.

గదంతా వెతికారు. ఏ వస్తువూ కనిపించలేదు. మంచం పైనున్న పరుపు పైకెత్తారు. దానిక్రింద గాజిసిల్కు చీర, బంగారు లాకెట్, మొదలైన వస్తువులు కనుపించాయి.

అందరూ తెల్లబోయారు.

"చూశారాసార్! అసలు దొంగ ఇక్కడుంటే మనం హాస్టలంతా తిరిగాం!" అంది నళిని.

"అవును!" అంటూ ప్రిన్సిపాల్ జేబురుమాలులో నెక్లెస్‌ను, వేరే న్యూస్ పేపరుతో చీర పాకెట్‌ను, పైకెత్తి పట్టుకున్నాడు.

"యెందుకుసార్ అలా కవర్‌చేసి పట్టుకుంటున్నారు?" అడిగింది మాధురి.

"వీటిమీద వ్రేలిముద్రలుంటాయి. అవి యెక్స్పోజ్ చేయిస్తే అసలు దొంగలెవరో తెలుస్తుంది!" అన్నాడు ప్రిన్సిపాల్.

అక్కడున్న అందరి మొఖాలు కత్తి వేటుకు నెత్తురు చుక్క రానట్లుగా మారాయి.

"వాట్ని పోలీసులకు పంపుతారా?" అడిగారు అమ్మాయిలు.

"ఆc!" అన్నాడు ప్రిన్సిపాలు.

"వద్దుసార్! అవన్నీ మేమే తెచ్చి వార్డెన్‌రూంలో పెట్టాము." అన్నారు ఏడుస్తూ.

"యెందుకు చేశారు?"

"ఆమెను దొంగగా చిత్రిస్తే ఆమెను మీరు యిక్కడ్నుంచి పంపించివేస్తారని. అనూరాధగారు చాలా స్ట్రిక్ట్‌గా వుంటుంది. ఏడు గంటలకల్లా హాస్టలుకు రావాలంటుంది. బాయ్‌ఫ్రెండ్స్ నెవ్వరినీ ఈ పరిసరాలకు రానివ్వదు. సినిమాకు వెళ్తామంటే తనూ వస్తానంటుంది. ఈమెను వదిలించుకుందామని ఈ పని చేశాం!" అన్నారు అందరూ.

"ఈ విషయం ముందే ఊహించాను. ఇంకొకరికి తెలియకుండా ఇన్ని దొంగతనాలు జరగవనీ, ఏదో వేరే కారణం వుండి ఇలాంటి దొంగతనాలు జరుగుతుండి వుంటాయనీ, ఇందుకు బహుశా కారణం వార్డెన్ మీపై విధిస్తున్న క్రమశిక్షణే అయివుంటుందనీ, నా ఫ్రెండు పోలీసు ఆఫీసరు అనుమానించి యేం చెయ్యవలసిందీ చెప్పాడు.

మీ మంచి కోరి, మీ అభివృద్ధిని కాంక్షించి, మీ కోసం సేవచేసే వ్యక్తికి మీరు కట్టదలచుకున్న పట్టం చాలా

బాగుంది. మీరు నా కాలేజీలో చదివే స్టూడెంట్స్ అని చెప్పుకోవటానికి సిగ్గుపడుతున్నాను...." అన్నాడు ప్రిన్సిపాల్.

"సారీ సార్! ఇకపైన ఇలా ప్రవర్తించం. బుద్ధిగా వుంటాం...." అన్నారందరూ.

"గుడ్! మీరు అనూరాధగార్కి క్షమాపణ చెప్పుకోండి" అంటూ వెళ్ళిపోయాడు ప్రిన్సిపాల్. ★

మొదటి రైలు?

"ఏమండీ! ఉదయాన్నే మొదటి రైలుకు రాలేకపోయారా?"

"దానికే రావాలనుకున్నా. కాని రైలు పట్టాలు సరిగా ఉన్నాయో, లేదో తెలుసుకునేందుకు మొదటిదాన్ని వదిలేసి రెండో రైలుకు వచ్చాను!"

—కె. నాగభూషణ, బత్తలపల్లి.

"థాంక్స్!"

రాము :—గోపీ! ఆ బస్సులో అమ్మాయి నీతో ఎందుకలా దెబ్బలాటకు దిగింది?

గోపీ :—ఏం లేదురా. పొరపాటున ఆ అమ్మాయి కాలు త్రొక్కి 'సారీ' అనబోయి 'థాంక్స్' అన్నా-అంతే!!

సి. హెచ్. అంజయ్య, బహదుర్‌పుర.

చేయకురా చెలిమి

మోదుకూరి జితేంద్రశర్మ

ఆ వేళ మురళీ మా యింటికి వచ్చేసరికి నేను కలకత్తా వెళ్ళే హడావుడిలో వున్నాను.

విజయవాడ నుండి మా మనిషి తెచ్చిన నాలుగున్నర కిలోల బంగారం, బిస్కెట్ రూపంలోవున్న బంగారాన్ని బెల్ట్ వెనక వైపున్న పాకెట్స్‌లోకి దూర్చి నడుముకి తగిలించుకొన్నాను. దానిమీద పేంటు, బనీను వేసి, షర్ట్ యిన్ చేసి, కోటు తొడుక్కున్నాను. ఇపుడు నా దగ్గర కొన్ని వేల రూపాయల విలువ చేసే బంగారం వుందని ఎవరూ అనుమానించలేదు.

"ఎక్కడికో బయల్దేరుతున్నట్లుందే?" నా సన్నాహం చూపి అడిగేడు మురళీ. మురళికి నేనంటే ప్రాణం. నాకూ అంతే!

"కలకత్తాకి" చెప్పేను. హుషారుగా వుంది నాకు. ఈ బేరం సజావుగా సాగిపోతే సుమారు నలభై వేల రూపాయలు ఆదాయం నాకు.

"వెరీగుడ్! మళ్ళీ ఎపుడు రాక!"

"మూడు రోజుల్లో!" ఎర్‌బాగ్‌లో బట్టలు కుక్కుతూ అడిగేను. "నువ్వూ రాకూడదూ!"

"నేనా!" చిన్నగా నవ్వేడు మురళి. "ఎందుకులే."

"రారా! సరదాగా వెళ్ళొద్దాం!" అన్నాను బ్రతిమాలుతున్నట్లుగా.

"నాకూ రావాలనుంది కానీ...." సందిగ్ధంగా ఆగేడు.

"ఊఁ! కానీ"

"ఒకటీ డ్రెసెస్ రెడీగాలేవు. రెండవది డబ్బుల్లేవ్!"

"రెండూ రూల్డ్ అవుట్! నా డ్రెసెస్ వేసుకో! నాతో బయల్దేరుతున్నపుడు డబ్బు ప్రసక్తి అనవసరం." కోపంగా అన్నాను.

మురళి నాలాగా డబ్బున్నవాడు కాదు. మధ్య తరగతి కుటుంబం వాళ్ళది.

మొఖమాట పడుతూనే తయారయేడు. "అలా కొట్టుకి వెళ్దాం పద" అన్నాను తయారయిన మురళితో. దార్లో చెప్పేను మురళికి కలకత్తా ఎందుకు వెళుతున్నదీ.

కొట్టుదగ్గర నాన్నగారి దగ్గర్నుంచి యిన్‌స్ట్రక్షన్స్ తీసుకొన్నాను, సుమారు అరగంటసేపు. ప్రతీవారం వినే సలహాలే! అయినా వినకపోతే ఆయన నొచ్చుకుంటారు. ఆ సమయంలో మురళి యింటికివెళ్ళి చెప్పి వచ్చేసేడు, తనూ

నేనూ కలకత్తా వెళుతున్నట్లు.

శ్రీకాకుళంకి తొమ్మిది కిలోమీటర్ల దూరం స్టేషన్. శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఆముదాలవలసలో ఉంది.

ఆ రోజు సోమవారం. మధ్యాహ్నం మూడుగంటల నలభై నిమిషాలకి హౌరా-మద్రాస్ మెయిల్ ఎక్కాం నేనూ మురళి.

కిటకిట లాడుతోంది ట్రైయిన్. కొద్దిగా యిన్ఫ్లుయెన్స్ చేసి, త్రీటైర్ కంపార్ట్మెంట్ లో జొరబడ్డాం. మెయిల్ లో ఉండే టీ.టీ లందరూ నాకు పరిచయస్థులె. అందుచేత ఎపుడూ యిబ్బంది వుండదు. రేపు వుదయం ఎనిమిది అవుతుంది కలకత్తా చేరేసరికి.

పలాసాలో టిఫిన్ చేసి కులాసాగా కూర్చున్నాం.

సినిమాల్లో హీరో సూట్ కేస్నిండా బంగారం బిళ్ళలతో సునాయాసంగా పారిపోవటం చూపిస్తారు కానీ, అది ఎంత బరువో మోసేవాళ్ళకి తెలుస్తుంది.

నాలుగున్నర కేజీల బంగారం నన్ను సరిగ్గా నడవ నీయటంలేదు. బెల్ట్ టైట్ అయి నడుము నొప్పెడుతోంది.

మురళి అది గమనించి అడిగేడు. "నీకష్టం అయితే నాకిచ్చేయ్!"

కాస్సేపు ఆలోచించేను నా నడుం నొప్పిని భరించ లేక పోతున్నాను. ఇంతకు ముందెన్నడూ లేదు యిలా. మురళీ సలహాని ఒప్పుకున్నాను. లావెటరీలోకి వెళ్ళి మార్చుకొన్నాం యిద్దరం.

రాత్రి అయింది.

బరంపురంలో మీల్స్ చేసి, బెర్త్లు ఎక్కి పడుకున్నాం.

కిటికీలమీద వుండే సింగల్ బెర్త్ మురళిది. ఎదురు గుండా వుండే మూడు బెర్త్లలో పైది నాది.



మెయిల్ జోరుగా పోతోంది, ఆనందంగా కూత వేస్తూ!

2

ఎవరో లేపుతున్నారు నన్ను.

కాలిమీద తట్టి లేపుతున్నారు. కళ్ళు భారంగా మూతలు పడుతున్నాయ్. బలవంతంగా విప్పిచూసేను.

టీ.సి. కాదు నన్ను లేపుతోంది.

నలుగురు వున్నారు. వాళ్ళని చూసి ఆశ్చర్యపోయాను. దిగ్భ్రాంతిగా చూస్తూ వుండిపోయేను అలా!

ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన ఇన్‌స్పెక్టర్స్ వాళ్ళలో యిద్దరు. ఇద్దరు ఒరిస్సా స్టేట్ పోలీస్.

మెయిల్ ఆగివుంది.

ఆశ్చర్యపోతూ దడదడ లాడుతున్న గుండెలతో బెర్త్ దిగేను.

"మీరు బంగారం స్మగుల్ చేస్తున్నట్లు తెలిసింది. మర్యాదగా లొంగిపోండి?" అన్నాడొకతను ముందుకు వచ్చి ఇంగ్లీషులో.

"నో! నో! అదేంలేదే! మీరు కావలిస్తే చెక్ చేసుకోవచ్చు" అన్నాను తడబాటుగా!

ఎలా తెలిసింది వీళ్ళకి!! నా మనస్సులో ప్రశ్న సుళ్ళు తిరుగుతోంది.

చిన్నగా నవ్వేడతను. "నో, మిస్టర్! యూ ఆర్ స్మగ్లింగ్ ఫోర్ అండ్ హాఫ్ కిలో గోల్డ్, ఎండ్ యూ ఆర్ ఎకాంపనీయింగ్ విత్ ఎ కారియర్! శ్రీకాకుళం ఎక్సయిజ్ మాకన్ని వివరాలూ పంపింది" కరుగ్గా వుంది అతని కంఠం. "డోంట్ ట్రైటు యెస్కేప్!"

"నో, నో, మీకెవరో రాంగ్ యిన్ఫర్మేషన్ యిచ్చేరు. యూ కెన్ చెక్ మీ!" అన్నాను చేతులు పైకెత్తుతూ.

"డోంట్ ట్రైటు కన్విన్స్ మీ మిస్టర్ ప్రభాకర్!" అన్నాడతను మళ్లీ.

నా పేరు తెలిసేసరికి ఆశ్చర్యపోయేను. నో మోర్. వీళ్లకియెవరో పూర్తి యిన్ఫర్మేషన్ యిచ్చేసేరు.

మెయిల్‌కి వున్న డీజెల్ యింజెను ఆలస్యం యెందు కన్నట్లు పెద్దగా కూత బెట్టింది.

"గెట్‌డౌన్ మిస్టర్ ప్రభాకర్! బై దిబై వేరీజ్ యువర్ కేరియర్" చిన్నగా నవ్వుతూ అన్నాడతను "మాకు తెలుసు, మీదగ్గర గోల్డ్ వుండదనీ, మీ కేరియర్స్ మోస్తారని వేరీజ్ హీ!"

మురళికోసం చూసేను.

లేడు!

మురళి బెర్త్‌మీద లేడు. వాడు పరుచుకొన్న ప్రక్క ఉంది. అంతే!

ఆ యిన్‌స్పెక్టర్ కూడా అపుడే గమనించినట్లున్నాడు. నావైపు తిరిగి కోపంగా అరిచేడు. "వేరీజ్ హీ!"

నా మనసులో ఆలోచన తళుక్కుమంది. "ఇన్‌స్పెక్టర్ నేను చెప్పేను మీకెవడో తప్పు సమాచారం అందించేడు.

యూ వార్ రాంగ్ విత్ది క్రూక్!" అన్నాను.

"షెటప్" అరిచేడతను. "నో, మిస్టర్ ప్రభాకర్. మీతో యింకో వ్యక్తి మురళి వచ్చేడు. లేకపోతే ఈ ప్రక్క వుండదు. టీ.సీ. సాక్ష్యమూ వుండదు. ఎక్కడతను?"

నాకూ అర్థంకాలేదు ఏమయినాడో!

టీ.సీ. వచ్చి అన్నాడు యిన్స్పెక్టర్తో "మిస్టర్ శ్రీవాత్సవ! యూ బెటర్ గెట్డవున్ ది ట్రైన్. ది టైమ్ ఈజ్ ఓవర్."

"ఓ.కే. ఓ. కే." అంటూ నావైపు తిరిగేడు. "గెట్ డౌన్ మిస్టర్."

నాకు తెలుసు, గోల్డ్ నాదగ్గర దొరకందే వీళ్లేం చేయలేరని. కానీ నాకు అంతు పట్టనిదీ, తెలియనిదీ ఒక్కటే! యెదుటి బెర్త్లో పడుకొన్న మురళి ఏమయేడో?!

ట్రైన్ దిగుతూ స్టేషన్ పేరుకోసం చూసేను. 'కటక్' మురళికోసం అటూ యిటూ చూడసాగేను. ఓ స్థంభం వార నీడ కదిలింది. అటు పరీక్షగా చూసేను.

అదే నే చేసిన తప్పు!

నన్ను పరీక్షగా గమనిస్తున్న శ్రీవాత్సవ కళ్ళు కూడా అటు తిరిగేయ్.

"దేరీజ్ దట్ కల్ప్రిట్! అరెస్టుహిమ్!" అని గట్టిగా అరిచేడు.

సుమారు పదిహేనుమంది కాన్స్టేబుల్స్, ఇన్స్పెక్టర్స్ అటు పరిగెట్టేరు. మురళి అది గమనించి పరిగెట్టేడు అక్కడ్నించి.

ఒక ఆఫీసర్ ఫైర్చేసేడు మురళి కాళ్ళవైపు. అదే

సమయంలో జారిపడ్డాడు మురళి. కాళ్ళకి తగలవలసిన గుండు వెన్నులోంచి దూసుకుపోయింది.

"నో!" పిచ్చిగా అరిచేను.

మెయిల్ కూడా బొంయ్‌మని అరిచి కదిలింది అదే సమయంలో.

గిలాగిలా కొట్టుకొంటున్నాడు మురళి నెత్తుటి మడుగులో. ఫస్ట్ యెయిడ్ చేసి, యెక్సయిజ్ జీప్‌లో హాస్పిటల్ కి తీసుకువెళ్ళిపోయేరు మురళిని.

నన్ను రిమాండ్ లో ఉంచేరు.

3

తెల్లవారింది.

ఏడవుతూండగా వచ్చేరు నా దగ్గరకి, ఇన్ స్పెక్టర్ శ్రీవాత్సవ!

"మిస్టర్ ప్రభాకర్! మురళి దగ్గర నాకు నాలుగున్నర కేజీల బంగారం దొరికింది. దీనికి మీ సంజాయిషీ ఏమిటి?" అడిగేడు.

"అతనెవరి దగ్గరో బంగారం వుంటే, నన్ను సంజాయిషీ అడగటం...." పరిహాసంగా నవ్వేను.

నా నవ్వు గమనించి కోపంగా అడిగేడు, "అయ్‌నో హీ యీజ్ యువర్ కేరియర్, యువర్ గోల్డ్ కేరియర్. టెల్‌మీ ది యెక్స్‌ప్లనేషన్."

"నాకు తెలీదు! ఐ డోంట్ నో!"

"ఏమిటి మీకు తెలీదు? గోల్డా? మురళా?!"

"మురళీ తెలీదు. మురళీ దగ్గర మీరంటున్న గోల్డ్ తెలీదు" అబద్ధం ఆడేను.

"ఆల్ రైట్! మురళీ మీకు తెలీదు. మురళీ దగ్గర గోల్డ్ ఉందన్న సంగతీ మీకు తెలియదు. యామై కరెక్ట్?"



"ఫర్ఫెక్ట్లీ."

"అయితే ఆ గోల్డ్ మీది కాదన్న మాట?"

"యస్" మురళీ సంగతి గుర్తుకువచ్చి అడిగేను "ఇనస్పెక్టర్ హౌ ఈజ్ హీ!?"

చిన్నగా నవ్వేడు అతను "మురళీ మీకు తెలీకపోతే ఎందుకంత ఆతృత."

"హ్యూమేనిటీ! మానవత్వం అంటే మీకు తెలియక పోవచ్చు. అందుకే మీకది ఆశ్చర్యం కలిగించింది" అన్నాను.

"షెటాప్" అరిచేడతను. తనను తాను సంబాళించు కుంటూ అన్నాడు. "మిస్టర్ ప్రభాకర్! ఆ గోల్డ్ మీదే! ఆ సంగతి మాకు తెలుసు. కానీ ఒక్క విషయం...."

"ఏమిటది!" సిగరెట్ బిట్ని యాష్ట్రేలో కుక్కుతూ అడిగేడు.

"మీరా బంగారాన్ని యెవరికి, యెక్కడ, యెలా అమ్ముతున్నారో యెలా కొంటున్నారో చెప్పండి. ఈ బంగారంతోబాటు మిమ్మల్ని వదిలేస్తాను." అన్నాడు

యినస్పెక్టర్ శ్రీవాత్సవ మృదువుగా, నచ్చచెప్పు తున్నట్లుగా.

ఫకాలుమని నవ్వేను. "డియర్ యినస్పెక్టర్. చిన్న విషయం. నేను బంగారు వ్యాపారస్థుడి కొడుకుని కావొచ్చు. కానీ, నేను ఆ వ్యాపారం చేయటంలేదు. కలకత్తానుంచి, ఆటబొమ్మలు తీసుకువెళ్ళి, శ్రీకాకుళంలో అమ్మితే యెలా వుంటుందో పరిశీలించే విషయమై కలకత్తా వెళుతున్నాను" అన్నాను.

గుమ్మంలో జవాను నిలబడ్డాడు శబ్దంచేస్తూ. "ఎస్పీగారు పిలుస్తున్నారు సార్!" ఒరియాలో చెప్పేడు.

"ఒస్తున్నాను" అని చెప్పి నావైపు తిరిగేడు.

"మిస్టర్ ప్రభాకర్! మురళీ యీజ్ డెడ్" వెళ్ళిపోయే డతను చటుక్కున.

నిర్ఘాంతపోయేను!

నమ్మలేకపోతున్నాను. మెదడులోంచి యెన్నో వేల రైళ్లు దూసుకుపోతున్నట్లు అనుభూతి.

మురళీ చనిపోయేడా?!

4

శవంగా మారిన మురళిని, బంగారాన్ని కటక్ సెంట్రల్ యెక్సయిజ్‌కి అప్పజెప్పి, శ్రీకాకుళం తిరిగి వచ్చేను, ఖాళీ చేతులతో, భారమైన హృదయంతో.

మెజిస్ట్రేట్ బెయిల్ గ్రాంట్ చేసేడు, రెండువేల రూపాయల హామీ కత్తుతో. వెంటనే కట్టేసేను కటక్‌లో వున్న నాకు తెలిసిన లాయర్ సహాయంతో.

అర్ధరాత్రి రెండు గంటలకి ఆముదాలవలస స్టేషన్‌లో దిగాను ఒంటరిగా.

మురళీలేడని తెలిసిన తరువాత లొంగిపోవాలనిపించేది.

మొట్టమొదటిసారిగా మురళీ నా మనసులో యెంత ముద్ర వేసుకున్నాడో తెలిసింది. మురళీ లేకపోతే నా జీవితం శూన్యమనిపించేంతగా ముద్రవేసుకున్నాను.

ట్రైన్‌లో ప్రయాణిస్తున్నంతసేపూ నాకు మురళీనే గుర్తుకు వచ్చేడు. మురళీ నాకు లేకపోవటానికి కారణం యెవరు!! నేనా?

ఉహూఁ! కాదు. నేను యెన్నోసార్లు కలకత్తా వెళ్ళేను. సేఫ్‌గా తిరిగి వొచ్చేను. యెపుడూ యిలా జరగలేదు. ఈ సారి యెవడో మా ప్రయాణం గురించి యిన్ఫర్మేషన్ ఇచ్చాడు. యెవడువాడు?

యిన్ఫర్మేషన్ యివ్వకుండా వుంటే మురళీ నేనూ కలకత్తాలో హాయిగా గడిపి వుందుము. మురళీ నేను క్షేమంగా తిరిగివచ్చి వుందుము.

గుండె మండిపోసాగింది!

మొట్టమొదటిసారిగా మనసు మురళీని చంపినవాడిమీద ప్రతీకారం తీర్చుకోమంటోంది!

మురళీ చావుకి కారకుడయిన వాడిమీద ప్రతీకారం తీర్చుకోవాలి!

ఆ యిన్‌ఫార్మరెవరు? యెవరై వుంటారు? యెలా పట్టుకోవటం?

ఆ యిన్‌ఫార్మర్‌ని పట్టుకోవటమే జరిగితే పగ తీర్చుకోవటము క్షణాలమీద పని.

తాపీగా, మనసులో ఓ పథకం రూపుదిద్దుకోసాగింది.

5

మర్నాడు టెలిఫోన్ యెక్స్‌ఛేంజ్‌లో పనిచేస్తున్న ఓ మిత్రుణ్ని కలిసేను, ఉదయం తొమ్మిదవుతుండగా!

మురళీకి ఉద్యోగం దొరికిందని, అందువల్ల రాలేక

పోయేడని చెప్పేను అందరితో. కొందరు నమ్మేరు. కొందరు నమ్మనట్లు కనిపించేరు. యెవరు ఏమనుకున్నా నాకు ఏ విధమైన భయంలేదు.

నా రాకకి ఆశ్చర్యపోయేడు ఆ మిత్రుడు.

"సెంట్రల్ ఎక్సయింజ్ డిపార్ట్‌మెంట్‌కి సోమవారం నాడు ఏమైనా కాల్స్ వెళ్ళేయా? వెళ్ళితే యెక్కడ్నించి వెళ్ళిందీ నాకు కావాలి!" అన్నాను నేను కలిసిన విషయం తెలియజెపుతూ.

మళ్ళీ ఆశ్చర్యపోయేడు అతను.

"ట్రంక్ కాల్సా? లోకల్ కాల్సా!?" అడిగేతను.

క్షణంసేపు ఆలోచించి చెప్పేను "రెండూనూ!"

"ట్రంక్ కాల్స్ అయితే తెలిసే అవకాశం వుంది. లోకల్ కాల్స్ అయితే తెలిసే అవకాశం లేదు, ఈ డైరెక్ట్ డయలింగ్‌లో" అన్నాడతను.

"ఏదైనా ఫరవాలేదు" అన్నాను.

"ఓ క్షణం ఆగు" అన్నాడు అతను లోపలికి వెళ్లుతూ.

"ఆ వేళ అంటే సోమవారంనాడు శ్రీకాకుళం యెక్సయింజ్‌కి ట్రంక్ కాల్సేవీ రాలేదు. అయితే శ్రీకాకుళం సెంట్రల్ యెక్సయింజ్ నుండి, కటక్ సెంట్రల్ యెక్సయింజ్‌కి ఓ అర్జెంట్ ట్రంక్ కాల్ బుక్ చెయ్యబడ్డది" చెప్పేడు అతను, అయిదు నిమిషాల తరువాత వచ్చి.

"లోకల్ కాల్స్ గురించి మీకు తెలీదు. అంతేగా?" అడిగేను.

"అవును." చిరునవ్వు నవ్వేడు అతను. "అసలు ట్రంకాల్స్ గురించైనా మేం చెప్పకూడదు నిజానికి. కానీ, నీకు సహాయం చేసేందుకు నా కా రూల్స్ లెక్కలోకి రావు."



కాస్సేపు ఆగి అతనే అడిగేడు. "ఇంతకీ ఎందుకా వివరాలు?"

"తర్వాత చెప్తాను" అని స్కూటర్ స్టార్ట్‌చేసి, రివర్స్ చేసేను.

షాప్ ముందాగి డ్రైవర్ రాముల్ని పిలిచేను.

"నీకు తెలిసినవాళ్లు, మన మాట వినే మనుషులు ఇద్దరు కావాలి. తరువాత ఓ యిల్లు అద్దెకు తీసుకోవాలి. సెపరేట్‌గా ఉండాలి. తెలిసిందా?! రేపటికల్లా పూర్తవ్వాలి రెండు పనులూ!"

ఆశ్చర్యపోయేడు రాములు. "ఎందుకు బాబూ....?" అడిగేడు.

"ఎందుకో నీకనవసరం. చెప్పింది చెయ్యగలవా? లేదా?" అడిగేను కఠినంగా!

"మీ ఉప్పుతిని పెరిగిన శరీరం యిది. మీ మాట వినకపోతే యింకెవరి మాట వింటుంది" అన్నాడు వెళ్లిపోతూ.

న్యూకోలనీలోఉన్న ఎక్సయిజ్ ఆఫీస్‌వేపు స్కూటర్‌ను మళ్లించేను. నాకు తెలిసిన యూ. డి. సి. ఉన్నాడు. కలిసేను.

అరగంట తరువాత బయటపడ్డాను.

అదృష్టం నా పక్షాన ఉంది.

ఆ యిన్ఫార్మర్ ఎవరోగానీ ఆఫీస్‌కు వచ్చేడు. చాలా అరుదు ఎవరో కానీ ఆ ఆఫీస్‌కి రావటం.

బుగ్గమీసాలు, పొడుగాటి ముక్కూ, ముక్కు పక్కన చిన్న కాయా, అరవైయేళ్ళ పెద్దమనిషి! చాలు ఈమాత్రం ఆధారం. శ్రీకాకుళంలో ఎక్కడ వున్నా పట్టుకోగలను.

నాకు తెలిసినవాళ్ళలో అలాంటి వ్యక్తి ఎవరూ లేరు.

6

ఉదయాన్నే ఫోటో స్టూడియోలో పనిచేస్తున్న, ఓ ఆర్టిస్ట్ ఫ్రెండ్ దగ్గరికి వెళ్లేను. డ్రాయింగ్ ఎక్స్‌పర్ట్ అతను.

"చిన్నపని చేసిపెట్టాలి బ్రదర్!" అన్నాను స్టూడియోలోకి అడుగుపెడుతూ.

"చెప్పు బ్రదర్! ఏమిటది?" అడిగేడు.

"నేనో వ్యక్తిని వర్ణిస్తాను. అలా బొమ్మ వేసి పెట్టాలి."

"ఎందుకు?" ఆశ్చర్యపడి అడిగేడు.

"వేస్తావా? వెయ్యవా?...." విషయం చెప్పకుండా అడిగేను.

"పార్టీ యివ్వాలి" బెదిరిస్తున్నట్లు అన్నాడు.

"నిన్ను తీసుకెళ్లి బీరులో ముంచేస్తాను. సరేనా?" అన్నాను.

"ఓ. కే. ఓ. కే. చెప్పు" అన్నాడు పెన్సిలు పేపరూ అందుకొంటూ.

యూ. డీ. సీ. మిత్రుడు చెప్పిన వర్ణనలని గుర్తుకు తెచ్చుకుంటూ వర్ణించేను, యిన్‌ఫార్మర్‌ని.

నేను చెప్పిన వర్ణన విని ఆశ్చరంగా అన్నాడతను. "అరె! మా మేష్టారిలా ఉందే! ఒక్క క్షణం ఉండు...." గబగబ కొన్ని ఫోటోలని వెతికి, ఒక ఫోటో తీసి నా చేతి కిచ్చాడు. "ఏడాది క్రితం తీసినది ఇది" అన్నాడు.

తుళ్లిపడ్డాను, ఆ ఫోటో చూసి.

ఆనందంతో గుండెలు వేగంగా శబ్దం చేస్తూ కొట్టు కున్నాయి.

"నీకు తెలుసా? ఎవరితను?"అడిగేను ఆతృతగా అతని భుజాలు పట్టుకొని కుదిపేస్తూ.

"యస్! మా యింటిలో పక్కపోర్షన్‌వాళ్ల పిల్లలకి ప్రైవేటు చెప్తుంటాడు" తాపీగా చెప్పేడతను. "ఇంతకీ ఎందుకూ?"

"చిన్న పనుంది. కానీ...." కాస్సేపాగి అడిగేను. "ఎక్కడుంటాడో యితను?"

"స్టేట్‌బాంక్ కాలనీలో ఉంటున్నాడుట" అన్నాడు, తన పనిలో మునిగిపోతూ.

ఆ ఫోటో తీసుకొని థాంక్స్ చెప్పి, బయటకి వచ్చేసేను.

నా మనసు ఆనందంతో నిండిపోసాగింది.

నా పగ తీర్చుకోగలుగుతున్నాను. మురళిని చంపిన హంతకుడ్ని పట్టుకోబోతున్నాను.

షాప్‌కి వచ్చేసరికి రాములు సిద్ధంగా వున్నాడు ఎవరో యిద్దరు బలిష్ఠులతో. నన్ను చూసి ముందుకు వచ్చేడు.

"ఇదిగో బాబూ! మీరు కావాలన్నారుగా. వీడు రంగడు. వీడి పేరు సుబ్బారావ్" అన్నాడు పరిచయంచేస్తూ. నమస్కారం చేసేరు వాళ్ళిద్దరూ.

సంతృప్తిగా తలాడించేను. "మరి యింటి సంగతి?"

"అదీ రడీ అయిపోయిందండీ. ఇల్లిస్ పురంలో ఉంది. ఒన్ వే ట్రాఫిక్ రోడ్ ప్రక్కన, చాలా మూలగా ఉంది. నెలకి అరవై అద్దె" అన్నాడు రాములు.

"ఆల్‌రైట్ యిచ్చేసేయి" అని చెప్పి జేబులోంచి అరవై రూపాయలు యిచ్చేను. రాములు డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు.

"మీరు నాతో రండి" అని దగ్గరగాఉన్న ఓ హోటల్‌కి తీసుకెళ్లేను, వాళ్లని. ఓ మూలగా కూర్చున్నాం. టిఫిన్‌కి ఆర్డరిచ్చి తాపీగా చెప్పేను, లోగొంతుకతో.

"ఓ వ్యక్తిమీద పగ తీర్చుకోవాలి నేను. అందుకని నాకు యిల్లు కావలసి వచ్చింది. ఆ యింట్లో బంధించి ఉంచుతానతన్ని. పారిపోకుండా చూడాలి మీరు. ఓ వారం పాటు ఉంటుంది మీకు పని. చెరి ఒక వెయ్యిర్రూపాయలిస్తాను. యెక్కడా తెలియకూడదీ విషయం. తెలిసిందా?"

ఆశ్చర్యపోతూ తలూపేరు వాళ్లు.

తర్వాత యిల్లు చూసి వొచ్చేను. అపుడే బయల్దేరి వెళ్లేను. రెండు గదుల యిల్లు. ప్రశాంతంగా ఉంది వాతావరణం.

ఇంక యిన్‌ఫార్మర్‌ని పట్టుకోవాలి!

పట్టుకొని నా పగ తీర్చుకోవాలి!!

7

స్టేట్‌బాంక్ కాలనీదగ్గర కారాపి, అసహనంగా వెయిట్ చేస్తున్నాను.

ఆ వ్యక్తి యిల్లు తెలిసింది. ఇక అతనిని పట్టుకొని బంధించటమే!

ఆశ్చర్యంగా ఉంది నాకే! ముక్కూ మొఖం తెలియని వాడికి అసలు మా విషయం యెలా తెలిసిందా అని!

దూరంగా అతను యిళ్ళుదాటి వస్తున్నాడు. నా ఉద్దేశం అతన్ని చంపటంకాదు. అంత వయస్సున్న వ్యక్తి నామీద కోపంతో ఆ పని చేసేడంటే నమ్మలేకపోతున్నాను. యెందుకు మా గురించి యిన్‌ఫార్మ్ చేసేడో తెలుసుకోవాలి. యెవరైనా ప్రోత్సాహమిచ్చి చేయించేరేమో తెలుసుకోవాలి నేను.

మెయిన్‌రోడ్ యెక్కి బస్టాండ్‌వైపు నడవసాగేడు. కారు స్టార్ట్‌చేసి మెల్లిగా తీసుకువెళ్ళి అతని ప్రక్కన ఆపేను.

ఆశ్చర్యంగా చూసేడు నావైపు.

"మాష్టారూ!" వినయంగా పిలిచేను. "నమస్కారం"

అన్నాను చేతులు జోడిస్తూ.

"నమస్తే! యెవరు మీరు?" అతని కంఠం బలహీనంగా వుంది.

"నా పేరు ప్రకాశరావ్. యింజనీర్‌గా వర్కు చేస్తున్నాను. మా పిల్లలకి ట్యూషన్ మాష్టారుకోసం వెతుకుతున్నాను. మా కొలీగ్ ఒకాయన మీపేరు సూచించేడు. అందుకని మీకోసం వచ్చేను. మీకు వీలవుతుందో లేదో అని." గడగడా చెప్పేను.

"అలాగే బాబూ! మంచిది. తర్వాత వస్తాను. యెక్కడ మీ యిల్లు?" అడిగేడు.

"కూచోండి మాష్టారూ! యిల్లు చూపిస్తాను. తరువాత మీకు కావలసినచోట దింపేస్తాను" అన్నాడు డోర్ తీస్తూ.

కాసేపు తటపటాయించేడు.

"రండి మాష్టారూ!" అన్నాను.

యెక్కి కూచున్నాడు. డోర్ ప్రక్కనే ఒదిగి ఒదిగి.

స్పీడ్‌గా అద్దెకి తీసుకొన్న యింటికి తీసుకువెళ్లేను. నా వెనుకే యింట్లోకి వచ్చేడు.

ఢడాలున తలుపు తేసేను.

రంగడూ, సుబ్బారావ్, చేతులు కట్టుకొని నిలబడ్డారు.

ఆ వ్యక్తి నావైపు ఆశ్చర్యంగా చూసి అడిగేడు. "బాబూ!"

బెల్ట్ విప్పుతూ అన్నాను. "సారీ! మేస్టారూ! నేను ప్రకాశరావ్‌ని కాను. నా పేరు ప్రభాకర్. ఇంజనీర్ని కాను. జంక్షన్లో ఉన్న బంగారుషాప్ ఓనరుకొడుకుని. ఇక పోతే మిమ్మల్ని యిక్కడికి యెందుకు తీసుకువచ్చేనంటే" ఆపి వికటంగా నవ్వేను. "మీనుంచి ఓ విషయం రాబట్టాలని."

"ఏ....ఏమిటది?" భయంగా అడిగేడతను.

"ఎవరు మీకు నేను బంగారం తీసుకు వెళ్తున్నట్లు చెప్పేరు? యెందుకు నువు యెక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌కి యిన్‌ఫార్మ్ చేసేవు? యెవరి ప్రోద్బలంవల్ల చేసేవు!" నా సంబోధనలో మార్పు వచ్చేసింది. బెల్ట్ చేతికి చుట్టుకుంటూ ఒక్కొక్క మాటే వత్తి పలికేను. "నీనుండి సమాధానం కావాలి నాకు."

నోరు మెదపలేదతను. నావైపే ఆశ్చర్యంగా చూస్తుండి పోయేడు.

"సమాధానం కావాలి నాకు." గట్టిగా అరిచేను.

మౌనంగా ఉండిపోయేడు. మాట్లాడలేదు. తల వొంచు కొన్నాడు.

"చెప్పండి! యెవరు మీరు?! యెందుకు ఆ యిన్‌ఫర్మేషన్ యిచ్చేరు? యెవరు యిమ్మన్నారు?" మృదువుగా అడిగేను. "చెప్పండి".

సమాధానం చెప్పలేదతను.

ఆ మౌనం చూసి ఒళ్లు మండిపోయింది. కోపంగా బెల్ట్ ఎత్తి యెడాపెడా బాదేసాను, వళ్లెరుగని కోపంతో, యెక్కడ తగులుతోందో కూడా చూడకుండా. "మురళీ! నిన్ను నాక్కాకుండా చేసిన వాడిమీద పగతీర్చుకొంటు న్నాను" అనుకొన్నాను.

"ఆగండి బాబూ!" రంగడు కేకేసేడు.

తేరుకొని చూసేను. క్రింద పడిపోయేడతను మూలుగుతూ! బెల్ట్ దెబ్బలవల్ల చారికలు కట్టింది.

ఆయాసంతో రొప్పుతూ అన్నాను "పక్క గదిలో పడేయండి!"

రంగడూ, సుబ్బారావ్ తీసుకువెళ్లిపోయేరతన్ని.

"ఎందుకు బాబూ! అంతకోపం" రంగడు ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు నన్ను.

"యెందుకా" మురళీ గుర్తుకువచ్చి ఆవేశంతో ఆగ్రహంతో నా గుండెలు యెగిసిపడ్డాయి. "మురళీని చంపేసేడు రంగడూ యితను; నా మురళీ చావడానికి కారణం యితను యిచ్చిన యిన్ఫర్మేషనే" దాదాపు అరుస్తూ చెప్పేను.

మాటలు రానట్లు నిలబడిపోయేడు వాడు.

బయటికి వచ్చి కారు స్టార్ట్ చేసేను. వెంటనే మందు కొట్టాలి. లేకపోతే యీ టెన్షన్ భరించలేను.

8

టక్ టక్!

ఎవరో శబ్దం చేస్తున్నారు తలుపుమీద. మత్తుగా కళ్ళు విప్పి లేచి చూసేడు నాన్నగారు.

"నీకోసం యెవరో వచ్చేరు! పంపమన్నావా?" అనడిగేడు.

"పంపండి" అని చెప్పి తల దువ్వుకోసాగేను.

రెండు నిమిషాలు గడిచేయి.

"మే అయ్ కమిన్"

గంభీరంగా వినబడింది గొంతు. ఎవరిదో గుర్తుపట్టేను. గిరుక్కున తిరిగేను. తెల్లటి డ్రస్‌తో గుమ్మం అంత వున్నాడు.

శ్రీవాత్సవ!

కటక్ సెంట్రల్ యెక్సయిజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీవాత్సవ!

ఆశ్చర్యపోయేను. నోటమాట రాక అలా వుండిపోయేను.

మళ్లీ అతనే అడిగేడు, చిరునవ్వుతో "మే అయ్ కమిన్"

"ఎస్. ఎస్. కమిన్!" అన్నాను తడబాటుగా.

లోపలికివచ్చి సోఫాలో కూలబడ్డాడు, ఉస్సురని నిట్టూరుస్తూ. ఆశ్చర్యంగా అతన్నే చూడసాగేను. ఎందుకు వచ్చినట్లు యిక్కడికి అరికాళ్ళకి, చేతులకి చిరుచెమట.

"మాకు యిన్ఫర్మేషన్ యిచ్చిన యిన్ఫార్మర్‌ని ఎక్కడ వుంచేరు. మిస్టర్ ప్రభాకర్!" తాపీగా అడిగేడు, రూమ్ కలయజూస్తూ.

మళ్లీ ఆశ్చర్యపోయేను.

"ఇన్ఫార్మర్నా? నేనా?" ఆశ్చర్యంగా అడిగేను.

"యస్! మీరే!" చిన్నగా నవ్వేడతను "మాకు యిన్ఫర్మేషన్ యిచ్చిన వ్యక్తిని మేం కాపాడుకోవాలి. చెప్పండి! ఎక్కడ దాచేరు?"

"మీకు....మీకు యెలా తెలిసింది?" అప్రయత్నంగా అడిగేను.

మళ్లీ నవ్వేడతను.

"ఎలానా? వినండి చెప్తాను" అన్నాడు శ్రీవాత్సవ. "మీరు వెళ్ళిపోయిన రోజు సాయంత్రం హాస్పిటల్ నర్సు, చనిపోయిన మురళి తండ్రికి చెప్పమని చెప్పిన మాటలని ఓచీటి తెచ్చిచ్చింది. అది చూసి ఆశ్చర్యపోయేను. నేను యిక్కడికి వచ్చి మురళి తండ్రికోసం వెదికేను.

మురళి ఫాదర్ యింట్లోలేరు నేను వెళ్లేసరికి. పక్కయింటి వాళ్ళు చెప్పేరు. ట్యూషన్‌లకని చెప్పి బయల్దేరిన వారు యింకా రాలేదని. అతను ట్యూషన్స్ చెప్పే యిళ్ళకి వెళ్ళేం. ఆ యిళ్ళకీ మురళి తండ్రి రాలేదు.

మరి ఏమైనట్లు?

"మరోసారి మురళి తండ్రికి రాయించిన ఉత్తరం చదివేను. అర్థమయింది, ఏమయివుంటారో."

"అంటే....అంటే...." అసందిగ్ధంగా ఆగిపోయేను.

"అంటే మీరు పగదీర్చుకోవలసిన యిన్ఫార్మరూ, మురళి తండ్రీ ఒకరే! మీరు పగదీర్చుకోవలసిన వ్యక్తి మీ కాన్త మిత్రుడైన మురళి తండ్రి" అన్నాడు శ్రీవాత్సవ.

నా నెత్తిన పిడుగులు పడ్డట్టైంది. మురళీ, నేను ప్రాణ స్నేహితులమైనా మురళి తండ్రిని నేనెన్నడూ చూడ లేదు. అసలు వాళ్ళ కుటుంబంతోటే నాకు పరిచయంలేదు.

నా మెదడు పనిచేయటం మానేసింది! అయితే, మురళి తండ్రి, తన కొడుకు చావుకి తనే కారకుడా? అతను యెందుకీ యిన్ఫర్మేషన్ యిచ్చినట్లు?

శ్రీవాత్సవే మళ్లీ అడిగేడు "చెప్పండి! యెక్కడ వుంచేరతన్ని?"

మురళి తండ్రిని నేను చంపదలుచుకోవటం అంత తెలివితక్కువ పని మరొకటి ఉండదు.

నేను, శ్రీవాత్సవ జీప్‌లో కూర్చున్నాం.

9

జీపాగిన శబ్దంవిని, బయటికివచ్చి చూసిన రంగడు ఆశ్చర్యపోయేడు, నన్ను పోలీసులతో చూసి.

"రండి" అన్నాను మురళి తండ్రిని బంధించిన తలుపు తాళం తీస్తూ.

శ్రీవాత్సవా, నేనూ ఆ గదిలోకి అడుగుపెడుతూ నిశ్చేష్టులమై నిలబడిపోయేం, ఆ గదిలో దృశ్యం చూసి.

మురళి తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు.

తన పంచెనే ఉరితాడుగా మార్చుకొని దూలానికి ఉరిపోసుకొని చనిపోయేడు.

నా మనసు, మెదడు మొద్దుబారిపోయింది. ఆశ్చర్యంగా

అలాచూస్తూ ఉండిపోయేను. కళ్ళనుంచి నీళ్ళు ధారగా కారసాగేయి, నాకు తెలీకుండానే! మురళి చావుకీ, మురళి తండ్రి చావుకీ పరోక్షంగా నేనే కారణం అనే భావన మనసుని కోసేయసాగింది.

"సారీ" అంటూ అనునయంగా భుజం తట్టేడు శ్రీవాత్సవ. "ఇది చదవండి" అన్నాడు ఓ కాగితాన్ని తీసి నా చేతిలో పెడుతూ.

వణికే చేతులతో ఆ కాగితాన్ని విప్పి చదివేను.

"ఇన్‌స్పెక్టర్‌గారికి!

నా ఉద్దేశ్యపూర్వకంగా ఈ ఆత్మహత్య చేసుకొంటున్నాను. ఇందులో యెవరి ప్రమేయమూలేదు. యెవరూ బాధ్యులుకారు.

నా కొడుకు మురళి ధనిక వర్గంలో పుట్టవలసినవాడు. కనీసం అలా జరిగినా బాగుండేది. నా కడుపున పుట్టి, అనుక్షణం దరిద్రపు జీవితాన్ని అసహ్యించుకొంటూ బ్రతికేవాడు. నేనెంత నచ్చజెప్పినా వినేవాడుకాదు.

ఆ సమయంలోనే వాడికి ప్రభాకర్‌తో స్నేహం అయింది. తన కలలన్నీ ప్రభాకర్ ద్వారానే తీరతాయని తీరుతున్నాయి అని అనేవాడు. ధనికుల జీవితం యెంత ప్రమాదకరమైనదో చెప్పేను వినలేదు.

ఆవేశంలో, నా మాట వినలేదనే ఆవేదనతో, కల కత్తావెళుతూ యెందుకువెడుతున్నాడో చెప్పేసరికి ఆగ్రహం పట్టలేకపోయేను. యెక్సయిజ్‌కి యిన్ఫర్మేషన్ యిచ్చేను.

కానీ నా ఆవేశం, నా కొడుకునే మింగేసరికి, నా ఆవేశానికి ఫలితం నా కొడుకు మరణమే అని తెలిసిపోయేక ఇంక నా జీవితం నాకు అనవసరమనిపించింది. అందుకే ఈ విధంగా సెలవ్ పుచ్చుకొంటున్నాను." ★

సౌత్ బోగ్ రోడ్ లో వున్న 'వాసంతి నిలయం' నియాన్ లైట్లతో దేదీప్యమానంగా వెలుగుతోంది.

భవంతి ఆవరణంతా వచ్చిన అతిధులతో నిండిపోయి వున్నది. ఆ వీధంతా కారులతోనూ స్కూటర్లతోనూ నిండిపోయి వున్నది. మద్రాసులోని ధనవంతులంతా అక్కడే గుమిగూడినట్లు వున్నారు.

''డియర్ ఫ్రెండ్సు! ఈనాటి ఈ గేదరింగ్ ఎందుకో మీ కందరికీ తెలుసు. ప్రతి సంవత్సరం అంటే సుమా

రుగా ఇరవై సంవత్సరాలనుండి మీరు ఈరోజున నా ఇంటి కొచ్చి నన్ను ఆనందపరుస్తున్నారు. ఈరోజు నా ముద్దుల కూతురు వాసంతి పుట్టినరోజు.

వాసంతికి మొదటి పుట్టినరోజున కీ యిచ్చే కారుని ప్రజంటుచేస్తే, చిన్నారిపాప దాని శబ్దానికి కిలకిలానవ్వింది. తరువాత పరిగెత్తే ప్లెయిన్ యిస్తే, బోసినోటితో చప్పట్లు చరిచింది. కదిపితే యేడ్చే బొమ్మనిస్తే తాను యెగిరి గంతులువేసింది. మొన్నమొన్న డైమండ్ నెక్లెసు యిస్తే థాంక్స్ డాడీ అన్నది.

ఈ సంవత్సరంతో నా కూతురికి ఇరవై వసంతాలు నిండుతున్నాయి. ఇప్పటి వాసంతికి యివ్వవలసినది పరిగెత్తే విమానం నవ్వే బొమ్మకాదు, నవ్వించగల భర్త, హాయిగా తిరిగిరావడానికి హనీమూన్ టిక్కట్లు.

అందుకని ఈ బర్తడేకి మా అమ్మాయికి భర్తని కానుకగా యివ్వబోతున్నాను."

చప్పట్లు ఘొరుమ్రోగాయి.

ఈ మాటకి వాసంతి తల్లి భానుమతి ఆశ్చర్యపోయింది. ఎందుకంటే ఇక్కడ వినేవరకూ ఆమెకూ తెలియదు.

వాసంతి బుగ్గలు మాత్రం సిగ్గుతో ఎరుపెక్కాయి.

"అయితే పెండ్లికుమారుడు యెవరా అని మీ కందరికీ కుతూహలం గలగవచ్చు. నేను నా చిన్ననాటి స్నేహితుడిని కాదని, ఈ సంపత్తుని యెవరికో అనామకుడికి అప్పగించలేను.

నా స్నేహితుడు, నా ప్రాణంలోని ప్రాణం, నా బిజినెస్ పార్టనర్ గోపాలరావు కుమారుడు చిరంజీవి సంపత్తు కుమార్‌కే నా బిడ్డని ధారాదత్తం చేస్తున్నాను. అతనే నా కుమార్తెకు లైఫ్ పార్టనర్" అని కృష్ణారావుగారు ఆగారు.

మద్రాసులో 'రావు అండ్ రావు'లకి పెద్ద యెత్తులో వ్యాపారం వున్నది. ఇద్దరూ చిన్నప్పటినుండి స్నేహితులు. మాంబళంలో వుండేవారు. ఇద్దరూ కలసి పచ్చయప్ప కాలేజీలో యమ్. కామ్ వరకూ కలసి చదువుకున్నారు. చదువుకున్న తరువాత వుద్యోగాలకన్నా బిజినెస్సే మంచి బెనిఫిట్ అని యిద్దరికీ వచ్చిన కట్నంతో స్టార్ హోటల్ని ప్రారంభించారు.

వారి అపారమైన కృషి ఫలితంగా అది సెవన్‌స్టార్స్ హోటల్‌గా మారింది. అంతేగాదు అనేక రకాలైన వ్యాపారాలని చేపడుతూ అంతులేని ధనాన్ని ఆర్జిస్తున్నారు. కృష్ణారావు కూతురే వాసంతి.

"క్రిష్ణా! ఈ మాటని ముందుగా నాతో చెప్పలేదెందుకని?" గోపాలం అన్నాడు.

"నీ కభ్యంతరం వుంటుందని అనుకోలేదు. పైగా సంతోషిస్తావని తెలుసు మిమ్మల్ని అందరినీ సర్‌ప్రైయిజ్ చేయా...."

"మ....మ్మీ" వాసంతి కేక వినబడింది.

కృష్ణారావు భార్య భానుమతి నిలుచున్న పళంగా స్పృహ కోల్పోయింది. హఠాత్తుగా సంతోషకరమైన వార్తని వినగానే ఆమె తట్టుకోలేక పోయిందని అందరూ అనుకున్నారు.

కిలకిలలో నుండి కలకలంలోకి మారింది వాతావరణం.

అక్కడేవున్న చాలామంది డాక్టర్సు ఆమె చుట్టూ గాబరాగా మూగారు.

ఆమెకి హార్ట్ ఎటాక్. వెంటనే మొహతా నర్సింగ్ హోమ్‌కి ఆమెను తీసుకునిపోయారు.



2

భానుమతి కోలుకొంది గానీ, ఏమో పోగొట్టుకున్న దానిలా కళావిహీనంగానే గడుపుతోంది.

భానుమతికి బాగా ఆరోగ్యం పుంజుకున్న వెంటనే వివాహం చేసేయాలని దానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేస్తున్నాడు కృష్ణారావు.

మీనాక్షీ కల్యాణ మందిరాన్ని బుక్ చేయడంకూడా అయింది. వాసంతి నిలయానికి రంగులు డిస్టెంబరు వేస్తున్నారు పనివాళ్ళు. పుమ్మడియార్ వారికి నగలు డిజైన్సు యిచ్చి ఆర్డరు యివ్వడంకూడా జరిగిపోయింది.

ఒక్కొక్క పని జరుగుతూ వుంటే భానుమతి మొహంలో ఒక్కొక్క కళ తప్పుతూ ప్రేతకళ రాసాగింది. మనిషి భయంతో భీతితో ఒణికిపోతోంది.

ఓరోజు పళ్ళరసాన్ని యివ్వడానికి వచ్చిన కూతురుతో, "పాపా! సంపత్తుమీద నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగింది.

వాసంతి తమాషాగా నవ్వి—"నా అభిప్రాయం ఇప్పుడడుగుతున్నావేం మమ్మీ. ఇంత వరకూ వచ్చిన తరువాత నాకు యిష్టం లేదంటే ఈ పెండ్లి ఆపుతావా?" చిలిపిగా నవ్వుతూ అంది.

"ఈ పెండ్లిని ఆపగల శక్తి నాకు వుంటే, నీకిష్టం వున్నా ఆపేదాన్నే" నిదానంగా అంది.

"మ....మ్మీ" ఆశ్చర్యంగా అరచింది వాసంతి.

"అవును వసూ! నీకు తెలియదు. చిన్నప్పటి నుండి తెలిసిన వ్యక్తిని పెళ్లాడడంలో నవ్యతవుండదు. మధురిమ వుండదు. నీవు సంపత్తుని కాదను" అనునయంగా అంది.

"ప్రేమకి అర్థంలేదా మమ్మీ!"

"ప్రేమా?....కామానికి ముసుగు అది!"

వాసంతి కళ్లు పెద్దవి చేసుకొని, విచిత్రంగా తల్లిని చూడసాగింది.

"వసూ! నాకీ పెండ్లి యిష్టంలేదు. మీ డాడీ నామాటలు వినరు. నీవీ పెండ్లిని ఎలాగైనా ఆపాలసిందే. ఇది నా కోరిక, నా ఆజ్ఞ కూడా" కఠినంగా అంది భానుమతి.

సైకాలజీ ఎం.ఏ చదివిన వాసంతి తల్లి మొఖంలోని భావాలని చూస్తూ అక్కడ నుండి మౌనంగా వెళ్ళిపోయింది.

3

టి.నగర్‌లోని సౌత్ బోగ్ రోడ్డులోని కృష్ణారావు భవనం విషాదంలో మునిగిపోయివున్నది. వారి ఏకైక పుత్రిక కుమారి వాసంతి యమ్.ఏ. ఆత్మహత్య చేసుకొంది. నగరంలోని ధనవంతులంతా అక్కడే వున్నారు.

పెద్ద హాలులో వాసంతి శరీరం పెట్టబడివుంది. బంగారపు కలరులో వుండే వాసంతి శరీరం నీలి కలరులో మారివున్నది. ఎంత ఆలోచించినా వాసంతి ఆత్మహత్యకి కారణం మాత్రం తెలియడంలేదు.

సంపత్తు వెర్రివాడిలా వాసంతి శరీరాన్ని చూస్తూ కూర్చునివున్నాడు. నిన్న కూడా యిద్దరూ కలసే వెడ్డింగ్

శారీస్ కోసం నల్లీస్‌కి వెళ్ళారు. వాసంతి యెంతో వుత్సాహంగానే వున్నది. ఎటువంటి అనుమానం కలగలేదు.

హోటలు డీలక్సులో బిరియాని తినేటప్పుడు భవిష్యత్తు గూర్చి యెన్నో ప్లానులు చెప్పింది. మరి ఇలా ఎందుకు జరిగింది. ఎంత ఆలోచించినా సంపత్తు ఎకనమిక్సు యమ్.ఏకూ క్లూ దొరకడం లేదు.

భానుమతి స్పృహ కోల్పోయివుంది.

కృష్ణారావు పిచ్చివాడిలా ఏడుస్తున్నాడు నా తల్లికి చావవలసిన అవసరం ఏమిటి అని.

అదే అందరికీ అర్థంగాని క్రాస్ పజిల్‌గా మారింది.

స్పృహ వచ్చిన భానుమతి—"నా చిట్టితల్లి శవాన్ని నేను చూడలేను. దానిని త్వరగా తీసుకుపొండి" అని హిస్టీరియా వచ్చిన దానిలా మంచానికేసి తల కొట్టుకొని రోదించసాగింది.

హార్టు ఎటాక్ పేషంటు అని, ఆమెకు ప్రమాదం కలుగుతుందేమోనన్న భయంతో, త్వరత్వరగా వాసంతి శవాన్ని ఎత్తేశారు.

రోజులు గడిచిన కొద్దీ భానుమతి దాదాపు హిస్టీరియా పేషంటు మాదిరిగా తయారైంది. నవ్వుతోంది. ఏడుస్తోంది జుట్టు పీక్కుంటోంది. రక్కుకొంటోంది.

కూతురు పోయిన బాధ ఓ ప్రక్కన పీడిస్తూవుంటే భార్య పరిస్థితి ఇలా వున్నది. కృష్ణారావు వ్యాపార విషయాన్ని వదులుకొని, పిచ్చివాడిలా ఇంట్లోనే వాసంతి ఫోటోని వాళ్ళో పెట్టుకొని ఏడుస్తూ వుండిపోతున్నాడు. భార్యాభర్తలిద్దరూ తిండి అన్నదాన్ని దాదాపు మరచిపోయినట్లే వున్నారు.

గోపాలరావు దంపతులకి పెద్ద సంకటస్థితిలా వున్నది.

వాసంతి మరణంతో సంపత్తు వెర్రివాడిలా తయారయ్యాడు, అన్నపానాలు ముట్టుకోకుండా. ఇటు చూస్తే కృష్ణారావు దంపతులు కూతురి మరణాన్ని తలచుకొని తలచుకొని కుమిలిపోతున్నారు. ఎవరిని ఓదార్చాలి?

గోపాలరావు దంపతులు, కృష్ణారావు ఇంట్లోనే మకాం పెట్టారు. కష్టంలోవున్న మిత్రుడని ఆదుకోవడం స్నేహ ధర్మం అని.

4

"యస్! ఇనస్పెక్టర్ షణ్ముగసుందరం స్పీకింగ్!"

"సార్! నేను 'రావు అండ్ రావు' కంపెనీ ప్రొప్రయిటర్ కృష్ణారావుగారి భార్యని మాట్లాడుతున్నాను."

"ఓ! అలాగా! ఏమ్మా!" ఇనస్పెక్టర్ షణ్ముగసుందరం అడిగాడు.

అతనికి రావు అండ్ రావు కంపెనీ తెలుసు. నెల రోజుల క్రితం జరిగిన విషాద వుదంతం తెలుసు.

"నెలరోజుల క్రితం మా కుమార్తె వాసంతి ఆత్మ హత్య చేసుకొందని అందరూ నమ్మారు. కానీ నిజానికి అది ఆత్మహత్యకాదు, హత్య! మీకు పూర్తి వివరాలు కావాలంటే, మా యింటికి రండి" అని ఫోన్ పెట్టేసింది.

ఫోన్ క్లిక్‌మన్నా కూడా ఆ షాక్ న్యూస్ వినడం వలన ఇన్‌స్పెక్టర్ షణ్ముగసుందరం "హలో....హలో" అని అరచాడు.

ఇన్‌స్పెక్టర్ షణ్ముగసుందరం మొఖానికి పట్టిన చమటని తుడుచుకుంటూ, మోటర్‌బైక్‌ని స్టార్ట్ చేశాడు.

ఇన్‌స్పెక్టర్ షణ్ముగసుందరాన్ని చూడగానే గోపాలరావు, అతని భార్య సుమతి, కృష్ణారావు తదితరులు ఆశ్చర్యపోయారు.



గుడ్లగూబ అరిస్తే కీడుని ఎలా శంకిస్తారో, పోలీసు డిపార్టుమెంటు వారిని చూస్తే కూడా అలానే అపశకునాన్నే తలపోస్తారు.

"సార్! మీ మిసెస్ మీ కుమార్తెది ఆత్మహత్యకాదని, హత్యని, వస్తే వివరాలు చెప్తానని అన్నారు" అని చెప్పాడు.

కృష్ణారావుగానీ తదితరులుగానీ అది విని ఆశ్చర్యపోలేదు.

సుమతి విషాదంగా నవ్వి—"ఆమెకు ఒక్కగాని ఒక్క కూతురు మరణించటంతో మతి భ్రమించినది" అంది.

"అవును ఇన్‌స్పెక్టర్‌గారూ! ఆమెకు యిది చాలా మెంటల్‌షాక్! నా కూతురుని హత్య చేయవలసిన అవసరం ఎవరికీలేదు. అయితే ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకోవలసి వచ్చినదో కూడా ఎంత ఆలోచించినా తెలియడం లేదు. ఈ పెండ్లి కూడా తనకి పూర్తిగా యిష్టమైనదే. ఎవర్నీ ప్రేమించలేదు. చనిపోవడానికి ముందురోజు కూడా...." కృష్ణారావు గొంతు దుఃఖంలో పూడుకొని పోయింది.

"ఏ లోటూ లేకుండా పచ్చగా జరిగిపోతూ వున్న ఈ జీవితంలో ఎంతో హఠాత్తుగా, వూహించలేనంత వేగంగా ఎంతటి విషపుగాలులు వీచాయో. ఇది తట్టుకోలేని సంఘటన" రెండు చేతుల్లో మొఖాన్ని దాచుకొన్నాడు కృష్ణారావు.

"ఏనీహౌ! మాకు ఫోన్ వచ్చింది కాబట్టి, మా డ్యూటీని మేము చేయాలిగా సార్!" అన్నాడు ఇన్స్పెక్టర్.

"సరే. రండి!"

5

అందరూ భానుమతి గదిలోకి జొరబడ్డారు.

గదిలో మంచంమీద భానుమతి శరీరం నిర్జీవంగా పడి వున్నది. అంతా కొయ్యబారిపోయారు.

"భానూ! పిచ్చిగా అరిచాడు కృష్ణారావు.

భానుమతి చేతిలో చిన్న చీటివున్నది. ఇన్స్పెక్టర్ షణ్ముగసుందరం ఆ చీటీని అందుకొని విప్పి గట్టిగా చదివాడు.

"నా కూతురు హత్యకి, నా ఆత్మహత్యకి కారణం టేప్‌రికార్డర్‌ని ఆన్‌చేస్తే తెలుస్తుంది" అని వుంది.

గోపాలరావు మంచానికి ప్రక్కగా స్టూల్‌మీద వున్న రికార్డరుని ఆన్‌చేశాడు.

"ఇన్స్పెక్టర్‌గారూ!

తప్పుచేసిన నేను దోషిగా మీ చట్టానికి దొరక్కుండా వెళ్ళిపోతున్నాను. నా కూతురు వాసంతిని నేనే చంపాను...."

భానుమతి కంఠం పలికిన మాటని విని అందరూ వులిక్కిపడ్డారు.

"మీ కందరికీ ఆశ్చర్యం కలగవచ్చు. కానీ పరిస్థితులు అలా విషమించాయి. ఆ క్షణాన నా ప్రాణం నాకు తీపి అనిపించింది. తరువాత నా కడుపు తీపి నా ప్రాణాన్ని జయించింది.

ఇరవై ఐదు సంవత్సరాలక్రితం నేను శ్రీ కృష్ణారావు గారి భార్య నయ్యాను. ఆయన దృష్టి ఎంతసేపు ధనార్జన మీద వుండేది. నేనా మంచి యవ్వనంలో వున్నానేమో ఎన్నో కోరికలతో ఆశలతో వుండేదాన్ని. కానీ ఆయన కంటికి కనిపించడమే ఎంతో అపరూపంగా వుండేది.

ఎన్ని చీరలుకొన్నా, ఎన్ని నగలువున్నా ఏదో వెలితి. శరీరంలో అలజడి. సినిమాలు చూస్తే ఆ వెలితి అసంతృప్తి అలజడి యింకా యింకా ఎక్కువ అయ్యేవి.

ఎన్నోసార్లు ఆయనకి చెప్పి చూశాను. ఆయనకి అర్థం అయ్యేదికాదో లేక తెలియనట్లు వుండిపోయేవారో నాకు తెలియదుగానీ, నాకుమాత్రం సమాధానాన్ని "ఈ వయస్సులో సంపాదించకపోతే ఎలా? ముసలికాలంలో శక్తి వుంటుందా?" అని అనేవారు.

ఇలా ఐదు సంవత్సరాలు గడిచాయి. డబ్బు పిచ్చి బాగా ముదిరి నా భర్తా, ఆయన స్నేహితుడు గోపాలరావుగారూ యిద్దరూ ఎప్పుడూ ఆ వ్యవహారాలలోనే మునిగి వుండేవారు.

ఓ రోజు మధ్యాహ్నం ఆయన యింట్లోనే వున్నారు. మనిషి సుముఖంగానే వున్నారు. అది అవకాశంగా తీసుకొని నేను ఆయనని రెచ్చగొట్టాను. నా చేష్టలకి ఆయన నుండి ప్రోత్సాహం బాగానే వచ్చింది, ఏ దేవుడో కరుణించా డనుకున్నాను.

కానీ అది నాకు శాప ఘడియలని నాకు అప్పుడు తెలియలేదు.

శరీరంలో ఏ మూలో దాగివున్న కోర్కెలు త్రాచు పాములా బుసలుకొడుతోంది.

సరిగ్గా ఆ సమయంలోనే ఆయనకి ఫోన్ రావడం ఆయన నాకు 'సారీ' చెప్పి హడావుడిగా డ్రస్సప్ అయి వెళ్ళిపోవడం అన్నది క్షణంలో జరిగిపోయింది.

బుసలు కొట్టే కోర్కెల తాపంతో హతాశురాలనై అర్ధనగ్నంగా మంచంమీద పడుకొని వున్నాను. ఆ సమయంలో నా బుద్ధి అన్నది పనిచేయడంలేదనే అనుకోవాలి. నాలో విచక్షణాజ్ఞానం నశించినదనే అనుకోవాలి. సరిగ్గా ఆ సమయంలో...."

గోపాల్‌రావు చటుక్కున స్విచ్‌ను ఆపుచేశాడు.

అతని మొఖం అంతా చెమటలు పట్టేసింది. మనిషి కొంకర్లు తిరుగుతూ—"క్రిష్ణా నన్ను క్షమించరా! నన్ను క్షమించు. అవి విషపు ఘడియలు. ఆ విషమే యిరవై సంవత్సరాల తరువాత....మన కుటుంబాలని...." అంటూ గోపాలరావు ప్రాణం వదిలేశాడు.

నిర్జీవకట్టె నేలమీదకి వొరిగిపోయింది.

ఎవరికీ బుర్ర పనిచేయడంలేదు, షాక్ మీద షాక్!

ఆ గదిలో రెండు శవాలు!!

కృష్ణారావు మొహం చాల వికృతంగా తయారయింది. పళ్ళని గట్టిగా బిగించి, టేప్‌ని ఆన్‌చేశాడు.

గోపాలరావు భార్య, కొడుకుల దుఃఖం వర్ణనాతీతం.

"....ఆ సమయంలోనే గోపాలరావుగారు బెడ్‌రూము లోకి వచ్చారు. స్నేహితులమధ్య హద్దులు లేకపోవడం వలనే ఆయన చొరవగా రాగలిగారు.

ఆ స్థితిలో వున్న నన్ను చూసి మంత్రించినట్లు నిలబడి పోయారు. నేను నా శరీరాన్ని మరుగుపరచుకోలేదు. తరువాత నెమ్మదిగా నా మంచంవద్ద కొచ్చారు. నేను వారించలేదు.

ఆ క్షణంలో నాకు ఏదో కావాలనిపిస్తోంది. అందుకని నేను దేన్నిగూర్చి ఆలోచించలేదు.

నా శరీరతాపం చల్లారింది.

దానికి ఫలితమే వాసంతి!

అయితే వాసంతి తనవలనే పుట్టిందనే విషయం గోపాలరావుకి తెలియదు. ఆ తరువాత ఆ సంఘటనని మేము మరచిపోయాము. ఏమీ జరగనట్లే మాములుగానే ప్రవర్తించాము. మాలో ఎటువంటి కాంప్లెక్సులు కలగ లేదు.

మొన్న వాసంతి బర్త్ డే నాకుకూడా తెలియకుండా ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారు. ఆ నాడే మా పాపం పండినదన్నమాట.

నిజం చెబితే నా బ్రతుకు వీధిపాలవుతుంది. మగాడు దేనినైనా భరిస్తాడుగానీ, భార్య రంకుతనాన్ని భరించలేడు.

అన్నా చెల్లెళ్ళ పెండ్లి. ఎన్ని జన్మలకైనా తీరని పాపం అది. అందుకని వాసంతికి చెప్పి చూశాను, సంపత్తుని నిరాకరించమని. అది నా మాట వినలేదు సరి కదా దాని సైకాలజీ యమ్.ఏని వుపయోగించి, నా పాత డైరీలని తిరగవేసి నా గుట్టును తెలుసుకుంది.

దానికి నిజం తెలిసిన క్షణంలోనే నాలో స్వార్థం, రాక్ష సత్వం, ప్రాణంమీద తీపి ప్రవేశించింది. అది నావేపు అస హ్యంగా చూసింది. ఆ చూపుని నేను జన్మంతా భరించ లేననిపించింది. పైశాచిక ప్రవృత్తిదే పై చెయ్యి అయింది.

దానికి సైనేడ్ ఇచ్చేశాను. కానీ....ఆ తరువాత నా కడుపు కోతని భరించలేక....” ఆ తరువాత వెక్కిళ్ళు వినిపించాయి.

ఆ తరువాత పెద్దగా పిచ్చినవ్వు!

షణ్ముగసుందరం, సంపత్తు వులిక్కిపడి చూశారు.

కృష్ణారావు బట్టలు చింపుకొంటూ జుట్టు పీక్కుంటూ పెద్దగా నవ్వుతున్నాడు. వెర్రిగా డాన్సు చేస్తున్నాడు.

ఓ బలహీనపు ఘడియ - విషపు ఘడియలుగా మారి, ఎంతమంది బంగారపు జీవితాలని నాశనం చేసిందో దానికి వుదాహరణ....ఆ గది!! ★

శాంతి లేదు !!

"జీవితంలో బాగా అలసిపోయానోయ్! దేశమంతా తిరిగాను కాని, ఎక్కడా శాంతి లభించలేదు!" బాధగా నుదురు రుద్దుకుంటూ చెప్పాడు పరంధామయ్య.

"అదేమిటండీ, మీరు అంత కష్టపడాల్సింది కాదు. పోలీస్ కంప్లైంట్ ఇచ్చుంటే, వాళ్ళే మీ శాంతిని వెతికి పట్టుకునే వారు" అన్నాడు ప్రక్కనే ఉన్న పిచ్చేశ్వరరావ్.

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

శవాన్ని చంపిన హంతకుడు

కె. రవీంద్రప్రసాద్

అర్ధరాత్రి పన్నెండు గంటలు.

ఫోన్ ట్రింగ్ ట్రింగ్‌మంటున్నది.

విసుగ్గా లేచి ఫోన్ ఎత్తారు భాస్కర్.

"హల్లో! డియర్....నీలూను మాట్లాడుతున్నాను. మంచి నిద్రలో వున్నట్లున్నావ్?" అని అవతలనుండి నీలిమ ఫోన్‌లో మాట్లాడుతూంది.

భాస్కర్ ఒక్కసారి చిరాకుగా "ఏం? అర్ధరాత్రిపూట

ఫోన్ చేస్తున్నావ్...." అని అడిగాడు.

నీలిమ నవ్వింది. "అశోక్ వచ్చాడు....ఓ గంట వుండి వెళ్ళిపోయాడు....ప్రక్కన మొగతోడు లేకపోతే నిద్ర రాదుగా డియర్....ప్లీజ్! వచ్చెయ్యగూడదూ. నీవు వచ్చి చాలా రోజులయిందిగా——" అని ప్రాధేయపూర్వకమైన గొంతుతో అంది.

"భాస్కర్...." నాకు నిద్రవస్తుంది. ఇప్పుడంత దూరం రాలేను...." అని ఫోన్ పెట్టేశాడు.

తర్వాత భాస్కర్‌కు నిద్రపట్టలేదు. ఒక్కసారి నిద్ర అంతా తేలిపోయినట్లుగా పోయింది.

నెమ్మదిగా బెడ్ లైట్ వెలిగించి, సిగిరెట్ వెలిగించాడు. ఆ వెచ్చటి గదిలో——కమ్మగా సిగరెట్‌పొగ లోపలికి పోతుంటే హాయిగా వున్నది. తోచక సిగిరెట్ పెట్టెను చూస్తున్నాడు. ఎర్రని అక్షరాలు కన్పడుతున్నాయి. 'సిగిరెట్ పొగ ఆరోగ్యానికి హానికరము' అని. నవ్వుకున్నాడు.

నీలిమ గురించి ఆలోచించసాగాడు.

నీలిమ ఓ నైట్‌క్లబ్‌లో క్యాబరే ఆర్టిస్ట్. చక్కటి అవయవాలు దగ్గ యువతి. వాటితోనే క్లబ్బులో నృత్యం చౌకగా చేస్తూ డబ్బు సంపాదించుకొంటున్నది.

నీలిమ పవిత్రురాలేం కాదు. క్లబ్ డేన్సర్ కనుక.... ప్రతివాడికీ వొళ్ళూ, కళ్ళూ తాకించాల్సిందే.

ఓ రోజు భాస్కర్ ఆ క్లబ్బుకు సరదాగా వెళ్ళాడు. బీర్ త్రాగుతూండగా.... "హలో....హౌడుయూడూ?" అంటూ నీలిమ అతని చెంతకొచ్చింది.

ఆడదంటే అతనికి క్రొత్తకాదు. పెళ్ళి కాకపోయినా అతనికి చాలా స్త్రీ అనుభవమున్నది.

కానీ అప్పుడతను చిరాకులో వుండి....విసుగ్గా మొహం

పెట్టి "నేనెందుకు నీ సంగతి నీవు చూసుకో!" అన్నాడు.

నీలిమ మొహం పాలిపోయింది. షేమ్ ఫీలయ్యింది. అప్పటికి ఓ.కే....అంటూ మరోకడి దగ్గరకు పోయింది.

అక్కడ చేరిన ప్రతివాడూ ఆమె నడుంపైనో, ఇంకెక్కడో చేతులు వేస్తూనేవున్నారు. ఏమేమో చెప్తూనే వున్నారు. నీలిమ అందరి చేతులూ మృదువుగా తొలగిస్తూ. వారికి ఏవేవో చెప్తూ తిరిగి డయాస్ యెక్కింది.

నృత్యం చేయసాగింది.

ఆమె కదిలించని భాగంలేదు....

మనిషి పిచ్చిపట్టినట్లుగా-కసికసిగా-డాన్సు చేస్తూంది-దానికి తగ్గట్టు ఆర్కెస్ట్రా జోరుగా వాయించసాగారు....

తను బీరుమీద బీరు త్రాగుతూ .... ఆమె డాన్సు చూస్తున్నాడు.

అతనికి ఆమె కావాలనిపించింది.

బేరర్‌ను పిలిచి అడిగాను.

"ఇక్కడ బేరాలుండవ్-నేరుగా ఆమె యింటికి పోయి కనుక్కోండి సార్" అంటూ అడ్రసిచ్చాడు వాడు.

క్లబ్బు మూసింతర్వాత....ఆమె తన కారులో వెళ్ళిన తర్వాత ఓ అరగంట తర్వాత బైకుమీద ఆమె యింటికి వెళ్లాడు.

తలుపు తట్టాడు....

"ఎవరూ!" అంటూ తలుపు తీసింది నీలిమ.

నైట్‌గౌనులో వున్నది. లోపల ఎటువంటి ఆచ్ఛాదనా లేనట్లున్నది.

"నేను!" అన్నాడు.

"నేనంటే....?" అంది.

"క్లబ్బులో చూశావుగా...." అన్నాడు.

"క్లబ్బులో లక్షా తొంభై మందిని చూస్తాం....అందరూ మాకు గుర్తుండరు...." అంది.

"ఇందాక మొహం చిన్నబుచ్చుకొంటివిగా...."

"హలో! ఇప్పుడు మొహం పెద్దది చేయటానికి వచ్చారా?" అంది వ్యంగ్యంగా.

ఇక ముసుగులో గుద్దులాట అనవసరం అనుకొని.... "ఈ రాత్రికి నీవు కావాలి....ఎంత?" అన్నాడు.

ఆమె మొహం వెంటనే సీరియస్ ఐ, "ఇది బోగం కొంప కాదు-నేను సానిని కాను....దయచేసి అవతల బజారుకు పొండి" అని గిరుక్కున వెనక్కు తిరిగింది.

త్రాగుడుమత్తులో తనేం చేస్తున్నా తనకే తెలియకుండా ఆమెను వాటేసుకుని-"ప్లీజ్! నీవెంత కావాలంటే అంత ఇస్తాను. ఈ రాత్రికి నీవు కావాలి...." అంటూ ఆమెను ముద్దులతో ముంచెత్తసాగాడు.

ఆమె ఆడబెబ్బులి ఐ...."రాస్కెల్! నా ఇంట్లో చేరి నన్నే అవమానిస్తావా?" అంటూ ఒక్కతోపు తోచింది.

అతను అల్లంత దూరాన పడ్డాడు.

అప్పుడు చూశాడు. అక్కడో డబుల్ కాట్ బెడ్ వున్నది. దానిమీద పదిహేడేళ్ళ కుర్రాడు నగ్నంగా పడుకొని ఇదంతా చూస్తున్నాడు.

అర్థమైందతనికి. అంటే....ఈ రాత్రికి అవసరం లేదన్నమాట! అనుకుంటూ లేచి తూలుకుంటూ బైక్ దగ్గరకి నడిచాడు....

మర్నాడు తిరిగి క్లబ్బుకు వెళ్లాడు. నీలిమదాన్ని ఆ రోజు లేదు. తిరిగి ఆమె ఇంటికి వెళ్లాడు.

నీలిమ లోపలవున్నది. తనే "క్షమించండి రాత్రి ఆ



కుర్రోడున్నాడు. అందుకే అలా అనవల్సి వచ్చింది" అంది నొచ్చుకొంటున్నట్లుగా.

"ఎవడా కుర్రాడు....?"

"అశోక్!"

"అంటే....?"

"వాళ్ళనాన్న పోలీసు ఆఫీసరు...."

"అయితే...."

"ఆ కుర్రోడికి నేను కావాలిట. లేకపోతే చచ్చిపోతాట్ట నిండా అతనికి ఇరవై లేదు వయస్సు!" అంది.

"ఆ కుర్రాడ్ని ఊబిలోకి దింపావన్న మాట—"

"నే దింపలేదు. అతనే దిగాడు. వద్దంటే ఓ రోజు నా ముందే స్లీపింగ్ పిల్సు మ్రింగాడు. అతన్ని బ్రతికించే సరికి నాతల ప్రాణం తోకకి వచ్చింది" అంది.

"ఈ రోజు రాత్రికి రాడా!"

"రాడు" అంది.

"ఏం?" అన్నాడు.

"ప్రతి శనివారంరాత్రి వస్తాడు. ఆదివారం సాయంత్రం వెళ్ళిపోతాడు."

"ఎక్కడికి?"

"హాస్టలుకు"

"అతను హాస్టలులో వుంటున్నాడా?"

"అవును. వాళ్ళ నాన్న ఇక్కడ దగ్గరలో ఏదో టౌనుకి పోలీసు ఆఫీసరు. ఈ అబ్బాయి ఇక్కడ కాలేజీలో చదువుకొంటున్నాడు...."

"ఏం చదువుకొంటున్నాడు?"

"ఇంటర్‌మీడియట్ ...."

"మరి నీకెట్లా పరిచయమయ్యాడు...."

"వోరోజు పేపరు చూస్తూ ఈరోజు సెక్సు బాంబ్ 'నీలూ' నగ్నదృశ్యం అని చదివాట్ట. క్లబ్బుకు ముందే టేబిలు బుక్ చేయించి, ముందుగా వచ్చి కూర్చున్నాడు. నేను రాగానే....ఇక ఆగలేక....డయాస్ ఎక్కి పిచ్చి పిచ్చిగా డాన్స్ చేయసాగాడు....

తర్వాత నేను కావాలంటూ పట్టుపట్టాడు. ఎంతో నచ్చజెప్పాను. చస్తానని స్లీపింగ్ పిల్సు వోరోజు మింగాడు.... ఇక తప్పదని ..." అని దీర్ఘంగా నిట్టూర్చింది నీలిమ.

భాస్కర్ నిట్టూర్చి...."పద" అన్నాడు.

2

నీలూ ఇంటికి వచ్చాడు భాస్కర్. ఆ రోజు రాత్రి ఫోన్‌లో అలా మాట్లాడిన తర్వాత తిర్గి నీలూను కలుసుకోలేదు భాస్కర్.

హోముకు వెళ్ళాడు. ఆ రోజు వారం గుర్తుకు తెచ్చుకొన్నాడు. శనివారం. అంటే ఇవాళ అశోక్ వచ్చేరోజన్న మాట.

"రానీయ్—" అతనితో మాట్లాడాలి....అనుకొంటూ లోపలకు వెళ్ళాడు.

"అంతే!"

నిశ్చేష్టుడయ్యాడు.

'అశోక్' శవం అక్కడ పడివున్నది. అతని గుండెలో కత్తి దింపబడి వున్నది.

చుట్టూ చూశాడు.

ఎవ్వరూ లేరు.

నీలూ ఏమైనట్లు. మనిషి వణికిపోతున్నాడు. చెమటలు వొస్తున్నాయి. మనసు శూన్యంలోకి పోయింది. ఈ హత్య ఎవరు చేసినట్లు....?

అంతలో పోలీసు విజిల్స్!

పరిగెత్తబోయాడు....

బలమైన చేతులు అతన్ని పరిగెత్తనీయకుండా చేశాయ్.

అవి ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రివి.

"యూ ఆర్ అండర్ అరెస్టు" అంటూ అతనికి బేడీలు వేశారు కానిస్టేబిల్స్.

""ఎందుకూ! నేను హత్య చేయలేదు...." అంటూ గట్టిగా అరిచాడు. అరిచానని అనుకొన్నాడు. ఆ భయంలో అతనిమాట నోట పెగలిరాలేదు.

అతని అయోమయ చూపులుచూసి, అతనే హత్యచేశాడనే నిర్ధారణకు వచ్చాడు కృష్ణశాస్త్రి.

ఇంతలో 'నీలిమ' కారేసుకొని వచ్చింది. తన ఇంట్లో వీళ్ళంతా వుండేటప్పటికి కంగారుపడింది.

ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి ఆమెకు అన్ని విషయాలూ చెప్పాడు. "తనకు ఫోన్ వచ్చిందనీ, అది ఎవరో తెలియదని, ఇక్కడ హత్య జరిగిందనీ—వెంటనే రమ్మని...." అని చెప్పాడు.

నీలిమ 'అశోక్'ను చూడగానే బావురుమంది. ఆమె

చేసేది అసభ్యమైన డాన్సే కావచ్చు. అది ఆమె వృత్తి. కానీ ఆమే మనస్సున్న మనిషేకదా!

అశోక్ గురించి వివరాలడిగాడు ఇన్‌స్పెక్టర్.

చెప్పింది నీలిమ.

నోట్ చేసుకొన్నాడు.

శవాన్ని పోస్టుమార్టమ్‌కు పంపడమైనది. అవసరమైన ఫొటోలూ తీయడమైనది.

భాస్కర్‌ను కటకటాల్లో వుంచారు.

3

"నీలిమగారూ! ఈ కేసు ఒక పట్టాన తేలాలంటే మీకు అనుమానితులెవరైన వుంటే చెప్పాలి" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్ శాస్త్రి.

నీలిమ నిట్టూర్చింది. "నేను బీదదాన్ని. నా పదో ఏట మా అమ్మ పోయింది. పన్నెండో ఏట నాన్నా పోయాడు. నా అందం నన్ను బ్రతకనియ్యలేదు. ఓరోజు నన్ను పెంచు తున్న మా పెదనాన్నే నన్ను అనుభవించాడు.

దాంతో విరక్తిచెంది చావబోయాను. వొకాయన రక్షించి — డాన్సు నేర్పించి — క్లబ్బులో కుదిర్చాడు. ఆయన దయవలన నేడు ఇంత సంపాయించుకుంటున్నాను. ఇలా బ్రతకగల్గుతున్నాను.

నేను 'శీలం' లేనిదాన్నే. అయితే అందరూ నాకు విటులుకారు. మనస్ఫూర్తిగా నేను కావాలనే వాళ్ళకే నేను...."

"అంటే అశోక్...."

"అవును. అశోక్ తండ్రి మీకు తెలుసుకదా!—" అంటూ అశోక్ కథంతా చెప్పింది.



నిట్టూర్చి "భాస్కర్ యెంతకాలంగా పరిచయం" అంటూ ప్రశ్నించాడు.

"భాస్కర్ కూడా వోవింత జీవే. క్లబ్బులో నన్ను చూసి సరాసరి నా ఇంటికొచ్చాడు. ఆనాడు అశోక్ నా దగ్గ రున్నాడు. భాస్కర్‌ను నిందించి పంపాను. అయినా తిరిగి వచ్చాడు. దారితీశాను....అతను ఆడదాన్ని సుఖపెట్టగల మనిషే...."

"అతను అశోక్‌ను హత్యచేయటానికి ఏమైనాఆస్కార మున్నదా?"

"నాకు తెలియదు. వుంటుందని అనుకోను. భాస్కర్ శని ఆదివారాలు రాడు. ఆరోజు అశోక్ వస్తాడనిభాస్కర్‌కూ తెలుసు"

"మరి నిన్నెందుకు వచ్చాడూ?"

"అదే విచిత్రంగా వున్నది...."

"ఇంకా యెవరున్నారు ఇంట్లో?"

"డ్రైవరు రాము, పని కుర్రాడు వాసు."

"డ్రైవరు యెటువంటివాడు?"

"అతన్ని నేనే ఏరికోరి పెట్టుకొన్నాను. నాకు సెక్సు డిజైర్ కలిగితే-దగ్గర్లో యెవ్వరూ లేకపోతే రామూనే."

కృష్ణశాస్త్రి నవ్వి "రాము యెక్కడ...." అన్నాడు.

"ఇవ్వాళా రాలేదు" అంది.

"ఎక్కడకు వెళ్లాడు ఇన్నిరోజులుగా"

"వారమయింది. తన మరదలు దగ్గర పల్లెలో ఉందని చెప్పాడు. చూసివస్తాననీ, వీలుంటే దాన్ని చేసుకుంటా ననీ చెప్పాడు" అంది నీలిమ.

"ఆల్‌రైట్!" అనేసి వెళ్ళిపోయాడు కృష్ణశాస్త్రి.

4

"వ్వాట్!" అదిరిపడ్డాడు కృష్ణశాస్త్రి.

"అశోక్ సూసైడ్ చేసుకొన్నాడా?"

"యస్ సర్....రిపోర్టులో అతను ఎక్కువ స్లీపింగ్ పిల్సు మ్రింగి మరణించినట్లు ఉన్నది. ఆ తర్వాతనే అతన్ని అతను చచ్చాడని తెలియక కత్తితో పొడిచారు" అని చెప్పాడు అసిస్టెంట్.

"వోహ్? కేసు గమ్మత్తుగా వుంది. మద....మనం అశోక్ తండ్రితో మాట్లాడుదాం—" అంటూ జీప్ యెక్కాడు కృష్ణశాస్త్రి, తదితరులు అనుసరించారు.

కృష్ణశాస్త్రి వెళ్లేటప్పటికి అశోక్ తండ్రి, తల్లీ విచారంగా సోఫాలో కూర్చుని ఉన్నారు. అతను పోలీసు ఆఫీసరయినా వొక్కగా నొక్క బిడ్డ తండ్రికదా!

కృష్ణశాస్త్రి విష్‌చేసి-విషయం చెప్పాడు.

ఆయన ఆశ్చర్యపోయి....శాస్త్రి! మావాడు అతి చిన్న వయస్సులో ఈ ప్రపంచం చేసే గారడీల వలలో చిక్కు కొని తన లైఫ్ అంతం చేసుకొన్నాడు.

వాడు చిన్నప్పుడే సిగరెట్లు కాల్చేవాడు....స్నేహితులతో పేకాట ఆడేవాడు. నేనోసారి టౌన్‌కొచ్చి చూస్తే వాడూ-వాడి ఫ్రండ్సు రూంలో తుక్కుగా త్రాగుతూ వున్నారు. బెదిరించాను. కోపపడ్డాను. తిట్టాను కొట్టాను.

ఊహు-వాడిలో మార్పులేదు. హాస్టలులో చేర్చాను. ఇంకా నాకే యెదురు తిరగసాగాడు. నాకూ సహనం పోయింది. వాడ్ని వొదిలేశాను. చివరికి కేబెరాలకూ— కేబెరాడాన్సర్ ఇంటికి పోవటం మొదలెట్టాడట!

ఆ అమ్మాయికీ వార్నింగ్‌లు ఇచ్చాను....కానీ ఆపిల్లా చెప్పింది. స్లీపింగ్ పిల్సు మింగాడట వొక రోజు....ఇక ఆ పిల్ల ఏంచేస్తుంది....

నా చేతుల్లో వాడిక లేడనీ....అతి చిన్న వయస్సులో వాడు చేయరాని పనులు చేస్తున్నాడనీ తెలిసీ - పోలీసాఫీసరయి వుండీ ఏమీ చేయలేక వుండిపోయాను" అని కళ్ళనీళ్ళు తుడుచుకున్నారు.

"అంటే....అతనే మ్రింగి ఉంటాడనా సార్?"

"యస్. అదేదో రానని ఉంటుంది. వీడు సహజంగా ఉద్రేకి. తన్ను తాను హింసించుకునే రకం, అందుకే మింగి, చచ్చి ఉంటాడు...." అని అన్నారు.

"మరి అతన్ని పొడిచే అవసరం ఎవరికుంటుంది సార్?" అన్నాడు కృష్ణశాస్త్రి.

"అది నీవు తేల్చవలసిన విషయం శాస్త్రీ! వాడెంత నిర్భాగ్యుడో...." అని అన్నారు అశోక్ తండ్రి.

తల్లి దుఃఖిస్తు కూర్చుండిపోయింది.

"మీరు ఏడవకండమ్మా! నేనా దుర్మార్గుడ్ని తప్పక పట్టుకుంటాను. చచ్చిన వాళ్ళనూ హత్యచేసే వెధవలున్న ఈ దేశంలో వాడ్ని పట్టుకోందే నేను నిద్రపోను...."

అనేసి, "వస్తాసార్...." అంటూ బయటపడ్డాడు కృష్ణ శాస్త్రి.

5

"రామూః నువ్వెన్నాళ్ళున్నావ్....మీ ఊర్లో...."

"వారం సార్!"

"మీ అమ్మగారింట్లో హత్య జరిగింది. తెలిసే ఉంటుందిగా...."

"తెల్సింది సార్?"

"నువ్వేమనుకొంటున్నావ్?"

"అమ్మగారు చేసివుండరు సార్?"

"మరి...."

"ఆ భాస్కర్‌గారే చేసి వుండొచ్చు సార్?"

"ఉండొచ్చుకాదు. ఎందుకు చేసివుండాలి...." అని అడిగాడు డ్రైవరు రామును, ఇన్‌స్పెక్టర్ శాస్త్రి.

"ఆ బాబుకు అశోక్ అంటే ఇష్టం ఉండదు సార్."

"ఎందుకు?"

"అతను వీరికి మధ్య ఉంటం ఇష్టంలేక....చంపేసి ఉంటాడు సార్...."

"ఆ....మరి....నీవూ వున్నావుగా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నెమ్మదిగా.

రాము మొఖం వాలిపోయి "అమ్మగారు చెప్పారా సార్?" అన్నాడు.

"ఊఁ...."

"నిజమే సార్! నేనన్నా అమ్మగారికి ఇష్టమే సార్! అందుకే నన్ను అప్పుడప్పుడు ..."

"ఎప్పుడెప్పుడు...."

"భాస్కర్, అశోక్‌లు రాని రోజు."



"పెళ్ళి కాలేదా నీకు ...."

"మొన్నే అయ్యింది సార్....దాన్నిగూడా తీసుకు వచ్చాను సార్...." అన్నాడు.

"చూపించు" అన్నాడు.

అవుట్ హౌస్‌నుండి పెళ్ళాన్ని పిలుచుకొచ్చాడు. చూసి—"ఇక మీరు వెళ్ళవచ్చు"—అని తాను వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణశాస్త్రి.

6

"హత్య - ఎవరు చేసివుంటారు? కేబెరా నర్తకురాలయినా నీలిమలో నీతి, నిజాయితీ ఇంకా చావలేదు. భాస్కర్ చంపాడనటానికి ఆ తావున ఉంటం తప్ప—ప్రబలమైన సాక్ష్యాలు లేవు.

రామూ వారం రోజులుగా ఊళ్లో లేడనటానికి నిదర్శనం అతను వారం రోజులుగా అతని ఊర్లోనే ఉన్నాడు. ఎంక్వయిరీలో తెల్సింది....మరి....మరి....

"ఏదో చటుక్కున జ్ఞాపకం వచ్చింది. గబగబా

భాస్కర్ సెల్ దగ్గరకు వెళ్ళి....నువ్వు నీలిమను కలుసుకొని ఎన్ని రోజులయ్యింది" అని అడిగాడు.

"చెప్పాడు...."

"ఎందుకు అంత డిలే చేశావు...."

"నాకీ మధ్య పెళ్ళి చేసుకోవాలనిపించింది. అందుకే కావాలని దూరంగా ఉన్నాను. అంతగా నా అవసరం అని అన్పిస్తే ఫోను చేస్తుందని...."

"ఫోన్ చేసిందా...."

"ఆ...."

"ఎప్పుడు....?"

"నాల్గు రోజుల క్రితం."

"అంటే హత్యకు నాల్గు రోజుల క్రితమా?"

"అవును...."

"ఏమని?"

"రమ్మని."

"వెళ్లావా?"

"వెళ్ళలే!"

"ఆమె ఏం మాట్లాడిందో గుర్తుందా?"

చెప్పాడు భాస్కర్.

కృష్ణశాస్త్రి వొక్కసారి ఆలోచించి—"హంతకుడు దొరికాడు...." అంటూ బయటకు పరిగెట్టాడు.

సరాసరి-నీలిమ దగ్గరకు వచ్చాడు. నీలిమ ఇంట్లోనే ఉన్నది.

గబగబా అడిగాడు "ఆరోజు భాస్కర్‌కు ఫోన్‌చేసిన తర్వాత మీరేం చేశారు....?"

నీలిమ ఒక్కక్షణం గుర్తుకు తెచ్చుకుంది....

"....రాముా కోసం షెడ్‌లోకి వెళ్లాను. అక్కడకి

వెళ్ళిన తర్వాతగానీ నేనే రామును వాళ్ళ ఊరికి పంపించిన సంగతి జ్ఞాపకం రాలేదు.

తీరా చూస్తే, అక్కడ పని కుర్రాడు వాసు నావంకే ఆతృతగా చూస్తున్నాడు. వాడ్ని చూస్తూ పడుకోలేదేం— అన్నాను. 'నిద్ర రావటం' లేదని నావంకే చూడసాగాడు.

నన్ను నేను చూసుకొన్నాను. వంటిమీద బట్టల్లేవు. అది వాడి తప్పు కాదనుకొని-లోపలకు వచ్చి-తలుపు వేసుకొని-త్రాగి పడుకొన్నాను. ఎప్పటికో నిద్రపట్టింది...." అంది.

"వాసుకు వయస్సెంత?"

"పదహారు...."

7

కోర్టు తీర్పు సారాంశం ఇది.

"నీలిమ అందాన్ని తానూ ఆస్వాదించాలని-ఆ ఛాన్సు తనకు రాలేదనీ—అశోక్ ఆ ఆనందాన్ని అనుభవించటం-తన వయస్సువాడే అన్ని సుఖాలు పొందటం....వాసుకు తీరని వ్యధగా మారి....అశోక్‌ను పొడిచాడు.

కానీ అప్పటికే అశోక్, భాస్కర్ నీలిమల విషయం తెలిసి-తాను నీలిమను సాధిద్దాం అనే కక్షతో తాను ఆత్మ చేసుకొన్నాడు.

శని, ఆదివారాలు కాని ఓరోజు అతను నీలిమ ఇంటికి వెళ్లాడు....అక్కడ భాస్కర్ నీలిమల శృంగారం చూసి-దెబ్బతిని-పిల్సు తెచ్చుకొని చచ్చిపోయాడు. దీనికిగాను అతను వ్రాసుకొన్న డైరీ చక్కని సాక్ష్యం. భాస్కర్‌ను విడుదల చేస్తున్నాం.

పోలీసుకూ, నీలిమకూ ఫోన్లు చేసిందీ వాసుయే మారు గొంతుతో.

★

ఏము మాటలు వస్తున్నారు

వసుంధర

ఆ ఇంట్లోంచి ఏడ్పులింకా వినిపిస్తూనేవున్నాయి.

ఆ యింటివారబ్బాయి హరి చచ్చిపోయి అప్పటికి రెండ్రోజులయింది. హరి చావు సహజమైనది కాదు. హత్య!

అయితే పోలీసులు మాత్రం దాన్ని ఆత్మహత్యగా అభివర్ణించుకుని సరిపెట్టుకున్నారు. ఎందుకంటే హరి విషంతిని చచ్చిపోయాడు.

హరి మధ్యతరగతి యింటివాడు. అతని తండ్రికింకో రెండు సంవత్సరాలు సర్వీసుంది. హరి రెండు సంవత్స

రాలుగా వుద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. అతను బియ్యే ప్యాసయ్యాడు.

హరితండ్రి రెండు రకాలుగా అతనిమీద ఆశలు పెట్టుకున్నాడు. అతనికి పెళ్ళిచేస్తే వచ్చే కట్నంతో పెద్దకూతురు పెళ్ళి చేయాలనీ, హరికి ఉద్యోగంవస్తే తనపిల్లల బాధ్యత నతడు స్వీకరిస్తాడనీ! పెళ్ళీడుకొచ్చిన కూతురుకాక ఆయన కింకో ఇద్దరు కొడుకులున్నారు.

ఉద్యోగం రాలేదన్న నిరాశతో అతను విషం మింగి చనిపోయాడని పోలీసులు అంటారు.

కానీ ఆ విషయాన్ని హరితండ్రి నమ్మలేకపోతున్నాడు. చనిపోయే ముందురోజువరకూ కూడా హరిలో ఆశ చావ లేదు. అతను తండ్రికి తనకు భవిష్యత్తు మీదవున్న నమ్మకం గురించి ప్రతిరోజూ చెబుతూనే వుంటాడు. అతన్ని నిరుత్సాహం ఆవరించిన సూచనకూడా ఎన్నడూ కానరాలేదు. పైపెచ్చు అతనెప్పుడూ ఉత్సాహంగా కూడా వుంటాడు.

హరి ఆత్మహత్య చేసుకోలేదన్నంతవరకూ బాగానే వుంది. కానీ అతన్నెవరు హత్య చేస్తారు?

హరి చావువల్ల ఎవరికీ ఏ విధమైన ప్రయోజనమూ వుండదు. అతని జీవితం మీదనే ఆ యింట్లో అందరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అలాంటప్పుడు ఇంట్లో వారెవ్వరూ అతన్ని హత్యచేయరు. మరి బయటివారెవ్వరైనా చేశారనుకుందామా అంటే-ఎందుకు?

ఈ ప్రశ్నకు జవాబు దొరక్కే పోలీసులు హరిది ఆత్మహత్య అని సరిపెట్టుకున్నారు. అంతటితో వారి సమస్య తీరిపోయింది కానీ హరి కుటుంబం సమస్య తీరలేదు గదా! అందుకే ఆ యింట్లోంచి యింకా యేడ్పులు వినిపిస్తూనే వున్నాయి.

2

"ఆ యింట్లో ఏడ్పులు ఆగేలోగా ఇంకో హత్యచేయాలి" అన్నాడు జనార్దనం.

ఈ మాటలు పుల్లయ్య విన్నాడు. జనార్దనం నోటమ్మట ఇలాంటి మాటలు వినడం అతనికి కొత్తకాదు. పుల్లయ్య అండగా వుండడంవల్లనే జనార్దనం నోటికి వచ్చినట్లు మాట్లాడుతుంటాడు. అతని మాటలు విని అందులో ఔచిత్యాన్ని నిర్ణయించడం పుల్లయ్య విధి.

వాళ్ళిద్దరూ కలిసే హత్యలు చేస్తూంటారు. పథకం పుల్లయ్యది. ఆచరణ జనార్దనానిది. ఆ విధంగానే హరి చచ్చిపోయాడు.

హరికీ వీళ్ళిద్దరికీ శతృత్వం లేదు. ఆ మాటకొస్తే హరిని చంపాలనుకున్న నరేంద్రబాబుకీ అతనితో శతృత్వంలేదు.

అయితే నరేంద్రబాబుకు లక్షల ఆస్తితోపాటు ఓ గారాల కూతురుంది. ఆ కూతురు పొరబాటున హరిని ప్రేమించింది. ప్రేమించి ఊరుకోకుండా పెళ్ళి చేసుకుంటానంది.

హరికి ఉద్యోగం దొరికేవరకూ వాళ్ళిద్దరూ కలుసుకోకుండా ఉన్నట్లయితే తప్పకుండా ఆ పెళ్ళి జరిపిస్తానని నరేంద్రబాబు కూతురికి మాట యిచ్చాడు. స్వశక్తిమీద ఉద్యోగం సంపాదించుకుంటేనే తనకు అల్లుడయే అర్హత హరికి వస్తుందని ఆయన నొక్కి చెప్పాడు. ఆ విధంగా హరి, ఆయన కూతురు తాత్కాలికంగా విడిపోయారు.

హరికి జీవితం మీద ఆశ పెరగడానికి నరేంద్రబాబు కూతురు కూడా చాలావరకూ కారణం. తనకుద్యోగం దొరికితే ఆమె కూడా దొరుకుతుందని అతను కలలు కంటూండేవాడు. ఆమెనతను ప్రేమిస్తున్న మాట నిజమే

అయినప్పటికీ ఆమె డబ్బుమీద కూడా అతనికి ఆశ లేక పోలేదు.

అయితే అతని ఉద్యోగప్రయత్నాలన్నీ వరుసగా ఫెయిలైపోతున్నాయి. అందుకు నరేంద్రబాబు అదృశ్య హస్తం కారణముందని చాలా ఆలశ్యంగా తెలుసుకున్నా డతను.

ఆ విషయం ప్రియురాలికి చెప్పాలనుకుని అవకాశం రాక నరేంద్రబాబుకే తన అనుమానం వివరించాడు.

అంతే! ఆయనకు జనార్దనం, పుల్లయ్యలు తెలుసు. వాళ్ళకు పదివేలిచ్చాడు. హరిపని అయిపోయింది.

ఎవ్వరికీ హరి మరణానికి కారణం తెలియదు. ఆఖరికి నరేంద్రబాఖు కూతురికి కూడా ...

"అలాగే చేద్దాం...." అన్నాడు పుల్లయ్య.

"వెంటనే ఒప్పేసుకుంటావులే నువ్వు. కష్టమంతా నాది గదా...." అన్నాడు జనార్దనం.

"నీకింకా కష్టమెక్కడుంటోంది? దాన్ని నేను తేలిక చేసి పారేస్తూంటే ...."

"కబుర్లు చెప్పడానికేంలే—హరికి కాఫీ హోటల్లో కాఫీలో విషం కలిపాను. ప్లాను నీదే కానీ అందులోని కష్టనష్టాలన్నీ నావి. పట్టుబడితే జైలుశిక్ష కూడా నాకే. అయినా దక్కిన పదివేలూ ఇద్దరం పంచుకున్నాం— సమంగా!" అన్నాడు జనార్దనం.

"ఇలాంటి పాడాలోచన్లు మనసులోకి రానివ్వకు. నీకే ప్రమాదం. నేను చెప్పిన పథకానికి తిరుగుండదు. నీకు జైలుశిక్షపడడం కలలోని మాట. ఒకవేళ పడిందీ అంటే అప్పుడు నువ్వు పోలీసులకు నా మాటెలాగూ చెప్పేస్తావు. నేనూ జైలుపాలవుతాను...." అన్నాడు పుల్లయ్య.

"ఇద్దరం జైల్లో కూర్చుంటే నాకేం లాభం? అందుకే కదా చెరో డ్యూటీ తీసుకున్నాం."

"అది తెలిశాక నువ్విలాంటి మాటలనకూడదు...."

"అనను కానీ నాకు వాటా ఎక్కువివ్వాలి?" అన్నాడు జనార్దనం.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? శ్రమకు తగ్గఫలితం...."

"ఇప్పుడు వాటాలు శ్రమకు తగ్గట్లుగానేగా తీసుకుంటున్నాం...." అన్నాడు పుల్లయ్య.

"లేదు. కావాలంటే ఆ విషం ఋజువుచేయగల్ను...."

"ఎలా?"

"నువ్వెలా కోరితే....అలా!"

పుల్లయ్య రెండు నిముషాలాలోచించి—"ఆ యింట్లో ఏడుపు ఆగేలోగా ఇంకో యింట్లో ఏడ్పు ప్రారంభం కావాలనిగదా నీ ఆశ—మనిద్దరమూ చెరోహత్యా చేద్దాం. నీకు నా పథకం ఉండదు. నాకు నీసాయం వుండదు...." అన్నాడు.

జనార్దనానికీ అయిడియా బాగా నచ్చింది. అయితే ఎవర్ని చంపాలి?

అవును యెవర్ని చంపాలి?

ఇదరూ చాలాసేపు ఆలోచించారు. చంపాలనుకునేటంత శత్రువులెవ్వరూ ఇద్దరికీ స్ఫురించలేదు.

జనార్దనం, పుల్లయ్య అన్నదమ్ములౌనో కాదో కానీ పదిహేనేళ్ళ నుంచి కలిసి వుంటున్నారు. హత్యలు, దొంగతనాలు వాళ్ళకు జీవనాధారం. ఊళ్ళోని కొందరు ధనవంతులతో వారికి బాగా పరిచయముంది. వాళ్ళుకాక చిల్లర నేరస్థులతోటీ అలగాజనంతోటీ కూడా వారికి పరిచయ



ముంది. అయినా మిత్రుత్వమూ, శత్రుత్వమూ ఏర్పచుకునే అవసరం మాత్రం వారికి కలగలేదు. తమకు అవసరమైన డబ్బు తమ పద్ధతిలో సంపాదించుకుని హాయిగా ఖర్చు పెట్టుకుని తింటారు. ఒకరి జోలీ శొంఠీ వారికక్కర్లేదు.

"ఓ పని చేద్దాం...." అన్నాడు పుల్లయ్య.

"చెప్పు...." అన్నాడు జనార్దనం.

"బస్ స్టాపులో నిలబడదాం. క్యూ ఉంటుందిగా—అందులో జనాన్ని మొదట్నుంచీ లెక్కపెట్టి—తొమ్మిదో వాణ్ని నువ్వూ, పదోవాణ్ని నేనూ చంపుదాం...." అన్నాడు పుల్లయ్య.

జనార్దనానికీ అయిడియా బాగా నచ్చింది—"ఎప్పటిలోగా?"

"ఎవరిహత్య ముందు జరిగితే వాళ్ళు నెగ్గినట్లు! అలా తీని ఊరికే కంగారుపడిపోకూడదు. అన్ని జాగ్రత్తలూ అసుకోవాలి. పట్టుబడకుండా ఉండడం ముఖ్యంగానీ హత్య చేయడం ముఖ్యంకాదు...." అన్నాడు పుల్లయ్య.

"నెగ్గినవాళ్ళకి ఆరువేలు. ఓడినవాళ్ళకి నాలుగువేలు.... అంటే ఓడిన వాళ్ళు తన దగ్గరున్న డబ్బులో ఒక వెయ్యి నెగ్గినవాళ్ళ కిచ్చుకోవాలి. ఇకపైన అవే మన వాటాలు...." అన్నాడు జనార్దనం.

3

ఇద్దరూ బస్‌స్టాపు దగ్గరకు వెళ్ళారు. ఓ అరగంటదాకా వెయిట్ చేశారు. అయితే అక్కడ వాళ్ళకెవ్వరూ దొరక లేదు. జనం గుంపుగా వున్నారు. బస్సు వచ్చేసరికి కుమ్ము కుంటూ వెళ్ళిపోతున్నారు.

"ఇక్కడ లాభంలేదు — ఫస్టైన పనేమిటంటే ఓ సినిమాహాలు దగ్గరకు వెడదాం. టికెట్లు కొనుక్కుని బాల్కనీకి వెడదాం. సీటునంబరు తొమ్మిది నీకు. పది నాకు...." అన్నాడు పుల్లయ్య.

జనార్దనం ఒప్పుకున్నాడు. ఇద్దరూ కలసి హాలుకు వెళ్లారు. విడివిడిగా టికెట్లు తీసుకున్నారు. A రోలో జనార్దనానికి సీటునంబరు తొమ్మిది, పుల్లయ్యకు పదీ వచ్చాయి.

"అయితే మన్ని మనమే చంపుకోవాలి...." అన్నాడు జనార్దనం.

"హత్యల సంగతి మరిచిపోదాం. బొత్తిగా మనకు సంబంధం లేనివాళ్ళను సరదాగా హత్యచేయడం దేవుడి క్కూడా ఇష్టం లేదనుకుంటాను...." అన్నాడు పుల్లయ్య.

"అలా తప్పించుకోబోకు. హత్యల సంగతి మరిచి పోయే పక్షంలో నువ్వు నాకు వెయ్యిరూపాయలిచ్చుకో వాలి...." అన్నాడు జనార్దనం.

"అదికాదు. డబ్బుకోసం ఎలాగూ హత్యలు చేస్తున్నాం. కానీ పందేలకుకూడా హత్యలేనా అని...." అంటూ నసి

గాడు పుల్లయ్య.

"ఎవరి అలవాట్లు వాళ్ళవి. పందేలు అలవాట్లని బట్టే వుంటాయి. దానికేంలేగానీ ఈ సినిమాకింకా జనం రాక పోరు. B రోలో తొమ్మిదినంబరు నాకు. పదినంబరు నీకు...."

పుల్లయ్య అంగీకార సూచకంగా తలాడించాడు. ఇద్దరూ హాల్లోకిపోయి కూర్చున్నారు. పెద్దగా జనం లేదు. సినిమా మొదలుకావడానికింకా వ్యవధి వుంది. హాల్లో ఏవో పాటలు వస్తున్నాయి. మిత్రులిద్దరికీ పాటలమీద దృష్టిలేదు. బీ రో కేసే చూస్తున్నారు. జనం నెమ్మది నెమ్మదిగా వస్తున్నారు. కానీ ఆ వరుసలోమాత్రం ఇంకా ఎవరూ రాలేదు.

స్లైడ్సు వేయడం ప్రారంభమయింది. బీ వరుసలో తొమ్మిదో నంబరు సీట్లో నలభై ఏళ్ల వ్యక్తి ఒకడు కూర్చున్నాడు. అతడి బట్టలు, వేషం ఖరీదైనవిగా వున్నాయి! జనార్దనంలో ఉత్సాహం వచ్చింది. "చిక్కాడు- ఆఖరికి!" అనుకున్నాడు.

A వరుసలో అన్ని సీట్లూ పక్కపక్కగా కలిసే వున్నాయి కానీ B వరుస అలాకాదు. మూడు భాగాలుగా విడిపోయి వుంది. ఒక భాగంలో తొమ్మిది, మధ్యభాగంలో పన్నెండు, మళ్లీ చివరి భాగంలో తొమ్మిది—మొత్తం ముప్పై సీట్లున్నాయి. మధ్యభాగం సరిగ్గా పదో నంబరుతో ప్రారంభమవుతుంది. పుల్లయ్య కళ్లు వెండితెరను కాక ఆ పదో నెంబరు సీటునే చూస్తున్నాయి. ఆఖరికి అందులో ఓ యువతివచ్చి కూర్చుంది. పుల్లయ్య శరీరం పులకరించింది.

ఇంటర్వల్‌లో పుల్లయ్య, జనార్దనం తాము చంపవలసిన వ్యక్తుల్ని చూసుకున్నారు. ఇద్దరూ కలిసి మాట్లాడుకుని ఒకరికొకరు ఆ వ్యక్తుల్ని చూపించుకున్నారు.

సినిమా కాగానే జనార్దనం ఆ ఖరీదైన వ్యక్తివెంట బడ్డాడు. పుల్లయ్య ఆ యువతివెంట పడ్డాడు.

4

ఆ యువతి సినిమాహాలునించి తిన్నగా ఓ బస్‌స్టాపుకు వెళ్లింది. పుల్లయ్య ఆమెకూడా బస్‌స్టాపుకు వెళ్లాడు. అతని అదృష్టం కొద్దీ అక్కడ ఇంకెవ్వరూ లేరు.

"నమస్కారమండీ—" అంటూ ఆమెను పలకరించాడు.

"నమస్కారం — మీరెవరో నాకు తెలియదు...." అందామె.

"మీరెవరో నాకూ తెలియదు. పరిచయంకోసమే నమస్కారం...." అన్నాడు పుల్లయ్య.

ఆమె నవ్వి—"నా పరిచయానికేం భాగ్యం? ఈరోజే నేనీ ఊరు వదిలిపెట్టి వెళ్లిపోతున్నాను...." అంది.

"మీ పేరూ, ఇప్పుడు వెడుతున్న ఊరూ చెప్పండి.."

ఆమె నవ్వి—"నా పేరు శోభ. నేనిప్పుడు రాజమండ్రి వెడుతున్నాను...." అంది. అతనిలా ఎందుకడుగుతున్నాడన్న కుతూహలంకూడా ఆమె కనబర్చలేదు.

"నేనూ వెడుతున్నాను రాజమండ్రి. ఒకరికొకరు తోడుగా వుండొచ్చు...."

ఆమె చిత్రంగా పుల్లయ్యవంక చూసి—"మీ పేరు?" అంది.

"నాకు తల్లిదండ్రులు తెలియదు. ఎవరూ పేరు పెట్టలేదు. కొంతమంది నన్ను పుల్లయ్యా అని పిలుస్తూంటారు" అన్నాడు పుల్లయ్య.

శోభ నిట్టూర్చి "నాకంతా వున్నారు. కానీ కావాలని నేననాథనయ్యాను. ఇప్పటికి బుద్ధొచ్చింది నాకు...." అంది.

ఇంతలో అక్కడకి బస్ వచ్చి ఆగింది. ఇద్దరూ సిటీ బస్ ఎక్కి స్టాండులో దిగారు. రాజమండ్రి వెళ్ళే బస్సుకింకా అర్ధగంట టైముందని తెలిసేక ఇద్దరూ మళ్ళీ కబుర్లలో పడ్డారు. పుల్లయ్య ఆమెతో మాటలు కలిపి ఆమెనుంచి చాలా వివరాలు పట్టాడు.

శోభ అసలు ఊరు రాజమండ్రి. ఆమె కాలేజీలో చదువుకుంటోంది. ఆమెవుండే వీధిలోని ఓ కుర్రాడు ఆమెను ప్రేమించాడు. శోభకూ అతను నచ్చాడు. ఇంట్లో వాళ్ళెవ్వరూ శోభకింకా పెళ్ళిచేసే ఉద్దేశ్యంలో లేరు.

వయసు తొందర పెడుతూంటే ఇద్దరూ కలిసి లేచిపోయి ఈ ఊరు వచ్చారు. కుర్రాడికి మోజు తీరింది. మాయమై పోయాడు. ఇప్పుడు ఆమె ఒంటరిది. రెండు రోజుల్నుంచి ఏం చేయాలా అని ఆలోచిస్తోంది. ఇందాకా సినిమా చూస్తుంటే ఆమెకు ధైర్యం వచ్చింది. ఏమైతే అయింది తను ధైర్యంగా ఇంటికి తిరిగి వెళ్ళాలనుకుంది.

పుల్లయ్య రకరకాలుగా ఆలోచిస్తున్నాడు. ఆమెనెలాగో అలా మభ్యపెట్టి ఏ ఒంటరిప్రదేశానికో తీసుకువెళ్ళి చంపే యాలని అతని ఉద్దేశ్యం. ఇప్పుడీమె తలిదండ్రుల వద్దకు వెడితే సరైన రక్షణ లభిస్తుందా? వాళ్ళీమెను ఆదరిస్తారా?

"మీవాళ్ళ దగ్గర నీకేదైనా ఇబ్బంది కలిగితే నాతో వచ్చేసేయ్. నేను నిన్నాదరిస్తాను...." అన్నాడు పుల్లయ్య.

"ఆడపిల్లనాదరించడానికి చాలామంది మగాళ్ళుంటారు. ఈ పరిస్థితిల్లో నాక్కావలసింది ఆదరణ కాదు....భర్త!" అంది శోభ.

పుల్లయ్య క్షణం ఆలోచించి...."ఎవ్వరూ లేరు నాకు. నీకు నచ్చితే నేను పెళ్ళికి సిద్ధమే!" అన్నాడు.

శోభ తెల్లబోయింది—"నువ్వు నన్ను పెళ్ళి చేసు

కుంటావా?" అంది.

"నేనో విచిత్రమైన మనిషిని. తాడూ బొంగరం లేకుండా బ్రతుకుతున్నాను. నావాళ్ళన్నవాళ్ళు లేరు. అవసరమైతే ఎంతకైనా తెగించగలను. సినిమాహాల్లో నిన్ను చూడగానే నకు నచ్చేశావ్. అందుకే వెంటబడి పరిచయం చేసుకున్నాను" అన్నాడు పుల్లయ్య.

"నీలాంటివాణ్ణి నేను పెళ్ళిచేసుకోను. సారీ!" అంది శోభ. అమె ఆ మాటలు పూర్తిచేసేసరికి ఓ కారు అక్కడ ఆగింది. అందులోంచి డ్రైవరు కిందదిగి కిళ్ళీకొట్టు దగ్గరకు వెళ్ళి "ఇక్కడెవరైనా రాజమండ్రీ పాసింజర్సున్నారా— బస్సురేటుకు తీసుకుపోతాను" అన్నాడు.

"ఏంటి కథ?" అన్నాడు కిళ్ళీకొట్టతను.

"మా అయ్యగార్ని తీసుకునీ ఊరొచ్చాను. ఆయనకిక్కడింకా అయిదారు రోజుల పనుంటుంది. ఇక్కడ ఆయనకు కారు అవసరంలేదు. నన్ను వెళ్ళిపొమ్మన్నారు" అన్నాడు డ్రయివర్.

ఆ మాటలు విని పుల్లయ్య చటుక్కున లేచి డ్రైవర్ దగ్గరకు వెళ్ళాడు. తనూ శోభ రాజమండ్రి వెళ్ళాలని చెప్పాడు. డ్రైవర్ ఇంకా ప్యాసింజర్లకోసం చూస్తూంటే "ఆ డబ్బు నేనే ఇస్తాను పద!" అన్నాడు పుల్లయ్య.

శోభ, పుల్లయ్య కార్లో వెనకసీట్లో కూర్చున్నారు. పుల్లయ్య ఆలోచిస్తున్నాడు. ఎలాగో దార్లో కారు ఆగాలి. డ్రైవర్ దూరంగా పోవాలి. శోభ చావాలి. తను మాయం కావాలి. నేరం డ్రైవర్ మీదకు పోతుంది....

కారు ఊరికొక్కస్త దూరంగా వెళ్ళి ఆగింది. డ్రైవర్ కార్లోంచి దిగాడు.

"ట్రబులేమిటి?"

"ఇంజను...." అంటూ ముందుకు వెళ్ళాడు డ్రైవర్. పుల్లయ్య తనూ కారుదిగి ముందుకు వెళ్ళాడు.

అంతే! ఊహించని వేగంతో డ్రైవర్ పుల్లయ్యను బలంగా తన్నాడు, పుల్లయ్య పడిలేచేసరికి డ్రైవర్ కారు స్టార్ట్‌చేసేశాడు. అతను చూస్తూండగా కారు వెళ్ళిపోయింది.

పుల్లయ్య తలపట్టుకుని కూర్చున్నాడు.

ఆ అమ్మాయి చేయిజారి వెళ్ళిపోయింది. ఇప్పుడామెను ఎక్కడని వెతికి పట్టుకుని హత్యచేస్తాడు? జనార్దనానికే ఈ పరీక్షలో విజయం లభిస్తుంది.

పుల్లయ్య నిరుత్సాహం ఇంకా ఓ స్థాయికి చేరుకోకుండానే అటువైపు ఓ ట్రక్కు వచ్చింది. చేతులు జాపి ట్రక్కు ఆపి అందులో ఎక్కాడతను.

ఆ డ్రయివర్ ఎవరోకానీ అంతకుముందునుంచీ తమ ననుసరించి వస్తూండాలి. తమ మాటలువిని తెలివిగా తమను బోల్తా కొట్టించాడు. శోభను ఎత్తుకుపోయాడు. బహుశా అతడామెకు మానభంగం చేయవచ్చు.

పుల్లయ్య ఆలోచనల్లో వుండగానే రోడ్డుకు పక్కగా ఓ కారు ఆగి ఉండడం కనబడింది. అతను ట్రక్ డ్రైవర్ని రిక్వెస్ట్‌చేసి అక్కడ ఆపించాడు. ఆ కారు ఇందాకా శోభ ఎక్కినదేనని రూఢి అయ్యాక అతను అక్కడ వుండిపోయి ట్రక్కు డ్రైవరుకి అయిదు రూపాయలిచ్చి ధన్యవాదా లర్పించుకున్నాడు. ట్రక్కు వెళ్ళిపోయింది.

పుల్లయ్య అక్కడ జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. అంతలో దూరంగా ఏదో కారు వస్తున్న అలికిడి అయింది. ఎందుకైనా మంచిదని అతను చెట్టుచాటుకు వెళ్ళాడు. ఇప్పుడాగి వున్నచోటే పక్కగా ఆ కారుకూడా ఆగింది.

అందులోంచి ఒక వ్యక్తి దిగాడు. ఆ ప్రాంతాలలో

పరిచయమున్న వాడికిలా అలా పక్కదారి పట్టాడు. పుల్లయ్య అతన్ని గమనించి అనుసరించుకుంటూ వెళ్లాడు. ఆ వ్యక్తి చిన్న ఇంటిదగ్గరకు వెళ్లాడు.

ఇంటిముందు ఇందాకటి కారు డ్రైవర్ వున్నాడు. అతడు ఆ వ్యక్తికి సలాంకొట్టి—"చాలా పెంకి మనిషిలా వుందండి. కాళ్ళూ చేతులూ కట్టేసి గదిలో పడేశాను...." అన్నాడు.

ఆ వ్యక్తి తలుపు తోసుకుని లోపలకు వెళ్లాడు.

పుల్లయ్య క్షణం కూడా వృథా చేయలేదు. వెనుక పాటున వెళ్ళి డ్రైవర్ తలమీద బలంగా పిడిగుద్దు గుద్దాడు. డ్రైవర్ దిమ్మతిరిగిపోయాడు. పుల్లయ్య రెండుక్షణాలు మాత్రం ఆలోచించి-పడిపోయిన డ్రైవర్ నోటిని ఒక చేత్తో నొక్కిపట్టి, రెండోచేత్తో మొలలోని బాకును తీసి బలంగా అతడి గుండెల్లో పొడిచాడు. అతని ప్రాణాలు క్షణంలో ఎగిరిపోయాయి.

పుల్లయ్య వెళ్ళేసరికి శోభ గదిలో పరుగులు పెడు తోంది. ఆ వ్యక్తి ఆమెను తరుముతున్నాడు.

పుల్లయ్య దృష్టి అంతా శోభమీదనే వుంది. ఈ మనిషి చేతిలో శోభ చనిపోతుందేమోనని అతడి భయం. అదే జరిగితే ఈ మనిషిని కూడా తనే హతమార్చి జనార్దనానికి ఇద్దర్నీ తనే హత మార్చానని అబద్ధం చెప్పాలి.

కానీ అలా జరిగితే తనకు తృప్తిగా ఉండదు. తన చేతుల్తో తను శోభను హత్యచేసి అప్పుడు జనార్దనం మెప్పుపొందాలి.

పుల్లయ్య గదిలో అడుగుపెట్టి ఆ వ్యక్తిని చటుక్కున పట్టుకుని లాగి దూరంగా తోసేశాడు.

అప్పుడు శోభ అతన్ని చూసింది. "పుల్లయ్యా—



రక్షించు....” అంటూ అతన్ని చేరింది. పుల్లయ్య ఆమె చేయి పట్టుకుని బయటకు లాగి-గది తలుపులు బయట గడియవేశాడు.

“సమయానికి వచ్చి రక్షించావు. నీ ఋణం ఎలా తీర్చుకుంటానో తెలియదు.”

“ఇందాకా నాలాంటివాణ్ని పెళ్ళిచేసుకోనన్నావ్— గుర్తుందా—”

శోభ సిగ్గుగా తలవంచుకుంది—“నీ మనసును గాయపర్చి వుంటే క్షమించు—”

“క్షమించకపోతే నిన్ను రక్షిస్తానా?” అన్నాడు పుల్లయ్య. ఇద్దరూ నెమ్మదిగా అడుగులు వేస్తున్నారు. పుల్లయ్య ఆమెను పక్కదారి పట్టిస్తున్నాడు.

“నామీద నీకింకా మోజుందా?” అంది శోభ.

“జాలిగా వుంది....” అన్నాడు పుల్లయ్య.

“ఎందుకు? అలా అనుకోవద్దు. అత్యాచారం ఆడదానికి అతి భయంకరమైనది. దాన్నుంచి నన్ను కాపాడిన

నీకు నా ప్రాణాలిచ్చినా తప్పుకాదు...."

"అయితే నీ ప్రాణాలు తీసుకుంటాను...." అన్నాడు పుల్లయ్య.

"తీసుకుంటే తీసుకో-ఇంటికి వెడితే మా నాన్న ఇంత కంటే నువ్వు చచ్చిపోయినా బాగుండేదని అంటాడు...." అంది శోభ.

"అయితే నీ ప్రాణాలు తీసుకుని నీ చావు కబురు మీ నాన్నకు అందజేస్తాను...." అని పుల్లయ్య చటుక్కున ఆమె గొంతు గట్టిగా పట్టుకున్నాడు.

శోభ ఇది ఊహించినట్లులేదు. ఆమె గిలగిల లాడింది. కానీ బలమైన పుల్లయ్య చేతుల్లో ఆమెకు చావు ఎంతోసేపు పట్టలేదు....

5

పుల్లయ్య చేతులు దులుపుకుని అక్కణ్నించి లేచాడు.

అతడికి చాలా ఉత్సాహంగా వుంది. అనుకున్న ప్రకారం ఆ యువతిని చంపేయగలిగాడు. జనార్దనం తన పని నింత త్వరగా సాధించి ఉండడు.

పుల్లయ్య నెమ్మదిగా కార్ల దగ్గరకు చేరుకున్నాడు. అప్పుడే అక్కడ ఒక ఆకారం చెట్టుచాటుకు పోయినట్లు పుల్లయ్య కనుమానం వచ్చింది. అది తన భ్రమ అవునో కాదో తెలుసుకోవడానికి—"ఎవరది" అని అరిచాడు.

"ఇంకా యెవరో అనుకున్నాను. నువ్వా పుల్లయ్యా!" అంటూ చెట్టుచాటునుంచి బయటకు వచ్చాడు జనార్దనం. పుల్లయ్య కంఠం అతనికి బాగా గుర్తే!

"జనార్దనం — నువ్విక్కడా?" అన్నాడు పుల్లయ్య ఆశ్చర్యంగా.

"అవును నాక్కావలసిన మనిషి ఇక్కడకు దగ్గర్లోనే

ఉన్న ఓ ఇంట్లో వున్నాడు. పని పూ_ర్తిచేసుకు వస్తున్నాను నీ పనేమయింది?" అన్నాడు జనార్దనం.

"నాపని పూ_ర్తయింది" అన్నాక పుల్లయ్యకు హఠాత్తుగా స్ఫురించింది, తన దృష్టి అంతా శోభమీద వుండడంవల్ల గమనించలేదు కానీ ఆమెను బలవంతం చేయబోయిన వ్య_క్తినే జనార్దనం చంపవలసివుంది. రూపం గుర్తుచేసు కుంటూంటే పుల్లయ్యకిప్పుడు స్పష్టంగా తెలుస్తోంది.

అప్పటికిద్దరూ ఎక్కువగా ఏమీ మాట్లాడుకోలేదు. ఇద్దరూ ఓ రెండ్రోజులు పోయేక పేపరు చదువుతూ తల పట్టుకున్నారు.

ఆ పేపర్లో వాళ్ళుచేసిన హత్యల వివరాలున్నాయి. మూడు హత్యలూ ఇంచుమించు ఒకే సమయంలో జరిగి నట్లు డాక్టర్ నిర్ణయించాడుట.

తమ సమస్య తీరలేదు. పందెం మళ్ళీ మొదటికే వచ్చింది.

"శోభను నేను ముందుగానే చంపవలసింది. వెయ్యి రూపాయలు పోయాయి...." అని బాధపడ్డాడు పుల్లయ్య.

"మనం సమవుజ్జీలం. ఆ సంగతి తెలుసుకోవాలనే దేవుడిలా చేశాడు" అన్నాడు జనార్దనం.

"అదేం కుదరదు. మనకు ఆ సినిమాహాలు అచ్చి రాలేదు. ఇంకో హాలుకి వెడదాం...." అన్నాడు పుల్లయ్య.

"ఎందుకొచ్చిన గొడవ! ఇలా డబ్బులేని బేరాలు మన కెందుకు? ఎప్పటికిలాగానే సమంగా పంచుకుందాం. నువ్వు హత్యలు చేయగలవనీ, నా హత్యలకింకొకళ్ళ పథకా లక్కర్లేదనీ తెలిసిపోయిందిగదా - ఇద్దరూ సమానమే!" అన్నాడు జనార్దనం.

పుల్లయ్య కది నచ్చినట్లైనట్లు లేదు. అతను జనార్ద

నంతో వాదిస్తూనే ఇంకో హాలువైపు దారితీస్తున్నాడు.

ఇద్దరూ ఓ హాలు చేరుకున్నారు. తమ వాదనలో ఓ రెండు ప్రాణాల ఉనికి సతమతమవుతున్నదని వారు గ్రహించినట్లులేదు. యమధర్మరాజు బంటుల్లా వాళ్ళు చాలా మామూలుగా ఈ విషయాన్ని చర్చించుకుంటున్నారు.

హాలువద్ద హౌస్‌ఫుల్ బోర్డు ఉంది. బ్లాకులో కూడా టిక్కెట్లు లేవు.

పుల్లయ్య బాల్కనీ గేట్‌కీపర్‌వద్దకు వెళ్ళి—"ఒక్కసారి లోపలకు వెళ్ళి వచ్చేస్తాం. మావాళ్ళిద్దరిందులో ఉండాలి...." అంటున్నాడు.

గేట్‌కీపర్‌కి రిస్కు తీసుకుని వీళ్ళను లోపలికి పంపడం ఇష్టంలేదు. అతను గొణుక్కుంటున్నాడు. నసుగుతున్నాడు. కానీ తన నిర్ణయంమీద రెండు ప్రాణుల ఉనికి ఆధారపడి ఉన్నదని అతనికీ తెలియదు. కానీ అతను ఆ ప్రాణుల్ని రక్షించాడు.

పుల్లయ్య, జనార్దనం అక్కణ్ణించి కదిలారు.

ప్రజలారా—జాగ్రత్త! వారు, వీరని కాకుండా మీలోనే యిద్దరికైనా మూడిపోవచ్చు....యమదూతలు వస్తున్నారు. ★

భయం?

భార్య:—ఈ కాలపు కుర్రాళ్ళు పెళ్ళంటే భయపడుతున్నారట. విన్నారా?

భర్త:—విన్నాను. మనకు పెళ్ళయ్యేవరకు అసలు భయమంటే ఏమిటో నాకు తెలియనే తెలియదు!!

—పి. లక్ష్మి, కొత్తూరు

పాఠకుల పరిశోధన పోటీ-78

(బహుమతి రు. 50/-లు నగదు)

ఫోన్ పొలికేక పెట్టింది.

ఇన్‌స్పెక్టర్ జితేంద్ర రిసీవరెత్తి "ఇన్‌స్పెక్టర్ స్పీకింగ్" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! నా భర్త నెవరో హత్యచేసేరు."

హృదయ విదారకమైన గొంతు వినిపించింది అవతలి వేపునుంచి.

అదిరిపడ్డాడు జితేంద్ర.

"మీ రెవరు? ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నారు" అంటూనే కానిస్టేబుల్‌కి జీప్ రెడీ చేయమని సైగజేసేడు.

"నా పేరు కామేశ్వరి. నా భర్త పేరు ఆనందరావ్. ఆయన్నెవరో హత్యచేసేరు. మీరు వెంటనే రావాలి" దుఃఖంలో ఆమె గొంతు బొంగురుపోయింది.

"అయిదు నిమిషాల్లో అక్కడుంటాను. మీ అడ్రసు చెప్పండి" అన్నాడు.

ఆమె అడ్రసు చెప్పింది. ఫోన్ డిస్కనెక్టు చేసేడు యిన్‌స్పెక్టర్ జితేంద్ర.

"ఎక్కడ్నుంచి ఫోన్?" యిన్‌స్పెక్టర్‌కి ఎదురుగా కూర్చున్న డిటెక్టివ్ రవీంద్ర అడిగేడు.

"శవం పిలుస్తోంది. వస్తావా?" నవ్వుతూ అన్నాడు జితేంద్ర.

డిటెక్టివ్ రవీంద్ర కూడా చిర్నవ్వు నవ్వి జితేంద్రతో బయల్దేరాడు.

*　　　*　　　*

నేలమీద వెల్లకిలా పడివుంది శవం. గుండె ప్రాంతంలో రక్తపు గాయం!

ఫోటోగ్రాఫర్ శవాన్ని వివిధ కోణాలనుంచి ఫోటోలు తీస్తున్నాడు. వేలిముద్రల నిపుణుడు వేలిముద్రలకోసం గాలిస్తున్నాడు.

గది నంతటినీ పరిశీలనగా చూసేడు డిటెక్టివ్ రవీంద్ర. ఇన్‌స్పెక్టర్ జితేంద్ర అతని ప్రక్కనే నిల్చుని అందర్నీ పురమాయిస్తున్నాడు.

గదిలో వస్తువులన్నీ చిందరవందర చేయబడివున్నాయి. పుస్తకాల 'రాక్' తిరగబడి పుస్తకాలన్నీ చెల్లా చెదురయ్యేయి. బల్లమీదుండాల్సిన ఫ్లవర్‌వేజ్ నేలమీద పడివుంది.

దీన్నిబట్టి చూస్తుంటే హతుడికి, హంతకుడికి మధ్య

పెద్ద పెనుగులాటే జరిగివుంటుందనిపించింది యిన్స్పెక్టర్ జితేంద్రకి.

హంతకుడు పొరపాటున వదిలేసిన 'క్లూస్' ఏవైనా దొరుకుతాయేమోనని గదంతా ఒకటికి నాలుగుసార్లు వెదికేడు. ఏ చిన్న 'క్లూ' దొరికినా నిర్లక్ష్యం చేయవద్దని జవాన్లను హెచ్చరించేడు.

శవం ముందు మోకాళ్ళమీద కూర్చుని పరీక్షగా చూసేడు రవీంద్ర. అప్రయత్నంగా రవీంద్ర దృష్టి మంచం క్రిందకు మళ్ళింది.

రివాల్వర్!

"ఉదయశంకర్! మంచం క్రిందపడివున్న పిస్తోలుమీద వేలిముద్రలు వున్నాయేమో ప్రయత్నించండి" ఆదేశించేడు రవీంద్ర.

రవీంద్రతో పాటుగా శవం ముందు నిలబడి పరీక్ష చేయసాగేడు. యిన్స్పెక్టర్ జితేంద్ర.

హతుడి మోచేతులమీద బలంగా రక్కిన గుర్తులున్నాయి. రక్తపు చారలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. హంతకుడితో పెనుగులాడ్డంవల్ల ఏర్పడిన రక్తపు చారలుగా గ్రహించేడు జితేంద్ర.

రవీంద్రకి హతుడి మొహంలో హంతకుడితో పెనుగులాటవల్ల కలిగిన అలసట కనిపించలేదు.

హతుడి కుడిచేయిమీద పడింది డిటెక్టివ్ రవీంద్ర దృష్టి.

తెల్లటిగ్లవుజ్!

హతుడి కుడిచేతికి గ్లవుజ్ ఎందుకుంది? గ్లవుజ్ వాడే అలవాటు బాగావుందా? కొంతమంది చేతులెప్పుడూ నీటుగా వుంచుకోవాలనే వుద్దేశంతో గ్లవుజు వాడుతుంటారు.

హతుడి చేతికున్న గ్లవుజును తొలగించి యిన్‌స్పెక్టర్ జితేంద్రకి అందించేడు.

హతుడి చేతి గోళ్ళమీద అక్కడక్కడ రక్తం అంటి వుంది. హతుని చేతిని తన చేతిలోనికి తీసుకుని చూసేడు. చేతిగోళ్లల్లో చర్మపు పోగులున్నాయి. ఇన్‌స్పెక్టర్ జితేంద్రను పిలిచి, ఆ చర్మపు పోగుల్ని పరీక్షకి ఇవ్వమన్నాడు.

హతుడ్ని హంతకుడు రక్కివుండడమే గాకుండా, హంతకుడ్ని హతుడు కూడా రక్కి వుంటాడని చర్మపు పోగులు చూసేక అనిపించింది జితేంద్రకి.

"రాత్రి పది, పదకొండు గంటలమధ్య మరణం సంభవించింది" అని చెప్పేడు డాక్టర్.

"పిస్తోలు మీద వేలిముద్రలు లేవు. తుడిచిన గుర్తులు కూడా లేవు. కాబట్టి హంతకుడు వేలిముద్రలు పడకుండా ముందు జాగ్రత్త పడివుంటాడు" అని చెప్పాడు వేలిముద్రల నిపుణుడు.

డిటెక్టివ్ రవీంద్ర తలపంకించి బయటికి నడిచేడు.

హతుడి భార్యను కలుసుకుని నాలుగైదు ప్రశ్నలు వేసేడు. సమాచారం దొరకలేదు.

ముందర హాల్లో నౌకర్లిద్దరు నిలబడివున్నారు. వారి ముందు ఆగేడు రవీంద్ర.

"రాత్రి పది-పదకొండు గంటలమధ్య మీ రెక్కడ వున్నారు" అడిగేడు యిద్దరినీ.

"బొట్ హౌస్‌లో...." అన్నారిద్దరూ ఒకేసారి.

"పెనుగులాట జరుగుతున్న శబ్దంగాని, పిస్తోలు పేలిన శబ్దంగాని వినిపించిందా?"

"పిస్తోలు శబ్దం వినిపించింది."

"శవాన్ని ముందుగా చూసిందెవరు?"



"నేను! నా వెనుక వీడు పరిగెత్తుకు వచ్చేడు. మంచం వాల్చుకుని పడుకోబోతుండగా మేడమీదనుండి 'ఢాం!' అన్న శబ్దం రెండుసార్లు వినిపించింది. ఇద్దరం మేడ మీదకు పరిగెత్తేం. వెళ్లేసరికి తలుపులు గట్టిగా బిగించి వున్నాయి. తలుపుల్ని బలంగా నెట్టుకుని లోపలకు వెళ్లేం. అయ్యగారి గుండెమీద రక్తం చిమ్ముతోంది. దాన్నిబట్టి అయ్యగార్నెవరో పిస్తోలుతో కాల్చేరని అర్థమైంది. నేను గదిలో వెదికేను. మా కెవరూ ఎదురుపడలేదు కాబట్టి, గదిలోనే వుండాలి. లేకపోతే మేడమీదనుంచి సిమెంట్ పైప్ ద్వారా దిగివెళ్లాలి. బాల్కనీలోనికి వెళ్లేడు వీడు" అంటూ రెండోవాడ్ని చూసేడు మొదటి నౌకరు.

"బాల్కనీలోనికి వెళ్లేక ఎవరేనా దిగివెళ్ళడం కనిపించిందా?" అనడిగేడు.

"లేదు. ఎవరూ కనిపించలేదు."

"పిస్తోలు పేలిన ఎన్ని నిమిషాలకు మీరు మేడమీదకు వెళ్ళేరు?"

"వెంటనే. ఒకనిమిషం కూడా అవదు."

ఆ యిద్దర్నీ వుండమని చెప్పి, బాల్కనీ దిగువకి వెళ్ళేడు రవీంద్ర. సాయంత్రం ఆరు గంటలకు వర్షం పడడంవలన తోట అంతా బురదగా వుంది. పేంట్ ఎత్తి పట్టుకుని నడుచుకుంటూ వెళ్లేడు. అయిదు నిమిషాలు పరీక్షగా చూసేడు. నేలమీదగాని, సిమెంట్ పైపు మీదగాని యెవరి అడుగు జాడలూ లేవు.

తిరిగి హత్యా ప్రదేశానికి వచ్చేడు. అప్పటికి యిన్స్పెక్టర్ జితేంద్ర తన కార్యక్రమాన్ని పూర్తిచేసేడు. శవాన్ని అంబులెన్స్లోనికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నాడు.

"వాట్ రవీంద్రా! హంతకుడ్ని పట్టిచ్చే క్లూస్ ఏమైనా దొరికేయా?" అనడిగేడు రవీంద్రను చూస్తూనే.

డిటెక్టివ్ రవీంద్ర అందర్నీ ఒకసారి నిశితంగా చూసి చెప్పసాగాడు.

* * *

[ఇదీ కథ. యివ్వబడ్డ ఆధారాలతో ఈ కథలో దోషులెవరో పరిశోధించి వ్రాయండి. మీ జవాబును ఒక పోస్టు కార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, 25-10-78 తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. హోం.డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 0-50 పైసలు స్టాంపులు జతపరచాలి.

మాకు వచ్చిన సమాధానాలలో అత్యుత్తమంగా పరిశోధించిన ఇద్దరు పాఠకులకు చెరొక రు. 25/- లు బహుమతిగా పంపుతాము. ఫలితాలు జనవరి '79 నెల సంచికలో చూడండి. —ఎడిటర్.

'త్రిబులెన్స్'

(పోటీ కథ నెం-76 ఫలితాలు)

హంతకుడు: శాంత భర్త-శ్రీరంగం శివశ్రీనివాస్.

గోపీకి దొరికిన పెన్నుపైన 'త్రిబులెస్'. వుంది. శాంత ఇచ్చిన క్లూ కూడా 'త్రిబులెస్' ఆ త్రిబులెస్ శాంత భర్తకు వర్తిస్తుంది. ప్రసాద్‌కు వర్తించదు.

ప్రసాద్ చంపితే శాంత ముఖంలో ఆశ్చర్యం కనిపించదు.

శాంతపై అనుమానం ఒకటి, రెండవది ఆస్థికోసం శాంతను శ్రీనివాస్ చంపడానికి గల కారణాలు.

—ఈ కేసులో చక్కని పరిశోధనచేసిన ఈ క్రింది పాఠకులకు ఇద్దరికి చెరొక రు. 25/- లు బహుమతి పంపుతున్నాము.

(1) శ్రీ జి. బాలనర్సింహ్మారావు, బి.ఏ., నోముల, వయా-మూసీ ప్రాజెక్టు, నల్లగొండజిల్లా.

(2) శ్రీ ఈదర వెంకటప్రసాద్, ఎమ్.ఎస్.సి., ది వైశ్యా బ్యాంకు లిమిటెడ్, విల్లివాక్కం బ్రాంచ్, మద్రాసు-49.

సరియైన సమాధానాలు వ్రాసిన ఇతర పాఠకులు:

1. పి. వాణి రామచంద్ర, గుంటూరు. 2. కె. వి. ప్రసన్నం, సునాబేడ. 3. యన్. సత్యానంద్, హైద్రాబాదు. 4. కె. జె. యన్. డి. సీతారామయ్య. 5. కిన్నెర, మల్కాజిగిరి. 6. టి. యస్. యన్ మూర్తి, కరీంనగర్. 7. సి. హెచ్. వీరబ్రహ్మం. 8. వి. కుమార్‌బాబు, రాజమండ్రి. 9. సత్తిరాజు సుబ్బారాయుడు, మలక్‌పేట. 10. ఆర్. వి. ప్రభాకరరావు, నోముల.

11. యర్రంశెట్టి రాధాకృష్ణ, ఏలూరు. 15. యస్. క్రిష్ణవేణి, మద్రాసు. 13. యమ్. డి. మూర్తి, విశాఖపట్టణం. 14. యం. శంకరరెడ్డి, బెల్లంపల్లి. 15. వరదా కామేశ్వరరావు, అమలాపురం. 16. యస్. శ్రీరాములు,

హైద్రాబాదు. 17. అందవిల్లి కొండలరావు, శ్రీకాకుళం. 18. డి. అనూరాధ, బొంబాయి. 19. కొల్లా అరుణ, విశాఖ. 20. యల్. సత్యం, కొత్తూరు.

21. విశాలి, మద్రాసు. 22. నీలకంటి రామకృష్ణ, యెల్లారెడ్డి. 23. జి. యన్. శ్రీనివాసరావు, చేటపర్రు. 24. యస్. రాజగోపాల్, హైద్రాబాదు. 25. సి. హెచ్. సాయి బాబ, సిమెంటునగరు. 26. పి. ప్రభాకరరావు, రామాజి పల్లి. 27. బి. లక్ష్మీజయప్రద, మట్లూరు. 28. యం. ఏ. సలీమక్తర్, మంచిర్యాల. 29. టి. లక్ష్మణ, మద్రాసు. 30. ఏ. శ్రీనివాసరావు, చిక్కడపల్లి.

31. కె. చందర్‌రావు, ఖోలక్‌పూర్. 32. పి. భాస్కర నారాయణ, గాంధీనగర్. 33. యం. లలిత, రాజమండ్రి. 34. బి. యోగిరామ్‌సింగ్, దొనకొండ. 35. యల్. రామ గోపాల్, వెంకటగిరి. 36. కె. యస్. నాయుడు, వేపాడ. 37. యన్. హనుమంతరావు, మిర్యాలగూడ. 38. కె. రాములు, ధర్‌పల్లి. 39. యం. సత్యనారాయణ, విజయ వాడ. 40. రాణిచంద్ర, వినుకొండ.

41. కె. ప్రసన్న, బొంబాయి. 42. మాధురిసీత, రాజ మండ్రి. 43. యస్. ఆర్. సత్యారావు, ఆద్రా. 44. యస్. యన్. రావు, వెల్దిపాడు. 45. కె. రామారావు, రాజ మండ్రి. 46. సి. యువరాజ్‌సింగ్, కర్నూలు. 47. బి. చినకోటయ్య, టంగుటూరు. 48. యమ్. కృష్ణకుమార్, సికింద్రాబాదు. 49. జి. కృష్ణారావు, అశ్వారావుపేట. 50. ఇ. టి. రామారావు, శ్రీహరికోట.

51. ఏ. రవీంద్రబాబు, పాల్వంచ. 52. డి. శ్యామలా దేవి, విశాఖపట్టణం. 53. జి. విజయలక్ష్మీరెడ్డి, వల్లాల.

54. సి. యస్. ఆర్. మూర్తి, కాకినాడ. 55. ఏ. వి. సుబ్బలక్ష్మి, నల్లకుంట. 56. కూచిపూడి కోటేశ్వరరావు, ఓలేటివారిపాలెం. 57. జి. రాజారెడ్డి, దేవలంపేట. 58. జి. సత్యశేఖర్, తాడేపల్లిగూడెం. 59. కె. నాగభూషణం, దేవనహళ్ళి. 60. జి. ఉమ, బాలానగర్.

61. కె. సరోజిని, నెల్లూరు. 62. దామెర్ల కృష్ణ మూర్తి, నెల్లూరు. 63. రుషికేష్ పట్నాయక్, ఛత్రపూర్.

★

"శ్రీశ్రీశ్రీ"

ఒక ఇంటర్వ్యూలో—

అధికారి :

నీ పేరేమిటి?

అభ్యర్థి :

శ్రీ....శ్రీ....శ్రీ....శ్రీ....శ్రీరాములండీ.

అధికారి :

అబ్బా. ఉత్త శ్రీరాములు అనిపెట్టక అన్ని శ్రీలు పెట్టారేమోయ్ మీవాళ్ళు?

అభ్యర్థి :

తె....తె....తె....తెలియదండీ!!

సి. —హెచ్. రమేష్, హైద్రాబాదు



న్యాయాన్ని గెలవలేవు

పి.వి. సుధాకరరావు

"హోహాల్డాన్!"

జోరుగా అరవై కిలోమీటర్ల వేగంతో ఆఘమేఘాల మీద పరుగులెడుతున్న అనంతపురం టు నెల్లూర్ సూపర్ డీలక్స్ బస్సు కీచుమని శబ్దంచేస్తూ ఆగింది.

"వ్వాట్ హేపెండ్" కండక్టర్ సీటులోంచి లేచి, నాలుగవ వరసలోని డబుల్ సీటువైపు కదిలాడు.

ఆ సీటులో కుడివైపు కూర్చున్న ఇరవయ్యేళ్ళ విద్యార్థి తక్కునలేచి నిలబడ్డాడు. అందరూ తమదృష్టిని ఆ వ్యక్తిపై కేంద్రీకరించారు.

మౌనంగా ముందుకు నడిచాడు ఆ విద్యార్థి.

"వ్వాట్ డూ యూ వాంట్?" రెట్టించి అడిగాడు కండక్టర్.

"హీ వాంట్స్ నథింగ్" అదేసీటులో కూర్చున్న రెండవ విద్యార్థి తాపీగా అన్నాడు.

"దెన్?" అతనివైపు ఉరిమి చూశాడు కండక్టర్.

ఇంతలో బస్‌డోర్‌ని పెద్దగా శబ్దంచేస్తూ దిగాడు ఆ విద్యార్థి.

వళ్ళు మండిపోయింది కండక్టరుకు.

"రైట్-రైట్" అని కేకేశాడు.

"హోల్డాన్" రెండవవిద్యార్థి కంఠం ఖంగుమంది.

బస్సు నెమ్మదిగా కదలబోయినదల్లా ఆగింది. ప్రశ్నార్థకంగా అతనివైపు చూశాడు డ్రైవర్.

"ఏంటయ్యా? ఇదేం గవర్నమెంటు బస్సనుకున్నావా నీ బాబుగాడి సొత్తనుకున్నావా?" వెనుకనుండీ అరిచారెవరో.

అదేం పట్టించుకోకుండా "ఐసే హోల్డాన్" ఆవేశంగా అరిచాడా విద్యార్థి.

"ఏవిటయ్యా, నౌకర్లని దబాయించినట్లు దబాయిస్తున్నావ్! బస్సు ఆగదు. కావాల్సింటే నీవూ దిగు" దబాయింపు ధోరణిలో అన్నాడు కండక్టర్.

అంతలో ముందుసీట్లోంచీ ఓ పెద్దమనిషి లేచి నిలబడ్డాడు. "కండక్టర్ బస్సు ఓ నిమిషం ఆపండి."

అందరూ వింతగా ఆయనవైపు చూడసాగేరు.

"వై సార్?"

"నథింగ్. వాళ్ళు స్టూడెంట్స్. ఐ మీన్ ఈ కాలం కుర్రాళ్లు-మనమన్నా సర్దుకోకుంటే ఎలా? మరేంలేదు— అతని మిత్రుడు స్కూల్స్‌కోసం దిగాడు. ఆ విషయం ఇంత మందిలో చెప్పలేక కాస్త తటపటాయించాడు. అంతే లెట్ అజ్ వెయిట్ ఫార్ హిమ్."

విసుగ్గా తల విదిలించి తన సీట్లోకి వెళ్ళి కూచున్నాడు కండక్టర్.

ఆ పెద్దమనిషి తన సీట్లో ఆశీనుడై వెనుకవైపుకి చూశాడు. కృతజ్ఞతగా ఆయనవైపు చూస్తూండిపోయాడు విద్యార్థి.

ఆ తరువాత మరో ఐదునిముషాలకి బస్సులోకొచ్చాడు మొదటి విద్యార్థి.

"రైట్-రైట్" కండక్టర్ గొంతు ఖంగుమంది.

2

బస్సు బద్వేల్‌లో ఆగగానే బస్సు దిగుతూ "భోజనాలు చేసేవారు చెయ్యండి సార్! నెక్ట్స్ స్టాపింగ్ నెల్లూరులోనే" అంటూ దిగిపోయాడు కండక్టర్.

ఇద్దరు విద్యార్థులు కూడా లేచారు, తమ సీటులోంచీ.

ముందు సీటులోని పెద్దమనిషి కూడా దిగాడు.

"భోంచేద్దాం రండి సార్!"

"నో—నేను భోంచెయ్యను. టిఫిన్ తీసుకుంటాను."

"అలాగే రండిసార్!"

ముగ్గురూ కలిసి హోటల్లోకి వచ్చారు. టిఫిన్‌కి ఆర్డరిచ్చిన తరువాత అడిగాడు పెద్దమనిషి వాళ్ళని—

"ఎక్కణ్ణుంచి వస్తున్నారు బాబూ మీరు?"

"ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ వ్రాశాము సార్



యీ మధ్యనే- మెరిట్ లిస్టులో ఇద్దరం పాసయ్యాం. తమాషేంటంటే ఇప్పుడు ఇద్దరం వెయిటింగ్ లిస్టులో వున్నాం. రెండో నంబరు నేను. మూడోనెంబరు వాడు. అనంతపురంకి ఇంటర్వ్యూకి వెళ్ళి వస్తున్నాం."

"ఐసీ. బెస్టాఫ్ యువర్ లక్."

"థేంక్యూ సర్! మీరెక్కడ నుండి వస్తున్నారు?"

"ఐ యామ్ నెల్లూర్ టూ టౌన్ ఎస్.ఐ. శివసుందరం"

"వెరీ గ్లాడ్ టూ మీట్ యూ సార్?" అన్నారు ఇద్దరూ ఏక కంఠంతో.

"వాట్ ఈజ్ యువర్ నేమ్ మిస్టర్ స్టూల్స్" టిఫిన్ చేస్తూనే నవ్వుతూ అడిగారాయన.

"రాజశేఖర్ సార్!"

"ఫైన్. మరి నీ పేరు?"

"శివకుమార్ సార్!"

"వెరీగుడ్-ఇద్దరూ ప్రాణస్నేహితులన్నమాట?"

"అలా ఎందుకడుగుతున్నార్సార్?"

"ఇందాకటి మీ కధ చూశాక అలా అర్థం చేసుకున్నాను."

"థాంక్స్ సార్!"

"వెల్-బస్సుహారన్ మ్రోగుతున్నది-పదండి వెళదాం" అంటూ లేచారాయన.

బస్సు నెల్లూరులో ఆగింది.

"ఇంతకీ మీరుండేదెక్కడ్సార్?" అని అడిగారు విడిపోతూ ఆ స్నేహితులు ఆయన్ని.

"అడ్రస్ వద్దు. తెలుసుకోవడం కష్టం. అవసరమైతే స్టేషనే వుందిగా-మరి మీ అడ్రస్? —" అన్నాడు ఎస్. ఐ. శివసుందరం.

"యానాది పాలెం."

ఠక్కున తలెత్తి ఆ ఇద్దరి వంక ఆశ్చర్యంగా చూశాడాయన.

"యానాది పాలెంలోనా? అక్కడ అంతా పూరికొంపలు తప్ప, సుమారైన ఇల్లన్నా లేదే? అక్కడ ఎక్కడుంటున్నారు మీరు?"

"సారీ సర్! మీరు మమ్మల్ని ఏ విధంగా అంచనా వేస్తున్నారో అర్థంకాలేదు. మీరనే ఆ గుడిసెల్లో మావీ ఓ రెండు గుడిసెలు"—

"అబ్బే, నా ఉద్దేశ్యం అదిగాదు. మిమ్మల్ని అప్పుడే ఇంజనీర్లుగా ఊహించానంతే-ఓ. కే" అంటూ విడిపోయారాయన.

3

"రాజా-రాజా."

గుడిసె బయటే నిల్చుని కేకేశాడు శివకుమార్.

"ఆఁ" అంటూ బయటికొచ్చాడు రాజశేఖరం.

"ఇన్నాళ్ళకి నా కలలు ఫలించాయి-నేను అనుకున్నది సాధించగలిగానురా. నేనిప్పటిదాకా కష్టపడినందుకు ఫలితం దక్కింది."

"ఊర్కే సినీడైలాగులు కొట్టి నా తల పగులగొట్టక విషయం ఏడూ" అరిచాడు రాజశేఖర్.

"ఇంజనీరింగ్‌లో సీటువస్తే చాలు ఇంజనీరంటారు-డాక్టరేట్‌కి సీటొస్తే చాలు డాక్టరంటారు."

"ఇంతకీ ఏమంటావ్?" అనుమానంగా అడిగాడు రాజశేఖర్.

"ఇంకా అర్థంకాలేదూ? ఇంజనీరింగ్‌లో ఆఖరిసీటు నాకొచ్చినట్టు ఇప్పుడే మెసేజ్ అందింది. రేపుసాయంత్రం లోపల వెళ్ళకుంటే నా తరువాతి వాడికి పోతుందట అది."

అవాక్కయ్యాడు రాజశేఖర్. అతని గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలయినట్లయింది. ఎక్కడలేని అసూయ శరీరమంతా లావాలా ప్రవహించినట్లయింది.

"రేపు సాయంత్రంలోపల వెళ్ళకపోతే ఆ సీటు వేరే వాడికి పోతుందట—" పదేపదే మారుమ్రోగాయతని తలలో ఈ మాటలు.

శివకుమార్ వెయిటింగ్ నెంబర్ టూ. తనది త్రీ.

"రేపు వెళ్ళడానికి డబ్బుందా శివా?" ఏదో ఆలోచిస్తూ అడిగాడు రాజశేఖర్.

"అమ్మ ఈ గాజులమ్మి డబ్బు తెమ్మంది. నిన్నూ పిల్చుకుపొమ్మంది."

"అలాగే-పద," సాలోచనగా ఆలోచిస్తూ అతనివెనుక నడిచాడు రాజశేఖర్.

4

"బస్టాండ్‌కి అటుకన్నా ఇటునుంచి దగ్గర. ఇటుపద,"

రిక్షావాడు వేరే త్రోవన పోవడం చూసి, అన్నాడు శివ కుమార్.

"ఇటు దగ్గరి త్రోవుందిలే బాబూ," అన్నాడు వాడు.

వాడితో వాదించే ఓపికలేక తన భవిష్యత్తు గురించి బంగారు కలలు కంటూ, వెనక్కి వాలి కూర్చున్నాడు శివ కుమార్.

సమయం వేకువజాము నాలుగు గంటలు.

ఐదున్నరకి వుంది బస్సు.

ఆలోచిస్తూ కూర్చుని ఉన్న శివకుమార్ రిక్షా తక్కున ఆగడంతో ఉలిక్కిపడి చీకట్లోకి చూశాడు.

అతని గుండె ఆగినంత పనయ్యింది. ఎదురుగా నలుగురు ఆగంతకులు!

రిక్షావాడు వణుకుతూ నిలబడ్డాడు.

"ఏం కావాలి మీకు?" గుండె చిక్కబట్టుకుంటూ అడిగాడు శివకుమార్.

"నువ్వు!" అందులో ఒకడి కంఠం కర్కశంగా వినిపించింది.

"నేనా! దేనికి?"

"ముందు రిక్షా దిగు, చెప్తాం?" అన్నాడు మరొకడు.

భయం భయంగా రిక్షా దిగాడు శివకుమార్.

అంతే! ఒకడి చేతిలోని గొలుసు గాలిలోకి లేచింది.

"అమ్మా!" అంటూ అతని గొంతు చీకటిలో మారుమ్రోగింది.

ఇంకొకడి చేతిలోని కర్ర అతని వీపుని ముద్దెట్టుకుంది.

"అనవసరంగా అతన్ని చంపడమెందుకు? మనక్కావల్సింది—రెండ్రోజులు అతను బయటకి రాకుండా ఉండడం. లాక్కురండి—" అన్నాడు మరొకతను.



కళ్లు బరువుగా మూతలు పడుతుంటే, వాళ్ళ చేతుల్లో ఒరుగుతున్న శివకుమార్ చెవులకి రిక్షావాడి ఆక్రందన లీలగా విన్పించింది.

5

"నే ననుకున్నది సాధించాను. అంతా సవ్యంగా జరిగి పోయింది," చేతిలోని వుత్తరం మరోసారి చదువుకుని నవ్వుకున్నాడు రాజశేఖర్.

రేపు సాయంత్రంలోపల అతను వచ్చి జాయిన్‌కాక పోతే, ఆ తరువాతివాడికి ఆ సీటు ఇవ్వబడుతుందని ఆ వుత్తరంయొక్క సారాంశం.

మళ్ళీ నవ్వుకున్నాడు రాజశేఖర్.

శివకుమార్‌ని తలుచుకుంటే జాలేసింది. అతన్ని అలా నిర్బంధించాల్సొచ్చినందుకు బాధ వేసినా, తన సుఖం ముందు అదేం పెద్ద తప్పుగా కనిపించలేదతనికి.

సంతోషంగా వేకువజామునే నాలుగ్గంటలకి రిక్షాలో బయ ల్దేరాడు రాజశేఖర్.

రిక్షా జోరుగా పోతోంది.

అతని మనసునిండా భవిష్యత్తుయొక్క గాలిమేడలే. తనో ఇంజనీరయినట్లు, మేడ కట్టినట్లు, భార్యా. పిల్లలూ, ఆఫీసు, నౌకర్లూ, హోదా—అబ్బో!

అంతలోనే రిక్షా ఠక్కున ఆగింది.

ఉలిక్కిపడి ఎదురుగా చూశాడు రాజశేఖర్.

"ముసుగు మనిషి."

ఒక్కక్షణం గుండె ఆగినట్లయింది. అంతలోనే యేదో గుర్తొచ్చింది—

"రంగా! నన్నెందుకు ఆపావ్?" అన్నాడు ధైర్యంగా.

"డబ్బు!" కీచుమంది ముసుగు.

"ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యి రాగానే ఇస్తానన్నాగా!"

"మరలా వస్తావనేంటి నమ్మకం? యిస్తేగానీ వదలను."

చీకట్లో అతని చేతిలోని రివాల్వర్ నల్లగా భయంకరంగా మెరుస్తున్నది.

"ఎంత కావాలి?"

"రెండువేలు."

"రెండువేలా? ఒక మనిషిని ఊరికే నాలుగురోజులు బంధించి ఉంచడానికి రెండువేలా—? ముందు అయిదొందలే కదా మనం మాట్లాడుకొంది."

"అతను మాకు లొంగడానికి చాలా కష్టపడాల్సొచ్చింది—"

స్పష్టంగా రావడంలేదు ముసుగునుండి మాటలు.

"శివకుమార్ అంత బలమైనవాడు కాదే?"

"అనవసరం. డబ్బిస్తావా, లేదా?"

"ప్రస్తుతం నా దగ్గరంత లేదు. అవసరమైతే అతన్ని చంపేసెయ్యండి—అంత డబ్బివ్వడం నా వల్లగాదు!"

అంతే!

మరునిమిషం ఆ చుట్టుపక్కల ఏదో వింత శబ్దమైంది. వెనువెంటనే ఐదారు టార్చిలైట్స్ అతనివైపు వెలిగాయి.

చుట్టుపక్కలనుండి పోలీసులు చుట్టుముట్టారతన్ని.

అవాక్కై చూస్తూండిపోయాడు శేఖర్.

ముసుగు తీసేసి తన అసలు రూపంతో నిలబడి, అతన్ని అరెస్ట్ చేయమని ఆజ్ఞాపించాడు టూ టౌన్ ఎస్.ఐ. శివ సుందరం.

ఆశ్చర్యంగా చూశాడు రాజశేఖర్ ఆయన్ని.

"చూడు, శేఖర్! దేన్నయినా గెలవచ్చుగానీ, న్యాయాన్ని గెలవడం సాధ్యమయ్యేదిగాదు—పద!"

"సార్! మీరూ.... మీరు.... నన్ను.... యెలా....?"

సగంలో ఆపిన రాజశేఖర్‌ను సీరియస్‌గా చూసి అన్నాడు శివసుందరం.

"నిన్న బస్‌స్టాండులో చూశాను నిన్ను. మఫ్టీలో ఉన్న నన్ను గుర్తుపట్టలేదు నీవు. ఈరోజు ఉదయం బస్సుకు టికెట్ రిజర్వ్‌చేస్తూ కనిపించావు. సీటు వచ్చింది శివ కుమార్‌కైతే, నీ వెందుకు టికెట్ బుక్‌చేసుకుంటున్నావో అర్థంకాలేదు!

మీ మిత్రుడికోసం అనుకుందామంటే, నీకు తెలీదేమో అతనికి టికెట్ రిజర్వు చేయించింది నేనే! ఆ రోజే నా దగ్గరికి వచ్చాడు శివకుమార్. అప్పుడే కంగ్రాట్స్ చెప్పడం ఫోన్‌లో సీటు టికెట్ నా తరఫున రిజర్వ్ చేయించడం జరిగిపోయింది.

నీ దురదృష్టం! మీ వీధి రౌడీ రంగన్నతో నీవు బస్టాండులో ఒక మూల గుసగుసలాడ్డం నా కంటబడింది. అంతే! నీ వెళ్ళిన మరుక్షణమే అతను నా చేతిలో గిల గిల్లాడాడు—ఆరోజే నీ మిత్రుని విడుదల చేయించాను. ఇక నిన్ను రెడ్‌హాండెడ్‌గా పట్టుకోడం అంత కష్టం కాలేదు.

నీ జలసీ, నీ మిత్రుని ఈవేళ ప్రాణాపాయంలో పడేసింది. ఇలాంటి చీడపురుగులు ఇంజనీరింగ్‌కి తగరు. ఇక స్టేషన్‌కు పద!" గంభీరంగా అన్నాడు ఎస్. ఐ. శివసుందరం. ★

మ హి మ ?

"నాయనా ! మీ యింటిలో దొంగతనం జరిగిందా !"

"ఔను స్వామీ ! మీ మహిమ తెలుసుకొని మీ దగ్గరకు వచ్చాను."

"ఫరవాలేదు నాయనా. ఈ విబూది ఇస్తాను. ఆ దొంగ ఎక్కడున్నాడో తెలుసుకొని వానిపై చల్లు. నీవు పోగొట్టుకున్న ధనం వాడు తప్పక ఇస్తాడు !!"

—కె. నాగభూషణం, దేవనహళ్లి.

'కోరమండల్ ఎక్స్‌ప్రెస్' భువనేశ్వర్ స్టేషన్‌లో ఆగింది.

జనాన్ని తప్పించుకుంటూ శైలజ త్రీటైర్ కంపార్ట్‌మెంట్‌లోకి యెక్కి, తన నెంబరుగల సీటు చూసుకొని కూర్చుంది.

ఆమెతోపాటుగా వచ్చిన ఆమె తండ్రి బెడ్డింగును, చిన్న సూటుకేసును పట్టుకువచ్చి సీటుక్రింద వుంచేడు.

శైలజ తన చేతిలోని ప్లాస్టిక్ బాస్కెట్‌ను బెడ్డింగ్ ప్రక్కన వుంచింది.

"జాగ్రత్త శైలూ! వెళ్ళగానే క్షేమంగా చేరినట్టు

వుత్తరంముక్క వ్రాయి." అంటూ ప్రయాణంలో తీసుకో వల్సిన జాగ్రత్తల్ని గురించి తనకు తెలిసినవి చెప్పేడు తండ్రి.

శైలజ తండ్రి మాటలకు మౌనంగా తలాడించసాగింది.

ఆమెకు రైలుప్రయాణం కొత్తకాదు.

ఇదివరకు చాలాసార్లు ఒంటరిగానే ప్రయాణాలు సాగించింది.

అయితే, తండ్రి చాదస్తంకొద్దీ, అభిమానంకొద్దీ జాగ్రత్తలు చెబుతున్నాడు. శైలజ గౌరంకొద్దీ వూఁ కొడుతుంది.

నిమిషాలు చకచకా దొర్లిపోతున్నాయి.

గార్డు ఈల వేశాడు.

తండ్రి కంపార్టుమెంటులో నుండి గబగబ క్రిందకు దిగిపోయి, కిటికీ దగ్గరకు వచ్చేడు.

రైలుబండి పెద్దగా కూతకూస్తూ ముందుకు కదిలింది.

శైలజ చేతిని బైటకు చాచి గాలిలో వూపుతూ 'టాటా' చెప్పింది-తండ్రికి.

రైలు ప్లాట్‌ఫారం దాటినతరువాత శైలజ సర్దుకుని కూర్చుంటూ, తన యెదురుగావున్న ప్రయాణికుడ్ని చూసింది.

అతడికి ముప్ఫయి సంవత్సరాలుంటాయి.

పొడుగ్గా, ఆకర్షణీయంగా వున్నాడు.

అతడిదృష్టి శైలజమీదనే కేంద్రీకరించబడివుంది. శైలజ చూడగానే దృష్టిని మరల్చుకొన్నాడు—సభ్యత కోసం.

శైలజ చిన్నగా నవ్వుకుని, ప్రక్కకు తొలగిన పైటను సరిచేసుకుంది.

బాస్కెట్‌లో నుండి వో తెలుగునవల తీసి చదవటం మొదలుపెట్టింది.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి వోరకంట శైలజను గమనించాడు.

శైలజ పుస్తకపఠనంలో నిమగ్నురాలైపోవడంతో, ఆ వ్యక్తిదృష్టి పూర్తిగా ఆమెమీద కేంద్రీకరించబడివుంది.

శైలజకు యిరవై నాలుగు సంవత్సరాలు.

గతపేడాదే వివాహం జరిగింది.

భర్త స్టేట్స్‌కి ట్రయినింగ్‌కు వెళ్లాడు. రెండునెలల్లో తిరిగి స్వదేశానికి వచ్చేస్తాడు.

అంతవరకూ, ఎలాగ గడపడమా అని ఆలోచిస్తుంటే చిన్ననాటి స్నేహితురాలు తన పెళ్ళికి రమ్మంటూ వుత్తరం వ్రాసింది.

"హమ్మయ్య! దీని పెళ్ళికి వెళ్తే కొద్దిరోజులపాటు కాలక్షేపం అవుతుంది" అనుకొని వెంటనే బయల్దేరింది విశాఖపట్నంకు.

శైలజకు యెదురుగా కూర్చున్నవ్యక్తి కొన్ని నిముషాల పాటూ ఆమెను తదేకంగా చూసి, సిగరెట్‌ప్యాకెట్టును తీసి సిగరెట్‌ను వెలిగించాడు.

శైలజ ఏకదీక్షతో నవలను చదువుకోసాగింది. తన ఎదురుగా కూర్చున్న వ్యక్తి చూపులతోనే తనను తినేస్తున్నాడన్న సంగతి ఆమెకు తెలియడంలేదు.

కిటికీలోనుండి వీస్తున్న గాలికి ముంగురులు శైలజ నుదుటిమీద నాట్యం చేస్తున్నాయి.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి శైలజ చదువుతున్న పుస్తకంను పరీక్షగా చూశాడు.

ప్రసన్నరాణి వ్రాసిన 'ప్రేమబంధం' నవల అది.

ప్రసన్నరాణి తెలుగులో ప్రముఖ రచయిత్రి.

ఆమెకు వేలాదిమంది అభిమాన పాఠకులు వున్నారు.

ప్రముఖ వార, మాసపత్రికలలో ఆమె నవలలు ధారా వాహికంగా ప్రచురింపబడుతుంటాయి.

ప్రసన్నరాణి పేరుతెలియని పాఠకులు తెలుగుదేశంలో ఉండరనడంలో అతిశయోక్తిలేదు.

"ఈవిడెవరోగాని, నవలల పిచ్చి బాగా వున్నట్లుంది" అనుకొన్నాడా వ్యక్తి శైలజగురించి.

నుదుటిమీద నృత్యం చేస్తున్న ముంగురుల్ని-తడిదేరిన లేత గులాబీ రేకులవంటి పెదవుల్ని, సంపెంగ మొగ్గవంటి చిరుగెడ్డాన్ని, శంఖంలాంటి కంఠాన్ని, పయ్యెద చాటున దాగిన పరువాల్ని-చూస్తూ చాలాసేపు గడిపాడు ఆ వ్యక్తి.

సిగరెట్ పెట్టె ఖాళీ అయిపోయింది.

పుస్తక పఠనంలో సర్వం మరచి నిమగ్నపోయిన శైలజ అందాన్ని చూసిచూసి—చివరకు విసుగనిపించిందా వ్యక్తికి.

రైలు బరంపురం స్టేషన్ను సమీపిస్తున్న సమయానికి శైలజ పుస్తకం చదవడం ముగించింది.

బద్ధకంగా వొళ్ళు విరుచుకొని, చేతిలోని నవలను పక్కన వుంచింది.

ఒక మంచి నవలను చదివానన్న తృప్తి — ఆమె ముఖంలో తొణికిసలాడుతూ వుంది.

"మేడమ్! ఆ నవల అంత యింట్రస్టుగా వుందా?" శైలజతో ఎలాగైనా మాటలు కలపాలన్న వుద్దేశ్యంతోఅడిగాడు ఆ వ్యక్తి.

శైలజ తలెత్తి ఆ అపరిచిత వ్యక్తివైపు చూసి, ఔనన్నట్లుగా తలాడించింది.



"నా పేరు రామారావ్" చెప్పాడు వ్యక్తి.

"మీరు ఎంతవరకూ వెళ్తున్నారు?" ప్రశ్నించాడు.

"వాల్తేరు" జవాబు చెప్పింది శైలజ.

"నేనూ వాల్తేరే వెళ్తున్నాను. అన్నట్టు, మీ పేరు ఏమిటో చెప్పారుకాదు?" అడిగాడు.

రామారావు ధోరణి శైలజకు నచ్చలేదు. అపరిచిత వ్యక్తులతో మాటలాడడమంటే ఆమెకు చిరాకు. అయినా, సభ్యతకోసమని—

"శైలజ" అని చెప్పింది ముక్తసరిగా.

"స్వీట్ నేమ్. ప్రసన్నరాణిగారి నవలలంటే మీకు చాలా యిష్టంలాగ వుంది" అడిగాడు.

"అవును. ఆమె నా అభిమాన రచయిత్రి."

"వెరీగుడ్. ఇంతకీ, మీరెప్పుడైనా ఆమెను చూశారా?"

రామారావు ప్రశ్నకు నొసలు చిట్లిస్తూ చూసింది.

"ఊహూఁ. యెందుకు అలాగ అడుగుతున్నారు?" అంది.

"అబ్బే. మీ అభిమాన రచయిత్రిని మీరు చూశారేమో నని తెలుసుకోవడానికిగాను అడుగుతున్నాను అంతే. ప్రసన్నరాణిగారిది భువనేశ్వర్."

"ఈజిట్." ఆశ్చర్యంగా చూసింది శైలజ.

"అవును. మీరు భువనేశ్వర్‌లోనే రైలెక్కారు కదా! అందుకని, మీరు ప్రసన్నరాణిగారిని చూసివుండవచ్చు నేమోనని అనుకున్నాను. మరో సంగతి, మీ అభిమాన రచయిత్రి ప్రసన్నరాణి మా సిస్టర్" అన్నాడు.

సంభ్రమంగా చూసింది శైలజ రామారావ్‌ను.

ఇప్పుడతడు ఆమెకో అపరిచితవ్యక్తిలా కనిపించడం లేదు.

ఇద్దరూ చాలాసేపు ప్రసన్నరాణి నవలలు గురించి మాట్లాడుకున్నారు.

శైలజ ప్లాస్టిక్ బాస్కెట్‌లోనుండి ఫ్లాస్కును తీసి-కప్పులో కాఫీపోసి రామారావ్‌కు యిచ్చింది.

రామారావ్ థాంక్స్ చెప్పి, కాఫీతాగి జిప్ బ్యాగ్‌లో నుండి కొత్త సిగరెట్ ప్యాకెట్టును తీసి సిగరెట్ వెలిగించుకున్నాడు.

"మీరు ఈ సారి భువనేశ్వర్ రాగానే మా యింటికి రండి. మా సిస్టర్ని....ఐ మీన్ మీ అభిమాన రచయిత్రిని మీకు పరిచయం గావిస్తాను" అన్జెప్పి చిన్న కాగితంమీద చిరునామా వ్రాసి యిచ్చాడు.

ఆ కాగితాన్ని భద్రంగా పర్సులో దాచుకుంది శైలజ.

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ వాల్తేరు స్టేషన్‌లో ఆగింది.

రామారావ్ జిప్‌బ్యాగ్‌ను పట్టుకుని లేచాడు.

శైలజ బెడ్డింగ్‌ను కూడా పట్టుకున్నాడు. ఆమె వారిస్తున్నా వినలేదు.



రైలుదిగిన తర్వాత పోర్టర్ చేత సామాను పట్టించుకుని బైటకు నడిచారు యిద్దరూ.

శైలజ ఆటోను పిలిచింది.

పోర్టరు సామాన్లను ఆటోలో వుంచేడు.

శైలజ పర్సుతీసి డబ్బుల్ని పోర్టరుకు యివ్వబోతుంటే, రామారావ్ ఆమెను వారిస్తూ—

"మీ రుండండి.... నేనిస్తాను" అంటూ హడావుడిగా పాంటు జేబులో చెయ్యి పెట్టేడు.

అంతే.

మరుక్షణంలో రామారావు ముఖం మాడిపోయింది.

"మైగాడ్! నా పర్సు నెవరో కొట్టేశారు" అన్నాడు కంగారుగా.

శైలజ సానుభూతిగా రామారావ్ వైపు చూసి పోర్టరుకు కూలి డబ్బుల్నిచ్చి పంపించేసింది.

"దొంగ రాస్కెల్స్ కన్నుమూస్తే చాలు-జేబులు కొట్టేస్తారు. అందుకనే మనం ప్రయాణాల్లంట చాలా

జాగ్రత్తగా వుండాలండీ!" అంది శైలజ.

రామారావు బిక్కముఖం వేశాడు.

"మీరు యెక్కడికి వెళ్ళాలి?" అడిగింది శైలజ.

"షిప్‌యార్డ్‌కండీ! అక్కడ నాకీ రోజు యింటర్వ్యూ వుంది. డబ్బులు పోయాయి. ఈ కొత్త ప్రదేశంలో యెలాగ మెంటైన్ కావాలో అర్థంకావడంలేదు....ప్లీజ్! మీరు నాకో సహాయం చేసిపెడతారా?" దీనంగా చూస్తూ అడిగాడు.

ఏమిటన్నట్లు చూసింది శైలజ.

"నేను భువనేశ్వర్‌కి తిరిగి వెళ్ళగానే-పంపించేస్తాను. దయచేసి వో హండ్రడ్‌రుపీస్ అప్పుగా యివ్వండి" అన్నాడు.

రామారావ్ మాటలకు శైలజ తటపటాయించింది.

"ప్లీజ్. మీరు కాదంటే నేను చికాకుల్లో పడిపోతాను. మీ అభిమాన రచయిత్రి ప్రసన్నరాణిగారి బ్రదర్నన్న సానుభూతితోనైనా ఈ హెల్ప్ చెయ్యండి. ప్లీజ్...." అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

శైలజ రామారావ్ కళ్ళల్లో సూటిగా చూసింది. ఆ చూపుల్లోని తీక్షణతకు రామారావు తట్టుకోలేకపోయాడు.

"ప్రసన్నరాణి మీ సిస్టరా?" ప్రశ్నించింది సీరియస్‌గా.

అవునన్నట్లుగా తలాడించాడు రామారావ్.

"అబద్ధాలాడకు మిష్టర్! ప్రసన్నరాణి మా అక్క. తెల్సిందా?" అంది కళ్ళెర్రజేస్తూ.

శైలజ మాటలకు ప్రక్కలో పిడుగులు పడుతున్నట్లుగా హడలిపోయి—పరుగువంటి నడకతో జనంలో కలిసి పోయాడు రామారావ్.

శైలజ తేలిగ్గా నిట్టూర్చింది.

రామారావ్‌కు నిజంగా ప్రసన్నరాణి సిస్టరో, కాదో తేల్చుకోవడానికిగాను, ప్రసన్నరాణి తనకు సిస్టరంటూ బుకాయించింది శైలజ. దొంగ దొరికిపోయాడు.

'ఇంకా నయం, ఆ వెధవకి ప్రసన్నరాణి నిజంగానే సిస్టరని నమ్మేసి వందరూపాయలూ గుడ్డిగా ఇచ్చేసి వుంటే— తను మోసపోయి వుండేది.' అనుకుంటూ, ఆటోలో కూర్చుని తన అడ్రసు చెప్పింది శైలజ. ★

ధర్మం?

"బాబూ, ధర్మం చేయండి."

"పది పైసలిస్తే ఏం జేస్తవోయ్?"

"ఏదో తమ దయ. అరకప్పు టీ తాగుతా బాబయ్యా!"

"అర్ధ రూపాయిస్తే ఏం జేస్తవ్?"

"ఏదైనా టిఫిన్ చేస్త బాబయ్యా!"

"రూపాయిస్తే—"

"లాటరీ టిక్కెట్టు కొంటానయ్యా!"

"లాటరీలో లక్షలొస్తే ఏం జేస్తవ్?"

"తమరి రూపాయ తిరిగి ఇచ్చేస్తా....!!"

—యన్. బాలరాజు, గుంటూరు

హంతకుడి ఉత్తరం

విద్వాన్ శీలాదేవి

"పోస్ట్‌సార్!" అంటూ ఆరోజు వచ్చిన ఉత్తరాలతో లోనికి వచ్చేడు. నౌఖరు.

సిగరెట్ అంటిస్తూ, బల్లమీద పెట్టమని సైగచేశాను.

వాటిని బల్లమీద వుంచి వెళ్ళిపోయాడు.

ఉత్తరాలు చూద్దామని కుర్చీ ముందుకు జరుపుకున్నాను.

అంతలో ఫోన్ మోగింది.

రిసీవర్ అందుకుని - "ఎస్, జ్యోతిప్రకాశ్ స్పీకింగ్!" అన్నాను.

"ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతున్నాను! గుడ్ మార్నింగ్."

"గుడ్‌మార్నింగ్ ఇన్‌స్పెక్టర్! హంతకుడి ఆచూకీ ఏమైనా తెలిసిందా?" అడిగేను ఆత్రంగా.

ఇన్‌స్పెక్టర్ పెదవి విరిచి — "సారీ! కేసు అట్టే ముందుకు సాగడం లేదు!" అన్నాడు.

"ఇన్ని రోజులైనా, కనీసం చిన్న ప్రోగ్రెస్‌కూడా కనిపించలేదా మీ పరిశోధనలో?"

"ప్రయత్నిస్తున్నాం! మా శక్తి వంచనలేకుండా ప్రయత్నిస్తున్నాం, చిన్న క్లూ ఏమైనా దొరుకుతుందేమోనని. ఫలితం నిష్ప్రయోజనంగా వుంది.

పరిస్థితులు ఇలాగే వుంటే, మిస్టర్ జ్యోతిప్రకాశ్! మీ భార్యను చంపిన ఆ హంతకుణ్ని ఈ సర్వీసులో పట్టుకుంటానో, లేదో అన్న దిగులు వేధిస్తోంది నన్ను! హంతకుడు చాలా తెలివైన వాడిలా వున్నాడు."

నిట్టూర్చాను. "ఇది చెప్పడానికేనా నాకు ఫోన్ జేసింది?"

"నో, నో! కేసు జటిలమైనది. నిజమే! అలాగని, మేము కేసుమూసి వేస్తామనుకోడం పొరబాటు. నేను చేపట్టిన కేసు అంతు తేల్చందే నాకు నిదరపట్టదు.

అంధకారంలో ఆశాకిరణంలా ఇప్పుడే నాకో ఆలోచన తట్టింది. నేరస్తులు ఎంత పకడ్బందీగా నేరంజేసినా, ఎక్కడో చిన్న చిన్న పొరబాట్లు జెయ్యకమానరు. ఆ పొరబాట్లే వాళ్ళ వాసన పట్టిస్తాయి మాకు...."

"ఇంతకీ మీ ఆలోచన ఏమిటి?"

"చెబుతాను! ఈరోజు మీపేర ఏవైనా ఉత్తరాలు వచ్చాయా?"

"ఔను! సుమారు పది వచ్చుంటాయి! ఏం?"

"అవన్నీ చదివేశారా?"

"నో! ఇప్పుడే వచ్చాయి. ఇంకా చూడలేదు!"

"వెంటనే చూడండి! ఎందుకో తెలుసా? మీ భార్య హత్య జరిగిన రాత్రి మీ ఇంట్లో పెద్ద ఎత్తున బర్త్‌డే పార్టీ ఇచ్చారు మీరు. నగరంలోని మీ స్నేహితులందర్నీ ఆహ్వానించారు.

పార్టీ మంచి రసపట్టులో వుండగా, మీ భార్య హాల్లోంచి బైటికి వెళ్ళడం, ఆ తర్వాత కాంపౌండ్‌లో వున్న పచ్చిక బయలుమీద ఆమె శవం కనిపించడం జరిగింది.

అంటే, పార్టీకి వచ్చిన మీ స్నేహితుల్లోనే ఎవ్వరో ఆమెని హత్యజేసి వుంటారని నా అనుమానం! ఆ రాత్రి పార్టీకి వచ్చిన స్నేహితులే ఇప్పుడు మిమ్మల్ని ఓదారుస్తూ ఉత్తరాలు రాస్తున్నారు.

బహుశా, హంతకుడుకూడా వాళ్ళతోబాటు తనూ ఓ సానుభూతి లేఖ రాసి పడేసివుంటాడు. అందరూ రాస్తున్నప్పుడు తను రాయకుంటే ఎవ్వరికైనా తనమీద అనుమానం వచ్చే ఆస్కారం వుంటుందని!"

"ఆల్‌రైట్! మీ తర్కంతో ఏకీభవిస్తున్నాను. ఉత్తరం రాసినంత మాత్రాన హంతకుడు ఫలానా అని ఎలా కనుక్కోగలం?" అడిగేను అర్థంగాక.

"మిస్టర్ జ్యోతిప్రకాశ్! క్రిమినల్ సైకాలజీని దృష్టిలో వుంచుకుని మీతో ఈ విషయం చర్చిస్తున్నాను. అందరితోబాటు హంతకుడు రాసిన ఆ సానుభూతి లేఖలో అతనికి తెలీకుండా ఏ చిన్న వాక్యమో, అతనివైపు ఇండికేట్ జేసే

ఏ చిన్న సంకేతమో దొర్లి వుంటుంది. ఆ చిన్న పొరపాటే అతని మెడకి ఉరితాడు బిగించవచ్చు.

అందుకే ఓసారి ఆ ఉత్తరాలన్నీ జాగ్రత్తగా పరిశీలించమని కోరుతున్నాను!"

"ఆ పార్టీకి వచ్చిన నా స్నేహితుల్లో, నేను ప్రాణప్రదంగా ప్రేమించిన నా భార్యను చంపిన హంతకుడున్నాడంటే, ఎందుకో నమ్మశక్యం కావడంలేదు.

వారిలో ప్రతి ఒక్కరూ నాకు బాగా తెలుసు! అటువంటి వ్యక్తుల్లో అంజలిని అంత క్రూరంగా, అకారణంగా చంపగలిగే కర్కశుడుండటం అసంభవం!"

"మిస్టర్ జ్యోతిప్రకాశ్! ఈ సృష్టిలో అకారణంగా ఏ పనీ జరగడం లేదు. ప్రతి పనివెనకా ఏదో నిగూఢకారణం, ఉద్దేశం వుండి తీరుతుంది.

మిసెస్ అంజలి హత్యకూడా అంతే! ఎటొచ్చీ హంతకుడు పట్టుబడేవరకూ ఆ హత్యకి కారణమేమిటో మనకి తెలియదు. ఆ రాత్రి నేను అందర్నీ తరచి తరచి ప్రశ్నించాను. ప్రతి ఒక్కరూ ఒకే జవాబిచ్చారు.

పార్టీలో తాము పూర్తిగా మునిగి వున్నామనీ, కాక్‌టేల్ బావుండటంవల్ల కాస్త ఎక్కువ మోతాదులో తాగామనీ, ఆ నిషాలో హత్య ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరిగిందో తమకు తెలియదనీ చెప్పారు...."

"ఆల్‌రైట్ ఇన్‌స్పెక్టర్! మీరు చెప్పినట్టు ఉత్తరాలన్నీ ఒకసారి సమగ్రంగా పరిశీలించి, ఏదైనా తడితే ఫోన్ చేస్తాను."

"థాంక్యూ!" అవతల క్లిక్‌మంది.

రిసీవర్ దించి, బల్లమీద పడున్న ఉత్తరాలవైపు చూసేను. రకరకాల కవర్లూ, ఇన్‌లాండ్ లెటర్లూ

వున్నాయి.

తలెత్తి గోడకి వేళాడుతున్న నా భార్య ఫోటోవైపు చూశాను.

అంజలి!

అందాల జాబిలి!!

ఇప్పుడీ లోకంలో లేదు. అనంతమైన శూన్యంలో తిరిగి రాని దూరాలకు వెళ్ళిపోయింది....నిట్టూరుస్తూ బల్ల ముందు కూర్చుని, ఉత్తరాలు చూడ్డంలో నిమగ్నమయ్యాను.

2

మొత్తం పన్నెండు ఉత్తరాలు.

ఒక్కొక్కటీ చదవడం ప్రారంభించాను. దగ్గిరి బంధువులూ, దూరపు బంధువులతో సహా, కొందరు ఆప్త మిత్రులుకూడా నన్ను ఓదారుస్తూ రాశారు.

తొమ్మిదో ఉత్తరం తెరిచి, నాలుగైదు లైన్లు చదివాక, దిగ్భ్రాంతితో నా తల గిరగిర తిరిగిపోయింది. నమ్మకం కలక్క, మరోసారి చదివాను. ఆశ్చర్యపోతూ ఎవ్వరు రాశారా అని ఉత్తరం చివర సంతకం చూశాను.

శ్రీధరన్!

అతను ఎవ్వరోకాదు. నా బిజినెస్ పార్టనర్!!

తన్నుకు వస్తున్న ఆశ్చర్యాన్ని తొక్కిపెడుతూ, మొదటినించీ ప్రారంభించాను చదవడం!

"డియర్ జ్యోతిప్రకాశ్!

జీవితంలో కొన్ని సంఘటనలు అనుకోకుండా, అనూహ్యంగా జరిగిపోతాయి. ఒక్కొసారి అవి జరిగిపోయాక గానీ, మనకు వాస్తవం ఏమిటో తెలిపిరాదు. సరిగ్గా నా జీవితంలోనూ అదే జరిగింది.

తెలిసీ తెలియక జరిగిపోయే కొన్ని తప్పిదాలకూ, పొర



బాట్లకూ 'క్షమ' అనే చివరి అంచు ఉంటుంది. కానీ, నావల్ల జరిగిపోయిన తప్పిదాన్ని క్షమించడం అటుంచి, ఎటువంటి శిక్ష వేసినా తక్కువే!

నీ భార్య అంజలి అందాల పూబంతి. నిజమే! ఆమెను చూసినప్పుడల్లా సృష్టివిధాతనూ, నీ అదృష్టాన్నీ లోలోపలే అభినందించుకోడం తప్ప, ఆమెనేదో చెయ్యాలన్న దురాలోచన ఎన్నడూ కలగలేదు నాకు.

ఆ రాత్రి నీవిచ్చిన పార్టీలో, కాక్ టేల్ బావుండటం వల్ల అందరితోబాటు నేనూ కాస్త ఎక్కువ మోతాదులోనే పుచ్చుకున్నట్టు జ్ఞాపకం! బహుశా మిగతావాళ్ళకన్నా ఎక్కువే తీసుకున్నానేమో?

క్రమక్రమంగా నా కళ్ళకి ఎదుటివాళ్ళ మొహాలూ, రంగురంగుల దీపాలూ, కర్ణపేయంగా మోగుతున్న శ్రావ్యమైన సంగీతం లీలగా కనిపించీ వినిపించడం ప్రారంభించాయి. ఆ తరవాత ఏం జరిగిందో తెలీదు....

తిరిగి కళ్లు తెరిచిచూస్తే పచ్చికబయలుమీద, మసక చీకట్లో కాంపౌండ్లో పడున్నాను. నా చేతిలో పెద్దసైజు

రాయి ఉంది. పక్కకి తిరిగి ఉలిక్కిపడ్డాను కొద్దిదూరం లోనే నీ భార్య అంజలి పడుంది, వెల్లకిలా, నిశ్చలంగా!

ఆమె దుస్తులన్నీ అక్కడక్కడా చిరిగి ఉన్నాయి. తలంతా రక్తసిక్తం! చటుక్కున నా చేతిలోని రాయి చూసుకున్నాను పరీక్షగా. దానిమీద అక్కడక్కడా రక్తపు మరకలు! అప్పుడర్థమైంది. తాగిన మత్తులో నావల్ల ఎటు వంటి ఘోరం జరిగిపోయిందో!

ఆమెకు మొదటినించీ మత్తుపానీయాలంటే గిట్టవు. కనీసం ఫార్మాలిటీస్‌కోసమైనా ఏ పార్టీలోనూ వాటిని తాకేది కాదు కదా! అందుకే, లోపల మనందరం మధుపానంలో మునిగి తేలుతోంటే, ఆ వాసన భరించలేక, కాక్‌టేల్ పూర్తయ్యేవరకూ అలా చల్లగాలిలో పచార్లు జేసివద్దామని కాంపౌండ్‌లో కెళ్లింటుంది.

మత్తులో ఉన్న నేను ఆమె ఒంటరిగా బైటికెళ్తుం డటం చూసి ఉంటాను. ఆమె వెనకే నేనూ కాంపౌండ్‌లో కెళ్ళుంటాను....ఆ తరవాత మామధ్య పెనుగులాట జరిగి ఉంటుంది. పరిస్థితి విషమించేసరికి పిచ్చి ఆవేశంలో చేతి కందిన రాయితో ఆమె తలమీద దెబ్బతీసి ఉంటాను.

తగలనిచోట తగిలి ఉంటుంది రాయి. అంజలి వెంటనే ప్రాణం విడిచి ఉంటుంది....ఇవన్నీ ఆలోచించాక, ఇక ఒక్క క్షణం కూడా అక్కడుండకుండా పారిపోయేను....

ఈ వారంరోజులూ నేను పడ్డ మనఃక్షోభ అంతా ఇంతా కాదు. పోలీసులు సామాన్యులు కారు. ఎప్పుడో ఒకప్పుడు నా బండారం బద్దలుకాక మానదు. అటువంటి హీనమైన ఘడియలు రాకముందే ఆత్మహత్య జేసుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం!

చచ్చేముందు నీకన్ని విషయాలు తెల్పుతూ, క్షమాభిక్ష

అర్థిస్తూ ఈ ఉత్తరం రాస్తున్నాను. ఈ లేఖ నీకందేలోగా నేనీ లోకంలో ఉండను. శాశ్వతంగా వెళ్ళిపోతాను.

సెలవ్.

ఇట్లు
శ్రీధరన్.

ఉత్తరం పూర్తిగా చదివి, చటుక్కున కవర్ తిప్పి చూశాను. రెండురోజుల క్రితం ఇక్కడే తాంబరంనించి పోస్టుజెయ్యబడింది.

నిజానికా ఉత్తరం నిన్ననే నాకందాల్సింది. మధ్యలో ఆదివారం దాపురించడంవల్ల, ఈరోజు సోమవారం ముట్టింది నాకు.

అంటే, ఈపాటికి శ్రీధరన్ ఆత్మహత్య జేసుకునుంటాడు. ఓహ్ గాడ్! తక్షణం దీన్ని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కందజెయ్యాలి.

చటుక్కున ఫోన్ దగ్గరికి లాక్కోబోయాను.

అప్పుడు మోగింది కాలింగ్‌బెల్!

ఇన్‌స్పెక్టర్ వచ్చాడేమో, అనుకుంటూ వెళ్ళి తలుపు తీశాను.

గుమ్మంలో నిల్చున్న వ్యక్తి ఇన్‌స్పెక్టర్ కాదు!

శ్రీధరన్!!

"నువ్వా!?" అన్నాను నివ్వెరబోతూ.

శ్రీధరన్ పేలవంగా నవ్వి తలూపాడు.

అతని అవతారం దయనీయంగా ఉంది. వేసుకున్న పాంటూ, షర్టూ బాగా మాసిపోయాయి. గెడ్డం పెరిగింది. మొహం పీక్కుపోయింది.

లోనికి రమ్మన్నట్టు తలుపు కడ్డం తొలిగాను. శ్రీధరన్ ఉలుకూ పలుకూ లేకుండా అడుగులో అడుగు వేసుకుంటూ

డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు. అతని దృష్టి టేబిల్ మీద పడున్న ఉత్తరాలమీద నిలిచింది.

మెల్లిగా నావైపు తిరిగి, "నేను రాసిన ఉత్తరం చదివావా?" అడిగాడు జీవంలేని కంఠంతో.

"ఏ ఉత్తరం?" అడిగాను ఆశ్చర్యం నటిస్తూ.

"అదే నావల్ల జరిగిపోయిన నేరాన్ని ఒప్పుకుంటూ, నన్ను మనస్ఫూర్తిగా క్షమించమని వేడుకుంటూ రాసిన ఉత్తరం!"

"నాకేమీ అర్థం కావడం లేదు. చెప్పేదేదో కాస్త వివరంగా చెప్పు!" అన్నాను అయోమయంగా ఫోజుపెట్టి.

శ్రీధరన్ పలకలేదు. నిట్టూరుస్తూ సోఫాలో కూలబడ్డాడు.

"జ్యోతిప్రకాశ్! నీ భార్యను చంపింది ఎవ్వరో కాదు, నేనే!" అన్నాడు పూడుకుపోయిన కంఠంతో.

వెంటనే నా మొహంలో దిగ్భ్రాంతి ఎఫెక్టు తెచ్చుకున్నాను.

శ్రీధరన్ తను ఉత్తరంలో రాసిన విషయాలు మరోసారి ఉటంకించి—"దాన్నింకా చదవలేదా నువ్వు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"చదవలేదు! ఇంతకీ ఆత్మహత్య జేసుకోవాలనుకున్న వాడివి యిక్కడి కెందుకొచ్చావ్?...." అడిగాను ఆశ్చర్యంగా.

"నేను ఆత్మహత్య నిర్ణయాన్ని విరమించుకున్నాను!"

"ఐతే చట్టానికి లొంగిపోవాలనుకున్నావన్నమాట! వెరీ గుడ్! శిక్ష తక్కువపడుతుంది. పోలీసులకి ఫోన్ జేసి పిలిపించనా?" అడిగాను ఫోన్ వైపు చూస్తూ.

డాక్టర్వి అయితే మాత్రం - పెళ్ళివారి విడిది
గృహానికి పంపేశారు ఏమిటయ్యా!!



శ్రీధరన్ నవ్వి—"చెబుతాను!" అంటూ జేబులో చెయ్యిపెట్టాడు.

తిరిగి బైటికి వచ్చిన అతని చేతిలో, నల్లగా నిగనిగ మెరుస్తున్న పిస్తోలు చూసి నివ్వెరబోయాను.

"అయామ్ వెరీ సారీ! నేను చావదలచుకోలేదు. చట్టాని క్కూడా లొంగదలచుకోలేదు. ఏదో ముందూ వెనకా ఆలో చించకుండా భయపడ్డానుగానీ, అంజలిని నేనే చంపానని నిదర్శనా లేమిటి?

అనవసరంగా నా నేరాన్ని ఒప్పుకుంటూ నీకు ఉత్తరం రాశాను. అదృష్టవశాత్తూయింకా నువ్వు దాన్ని చదవలేదు!" అన్నాడు శ్రీధరన్ నవ్వుతూ.

"ఐతే, ఈ పిస్తోలుదేనికి! నన్ను బెదిరించి ఆ ఉత్తరం తీసికెళ్ళా లనుకుంటున్నావా....?" నా కంఠం వొణుకు తోంది.

"సరిగ్గా ఊహించావ్! నా స్వదస్తూరితో నా నేరాన్ని ఒప్పుకుంటూ రాసిన ఆ లేఖ నేను సజీవంగా ఉండటానికి ఎంతటి అవరోధమో వేరే చెప్పనవసరం లేదనుకుం

టాను" అంటూ సోఫాలోంచి లేచాడు శ్రీధరన్.

నా గుండెలో గుర్రాలు దౌడుదీస్తున్నాయి. అతన్ని పట్టించడానికి అభేద్య ఆధారమైన ఆ లేఖ చేజారిపోతోంది. ఏం జెయ్యాలి? ఇప్పుడేంజెయ్యాలి? సమయానికి నా దగ్గిర ఎలాటి ఆయుధమూ లేదే?

పిస్తోలు సేఫ్టీకాచ్ వెనక్కి లాగి, "అంతే కాదు. ఆ లేఖతోబాటు నా రహస్యంతెలిసిన విన్నూ అంతంజెయ్యడం అత్యవసరం!" అన్నాడు శ్రీధరన్.

3

ఊహించని ఆ పరిణామంతో అవాక్కయిపోయాను!

జాగుజేస్తే నిజంగా షూట్‌జేలాగున్నాడు. "శ్రీధరన్! తొందరపడక! అసలు మిస్టరీ ఏమిటో నీకు తెలీదు. ఆ హత్య నువ్వు జెయ్యలేదు...."

పకపక నవ్వేడతను. "జ్యోతిప్రకాశ్! చావు తప్పించుకోడానికి నన్ను మభ్యపెట్టక! నాకు పూర్తి నమ్మకం ఉంది. తాగిన మైకంలో నేనే ఆ హత్యజేశాను."

"ప్లీజ్, నామాట నమ్ము శ్రీధరన్! అంజలిని చంపింది ఎవ్వరోకాదు, నేనే. ఆమెను చంపాక, ఆ హత్యా నేరం నీమీదికి రావాలని బాగా తాగించి, మూర్ఛపోగొట్టి, అక్కడ పడేశాను. స్పృహ వచ్చాక నువ్వే ఆ హత్య జేసినట్టు పొరబడుతున్నావు!

నన్ను నా మానాన వదిలి, ఆ ఉత్తరం తీసుకుని వెళ్ళిపో. ఇద్దరికీ ఎలాటి నష్టం ఉండదు. పోలీసులు మనల్ని అనుమానించే ఆస్కారం లేదు...."

"నీ భార్యని నువ్వు చేజేతులా చంపేశావా? ఎందుకు?" అడిగాడు శ్రీధరన్ నివ్వెరబోతూ.

ఇక చెప్పక తప్పదు. నిజం చెప్పకుంటే కాల్చి పారే స్తాడు.

మెల్లిగా ప్రారంభించాను. "అంజలిని చంపడంలో అనేక కారణాలున్నాయి. సాధ్యమైనంత త్వరగా ఆమెను చంపకుంటే నా బ్రతుకు బజార్నపడే ప్రమాదం ఏర్పడేది.

ఈ ఆస్తిపాస్తులూ, అష్టయిశ్వర్యాలూ నా స్వార్జితం కావు! మా మామగారి కష్టార్జితాలు. అంజలి ఆయనకు ఏకైక సంతానం! నేనీ ఇంటికి ఇల్లరికపు టల్లుడిగా వచ్చిన వాణ్ణి.

ఆయన మరణానంతరం, ఆ స్తిపాస్తులూ, ఫ్యాక్టరీ వ్యవహారాలూ చూచుకునే భారమంతా నాదే అయినా, ఆస్తి యావత్తూ అంజలిపేర్నే వుంది.

మొదటినించీ నేను విలాసజీవితానికి అలవాటుపడ్డవాణ్ణి. మామయ్య వున్నంతకాలం నా వ్యసనాలు గుట్టుచప్పుడు కాకుండా సాగిపోయేవి. ఆయన మరణంతో వాటికి పట్ట పగ్గాలు తప్పాయి....

అందుకే ఈ మధ్య మా దాంపత్య జీవితంలో పొర పొచ్చాలు ప్రారంభమయ్యాయి. నా దుర్వ్యసనాలు మానెయ్యమని అనేకసార్లు హెచ్చరించింది అంజలి! ఒక సారి వాటిఛాయలు మనిషిని కప్పివేశాక, అంత సులభంగా మళ్ళీ వెలుగును చూడటం అసాధ్యం!

దాంతో, విడాకులు తప్పవని బెదిరించింది అంజలి. మాకింకా సంతానం కలగలేదు. ఆమె అన్నంతపనీ జెయ్యవచ్చు. దాంతో, నా బ్రతుకు కుక్కకన్నా హీనమై పోతుంది....

అప్పుడు తట్టింది నాకు ఆలోచన! పటిష్టమైన పథకం వేసి, అంజలిని హరీమనిపిస్తే, నాకు ఏసమస్యా వుండదు.

అంతవరకూ ఆమెకోపం తగ్గడానికి బుద్ధిగా మసలు కుంటున్నట్టు నటిస్తూ అవకాశంకోసం కాచుకున్నాను....

ఆ రోజు పార్టీలో ఎవళ్ళకి వాళ్ళు తోచినట్టు తాగుతూ మరోగొడవ పట్టించుకోని స్థితికి వచ్చేశారు. సరిగ్గా అదే సమయంలో హాల్లోంచి బైటికెళ్తున్న అంజలి కనిపించింది నాకు. అప్పుడు తళుక్కుమంది ప్లాన్!

పిల్లిలా నేను కాంపౌండ్‌లోకి చేరాను. వెన్నెల్లో పచ్చికబైలుమీద పచార్లు చేస్తోంది. ఓ మొనదేలిన రాయి అందుకుని దగ్గరికెళ్ళాను. అడుగుల చప్పుడు విని నావైపు తిరిగింది. అంతే!

మారుమాటాడకుండా ఇచ్చేను కణతమీద. భయంతో గావుకేక పెట్టబోయింది. నోరునొక్కి బుర్ర పగిలేలా మరోటి ఇచ్చాను. ఆమెతల నిజంగానే పగిలింది. పగిలిన బీటలోంచి ధారగా కారసాగింది రక్తం! కాండం నరికిన చెట్టులా నేలకూలింది. కాసేపు విలవిల తన్నుకుని ప్రాణం విడిచింది.

అప్పుడే నాలో మరో ఆలోచన మెరిసింది. ఏమీ జరగ నట్టు తిరిగి హాల్లోకి నడిచాను. తింటూ తాగుతూ యెవ్వరి ఖుషీలో వాళ్ళున్నారు. ఓ మూల సోఫాలో కూర్చుని తాగు తున్న నువ్వు కనిపించావు.

పైకి మనం స్నేహితులమే అయినా, నీకూ నాకూ బిజినెస్ వ్యవహారాల్లో చాలాకాలం నించీ పోటాపోటీలు నడుస్తున్నాయి. లోలోపల ఒకర్నొకరం ద్వేషించు కుంటున్నా, పైకి మాత్రం ఫార్మాలిటీస్ మెయింటినెన్స్ జేస్తున్నాం!

నీ పక్కన కూర్చుని కబుర్లాడుతూ కొసరికొసరి తాగిం చాను. నీ స్థితి అర్థసుషుప్తావస్థలోకి వచ్చాక, చల్లగాల్లో

అలా బైటికెళ్దాం రమ్మని, భుజంమీద చెయ్యివేసి నడిపిస్తూ అంజలి శవం పడున్న చోటికి తీసికెళ్ళాను.

అప్పటికే నువ్వు నిల్చోలేక కిందామీదా పడుతున్నావు. అరచేతి అంచుతో మెడమీద చావుదెబ్బ తీశాను. కిక్కురు మనకుండా నేలకూలి స్పృహతప్పావు. అంజలిని చంపిన రాయిని కర్చీఫ్‌తో పట్టుకొని తెచ్చి, నీ చేతిలో పెట్టి, ఆమె తొడుక్కున బట్టలు అక్కడికక్కడే చింపి, పిల్లిలా లోపలి కెళ్ళి మిగతావారితో కలిసిపోయాను.

సరిగ్గా పన్నెండు గంటలకి ముగిసింది పార్టీ.

ఒక్కరొక్కరే సెలవు తీసుకుంటూ బైటికెళ్ళసాగారు! ఆ వెళ్ళినవారిలోనే ఒకరు గావుకేక పెడుతూ పరిగెత్తుకొచ్చి అంజలి బైట చచ్చిపడుందని చెప్పారు.

మరుక్షణం అక్కడ పెద్దభూకంపం వచ్చినట్టయింది. అందరితో కలిసి బైటికెళ్ళి చూసాను.

నా గుండె గుభిల్లుమంది!

శవం ప్రక్కన ఉండవలసిన నువ్వు లేవు.

నా ప్లాన్ అక్కడే బెడిసికొట్టింది. బహుశా, నీకు త్వరగానే స్పృహ వచ్చివుంటుంది. శవం పక్కన పడుండటం చూసి భయపడి అప్పటికప్పుడే అక్కణ్ణించి పారిపోయుంటావ్!

పోలీసులు వచ్చాక నేను నీ విషయం ఎత్తనూలేదు. ఎవ్వరికీ నామీది అనుమానం రాలేదు.... నా వాక్యం యింకా పూర్తికాలేదు.

గదిలోకి ఎవ్వరో వచ్చినట్టు బూట్సుల చప్పుడై చటుక్కున అటు తిరిగాను.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావ్.

నా కళ్ళలో నింగీనేలా గిరగిర తిరగసాగాయి.

"వెల్ మిస్టర్ శ్రీధరన్! బాగా నటించారు!" అంటూ నా వైపు తిరిగి—"నీ నేరాన్ని నీ నోటిద్వారా పలికించాలనే ఈ ఎత్తు వేశాం! రెండురోజుల క్రితం శ్రీధరన్ నన్ను కలుసుకుని ఆ రాత్రి జరిగింది చెప్పాడు.

ఆ రాత్రి పార్టీలో నీవు తన దగ్గర కూర్చుని కబుర్లు చెబుతూ తప్ప తాగించడం మాత్రం గుర్తుందనీ, ఆ తరవాత ఏంజరిగిందో తనకి తెలీదనీ,స్పృహవచ్చి చూస్తే తను శవంపక్కన పడున్నాననీ చెప్పాడు.

అప్పుడే నా దృష్టి నీ మీదికి మళ్ళింది. ఈ విధంగా పరీక్షించి చూద్దామని నేనే అతనిచేత ఆ వుత్తరం రాయించేను. తరవాత అతనక్కడికి పంపి, ఈ నాటకం ఆడించాను. దీనితో నా అనుమానం వట్టి అనుమానం కాదని తేలిపోయింది.

మీ సంభాషణంతా ఇదుగో, ఇందులో రికార్డయి రెడీగా వుంది!" అంటూ జేబులోంచి టేప్ రికార్డర్, కమ్ హాండ్ కఫ్స్ బైటికి తీశాడు ఇన్‌స్పెక్టర్. ★

నమ్మకం?

"ఏమండి, మీరు త్రాగి వచ్చారా?"

"ఏం నాపై అనుమానమా!"

"అబ్బే! మీరు త్రాగరని తెలుసు. కాని, వాసన వస్తుంటే....?"

"వాసన వస్తే రానిలేవే! త్రాగనని నీకు నమ్మకముంటే అంతే చాలు!!"

—కె. నాగభూషణ, దేవనహళ్ళి.

మర్డర్ పార్ట్నర్

కె.బి.యస్.కుమార్

"శత్రువుకి శత్రువు మిత్రుడవుతాడు. ఈ సామెత విన్నావా?" అడిగాడతను.

ఆశ్చర్యంగా అతనివేపు చూశాడు ఆనంద్.

"నాపేరు రామరాజు, నీ మిత్రుణ్ణి...." అన్నాడతను మళ్ళీ.

"కాని మిమ్మల్నెప్పుడూ చూడలేదు నేను...." విస్మయంగా అన్నాడానంద్.

APM 10

"అయినా నీగురించి నాకు మాత్రం బాగా తెలుసు" అన్నాడు రామరాజు.

"ఎలా తెలుసు?"

"ఆ ప్రశ్న ప్రస్తుతం అనవసరం. భూషణరావు నీ బ్రతుకుని నాశనంచేశాడు కదూ!"

విస్తుపోయి చూస్తోన్నాడానంద్.

"అంతగా ఆశ్చర్యపడకు. భూషణరావు నాకూ ద్రోహం చేశాడు. అతన్ని చంపాలని నిశ్చయించుకున్నాను. చంపి తీరతాను. కాని అతనిపై పగవున్న మరో వ్యక్తికూడ అతన్ని చంపితే అతని మనసూ తృప్తి చెందొచ్చనే వూహతో వెదికాను. నువ్వు పడ్డావ్ నా దృష్టిలో. నువ్వు నాతో సహకరించినా-రించకపోయినా నేనుమాత్రం భూషణ రావుని వదల్ను...."

"నేను కొంచెం ఆలోచించాలి...." అన్నాడు ఆనంద్.

"బాగా ఆలోచించు. నాతో కలవాలనుకుంటే 'హోటల్ త్రిమూర్తి'లో రేపు సాయంత్రం ఆరుగంటలకి కలుప్.... రూమ్ నెంబర్ సెవెంటీవన్‌లో వుంటాను...." అన్నాడు రామరాజు లేస్తూ.

2

ఆనంద్ మనసు కుతకుత వుడికిపోతోంది. ఆ సంఘటన గుర్తొచ్చిన వెంటనే అతనిలోని రక్తం లావాద్రవమయిపోతుంది.

ఆనంద్ ఓ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తోన్నాడు.

ఓ రోజు భూషణరావు ఆనంద్‌కి పరిచయమయ్యాడు. అతని కూతుర్ని పరిచయంచేశాడు. ఆమె ఆనంద్‌తో స్నేహం పెంచుకుంది. అతనులేకుండా ఒక్కక్షణం కూడ వుండలేని స్థితికి వొచ్చేసింది.

ఆర్నెల్లు గడిచాయి.

ఆ రోజు భూషణరావు ఆనంద్‌ని పిలిపించాడు. తన ఎదురుగావున్న సూట్‌కేసుని తెరిచాడు. దాన్నిండా వంద రూపాయల నోట్లు. అన్నీ దొంగనోట్లే!!

వాటిని మూడోకంటికి తెలీకుండా బ్యాంక్ యినప్పెట్టెలో చేర్చి, అందులోని అసలు డబ్బుని తనకి చేరిస్తే అందులో సగం వాటా యిస్తానన్నాడు.

అలాంటిపని చెయ్యనని ఖండితంగా చెప్పాడు ఆనంద్. భూషణరావు వినలేదు. బలవంతంచేశాడు. చివరకి లొంగిపోయాడు ఆనంద్. అదీ స్వార్థం చేతకాదు. ఆ పని చెయ్యకపోతే తన కూతుర్నిచ్చి పెళ్ళిచెయ్యనన్నాడు, భూషణరావు.

విమలంటే ఆనంద్‌కి ప్రాణం. విమలని ప్రాణంకన్నా ఎక్కువగా చూస్తాడు. విమల లేకపోతే అతనికి ప్రాణం నిలవదు.

అందుకే వొప్పుకున్నాడు. ఎంతో కష్టంమీద ఆ నోట్లు మార్పిడీ చెయ్యగలిగాడు. వ్రేలిముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకొని అసలునోట్ల పెట్టెతో భూషణరావుని చేరుకున్నాడు.

భూషణరావు ఎంతో సంతోషించాడు. ఆ రోజు గ్రాండ్‌గా పార్టీ అరేంజ్‌చేశాడు. ఆ కార్యక్రమంలో ఆనంద్ తొలిసారిగా తాగాడు. ఆ రాత్రి పార్టీలో డాన్స్ చేసిన అందమైన అమ్మాయి అతని గదిలో కాలుపెట్టింది భూషణంరావు యింట్లోనే.

ఆనంద్ మత్తులో వున్నాడు. డాన్సర్ మత్తెక్కించేలా వుంది. మత్తుకి మత్తు జతైంది. గమ్మత్తుగా తయారైంది. అంతా చిత్తైంది. ఏంజరిగిందో తెలీదు ఆనంద్‌కి.

మర్నాడు పెళ్ళి విషయం ప్రస్తావించాడు ఆనంద్. విసుగ్గా చూశాడు భూషణరావు.

"... మీ పని నెరవేరిస్తే నాకు విమలనిచ్చి పెళ్ళిచేస్తా నన్నారు...."

"కాని విమల నిన్ను చేసుకోదు" భూషణరావు మామూలుగా అన్నాడు.

కోపం వచ్చింది ఆనంద్‌కి. "ఎందుకని?" రెట్టించాడు.

"ఎందుకేమిటి? నువ్వు స్త్రీలోలుడివని తెల్సిపోయింది అమ్మాయికి."

"నేను స్త్రీలోలుడినా?" అనకముందే ఆనంద్ ముందర కొన్ని ఫోటోలు పడ్డాయి. అవి ఆనాడు పార్టీలో డాన్స్ చేసిన అమ్మాయితో తను నగ్నంగా గడిపిన దృశ్యాలు.

నెమ్మదిగా గుర్తుకి తెచ్చుకున్నాడానంద్. అతను ఆమెని ఆశించలేదు. ఆమే అతన్ని ఆక్రమించుకుంది. నవ్వించింది. కవ్వించింది. వశంచేసుకుంది. అయితే.... అయితే....ఫోటో లెలా వచ్చాయి? ఎవరు తీశారు? ఒక వేళ భూషణరావే! అతనికేమవసరం? తను విమలని ప్రేమించటం భూషణరావు కిష్టంలేదా?

వెంటనే వెళ్ళి విమలను కలుసుకున్నాడు ఆనంద్.

"నా అభిప్రాయం మా నాన్న చెప్పే వుంటాడు నీకు" అంది విమల.

విస్తుపోయాడానంద్. "అదికాదు విమలా...." అనబోయాడు.

కాని ఆమె మరేదీ వినిపించుకోకుండా తలుపులు గడియ పెట్టేసుకుంది.



అనంద్ తన జేబులో చూసుకున్నాడు. భూషణరా విచ్చిన ఫోటోలు దొరికాయి.

అందులోని డాన్సర్‌ని పరిశీలనగా చూశాడు.

ఆమెనిగురించి వాకబుచేశాడు. 'హోటల్ నైటింగేల్'లో వుందని తెల్సింది. నేరుగా వెళ్ళాడు. ఆమెతో మాట్లాడాడు.

తన అనుమానం నిజమైంది. భూషణరావే తనపైకి ఆమెని ప్రయోగించాడు. ఫోటోలు తియ్యటానికి అనువుగా పోజు లివ్వమని ఆమెకి డబ్బు ఎరచూపి, ప్రలోభపెట్టాడు. ఈ విషయాలు డాన్సర్‌ని బెదిరించి రాబట్టాడు.

తను తెలుసుకున్న విషయాలు విమలకు చెప్పుదామని వాళ్ళింటికి వెళ్ళాడు. తండ్రీ కూతుళ్ళ సంభాషణ వినిపించి గుమ్మంలోనే ఆగిపోయాడు ఆనంద్.

"మొత్తానికి జీనియస్ బుర్రమ్మా నీది...." అంటోన్నాడు భూషణరావు.

"నీ కూతుర్నేగా!" విమల గొంతు!

"భలే నాటకమాడించావ్. ఆనంద్‌గాడి పీడ విరగడైపోయింది."

"పిడతమొహం వాడూను. నన్ను పెళ్లాడతాట్ట. మరో జన్మ ఎత్తాలి. మొత్తానికి మన పనై పోయింది...."

....యిక వినలేకపోయాడు ఆనంద్. 'ఎంత నాటకం? అసలు భూషణరావూ ఓ తండ్రేనా? తన చీకటి వ్యాపారం సాగటానికి స్వంత కూతుర్నే ఎరగా వాడుకుంటోన్నాడు! అసలటువంటి తండ్రులు వుంటారా లోకంలో....?.

విమలని తల్చుకునేసరికి అతనికింకా అసహ్యంవేసింది.

"... అది ఆడదేనా!? ఆడదానికొకే మనసుంటుందని, అది ఒక్కణ్నే ప్రేమిస్తుందని ఆ తర్వాత మరెవరికీ ఆ మనసులో స్థానం వుండదని పుస్తకాల్లో చదివాడు-విన్నాడు తను. మరి ఏమిటి విమల ప్రవర్తన!? ఆడజాతికే కళంకాన్నాపాదించే యిలాంటి విమలల్ని ఏంచెయ్యాలి? తన హృదయంలో తొలిసారిగా ప్రేమబీజాలు నాటి ఫలించబోయే సమయంలో కూకటి వేళ్ళతో సహా కూలదోసిన యిలాంటి నీచమైన ఆడదాన్ని ఏంచెయ్యాలి? భూషణ రావుపై పగ ఎలా తీర్చుకోవాలి?

విమల ఎటూ దక్కలేదు తనకి. కనీసం ఆ డబ్బులో సగం వాటా ఎలాగైనా రాబట్టాలి. ఎలా? ఎలా??

బాగా ఆలోచించి, ఓ రోజు విమలను ఎత్తుకుపోయి భూషణరావుకు వుత్తరం వ్రాశాడు ఆనంద్.

"మిస్టర్ భూషణరావ్!

నువ్వూ నీ కూతురూ ఆడిన నాటకం నాకు తెల్సు. నేనెవరో నీకుతెల్సు. నువ్వు నాకుచేసిన ద్రోహానికి ఫలితంగా ఏ కూతురుతో నువ్వు ఎన్నో ఘోరాలు చేయించి, నాలాంటి యువకుల హృదయాల్లో ప్రేమ జ్వాలలు రేపుచూ నీ పబ్బాలు గడుపుకుంటున్నావో, ఆ విమలని నేను ఎత్తుకుపోయాను.

అయితే నీ కూతుర్ని చంపలేదు. ఒకప్పుడు ప్రేమించా నన్న జాలితో కాదు. నీ కూతురిప్పుడు బంగారు గ్రుడ్లు పెట్టబోతోన్న బాతు.

ఆనాడు నేను ఆచరణలో పెట్టిన నీ ఆలోచన తాలూకు పైకంలో సగం పాతికలక్షల్ని వెంటనే బ్యాగులో సర్దు కొని వూరికి పదిమైళ్ళ దూరంలోవున్న పాడుబడ్డ బావి దగ్గరికిరా. బంగారుగుడ్లు చేయించుకోవాలి.

లేకపోతే నీ బాతుని రేపు వుదయానికల్లా అదే పాడు బడ్డ బావిలో శవంగా చూస్తావ్. రాత్రి సరిగా ఒంటిగంటకి వంటరిగా రావాలి. ఎవర్నైనా తీసుకొని డబ్బుతో వచ్చినా నీ బిడ్డ శవమవుతుంది. ఆలోచించుకో...."

సంతకం లేకపోయినా, అది ఆనంద్ తాలూకు వుత్తరమే నని గ్రహించాడు భూషణరావు. చాలాసేపు ఆలోచించాడు. డబ్బివ్వడమే మంచిదన్న నిర్ణయానికొచ్చాడు చివరకు. రాత్రికి సర్దుకొని ఒంటరిగా బైలుదేరాడు.

సరిగ్గా ఒంటిగంటకి డబ్బుపెట్టెతో పాడుబడ్డ బావి దగ్గరికి చేరింది భూషణరావు కారు. నెమ్మదిగా దిగాడు.

చిన్నగా నవ్వు విన్పించింది దుబ్బుల చాటునుండి.

"డబ్బు తెచ్చాను...." ముక్తసరిగా అన్నాడు భూషణ రావు.

"విమలకూడ సిద్ధమే...." తాళ్ళతో కాళ్ళూ చేతులూ కట్టబడిన విమల మూతికి ప్లాస్టర్ అంటించబడి అలా కూలబడివుంది.

"అదుగో నీ బాతు. ఆ పెట్టె నక్కడుంచి....అన్నట్టు డబ్బు తెచ్చావా? అన్నీ చిల్లి పెంకులా?"

మౌనంగా పెట్టెతెరచి టార్చిలైటు ఫోకస్ చేశాడు భూషణరావు. తృప్తిగా మెరిశాయి ఆనంద్ కండ్లు.

"వెరీగుడ్! ఆ బండమీదపెట్టి నెమ్మదిగా విమలవేపు నడిచి వెళ్ళు. నేను పెట్టెవేపు నడుస్తాను. మధ్యలో పిచ్చి వేషాలు వేశావో, కుక్క చావు చస్తావ్...." రెండు పిస్తోళ్ళని చూపించాడు ఆనంద్.

కాని ఆనంద్ వూహించినట్టుగా ఎలాంటి విశేషమూ జరగలేదు. భూషణరావు విమలని చేరేసరికి ఆనంద్ పెట్టెని స్వాధీనం చేసుకున్నాడు. భూషణరావు మౌనంగా విమలని నడిపించుకొని కారులో కూర్చోబెట్టుకొని వేగంగా వెళ్ళిపోయాడు.

తృప్తిగా నిట్టూర్చాడు ఆనంద్. వ్రతం చెడినా ఫలం దక్కింది తనకి. అందుకు సంతోషించాలి తను. భూషణరావు లాంటివాడు లొంగాడంటే కారణం అతని కూతురు.

'ఇక ఈ వూరినుండి చెక్కెయ్యాలి తను. చెల్లాయిని తీసుకొని హాయిగా ఏ మద్రాసో బొంబాయో వెళ్ళిపోవాలి. ఈ పాతిక లక్షల్నీ వ్యాపారంలో దించితే ఏటా నాలుగు లక్షలు లాభమొచ్చే విధానం తెలియని మూర్ఖుడు కాదు తను....'

ఆలోచిస్తూ మైలుదూరం నడిచాడో, లేదో, దాదాపు పదిమంది రౌడీలు అతన్ని చుట్టు ముట్టారు. ఆనంద్‌ను తీసుకెళ్ళి భూషణరావు ఇంట్లో కట్టిపడేశారు.

ఆనంద్‌ను చూసి వికటంగా నవ్వాడు భూషణరావు.

"....నేనింట్లో లేనిసమయం చూసి నా కూతుర్ని ఎత్తుకుపోయి నన్నే బ్లాక్‌మెయిల్ చేస్తావా? చెప్పు దాన్నేం చేశావ్?" గద్దించాడు.

"ఏమీ చెయ్యలేదు. సురక్షితంగా అప్పగించాన్నికే. కావాలంటే అడుగు."

"షటప్...." ఛెళ్ళుమంది ఆనంద్ చెంప. స్తంభానికి

కట్టివెయ్యబడివున్న తన చేతులకేసి చూసుకొని నిస్సహాయంగా తలెత్తాడు ఆనంద్.

"చెప్పు. అది వచ్చినప్పట్నుండీ ఒకటే ఏడుస్తోంది. నిజం చెప్పు...."

ఆ స్థితిలో కూడ నవ్వొచ్చింది ఆనంద్‌కి. "నేనేదో చేశానని కాదు దాని ఏడుపు. మగరాయుళ్ళాంటి తనని నేను ఎత్తుకుపోయినంత సేపూ అయ్‌మీన్ నా స్వాధీనంలో వున్నంతసేపూ అడుగూ, పెదవీ కదపలేని స్థితిలో వున్నందుకు పౌరుషంతో ఏడుపొచ్చుంటుంది."

"చింత చచ్చినా పులుపు చావలేదు. నిన్ను అక్కడి నుండి అలాగే వెనక్కి తీసికెళ్ళి అదే పాడుబడ్డ బావిలో మా మనుషులు తొయ్యలేరని కాదిప్పుడు నిన్ను తీసుకొచ్చింది. మరెందుకో తెల్సా? నువ్వు నాకుచేసిన మర్యాదకి 'ప్రతిమర్యాద' జరపాలిగా...." అంటూనే చప్పట్లు కొట్టాడు.

మరుక్షణం యిద్దరు గూండాలు బలవంతంగా లాక్కొస్తోన్న ఓ స్త్రీని చూసి వులిక్కిపడ్డాడు ఆనంద్. ఆమె తన చెల్లాయి నీరజ!

"దుర్మార్గుడా! ఆమెనెందుకు తీసుకొచ్చావ్?" కళ్ళలో నిప్పులు కురిపిస్తూ అన్నాడానంద్.

"ఎందుకో ముందు గడవబోయే రెండు నిమిషాలూ నీతో చెప్పటం ప్రారంభిస్తాయ్...." తన అనుచరులకి సైగచేశాడు భూషణరావు. ఒక్కొక్కరుగా అందరూ తప్పుకున్నారు.

ఒక్కసారి నీరజవేపు విషపుచూపు చూసి, ఆమెపై చెయ్యివేశాడు భూషణరావు.

ఆ తర్వాతి దృశ్యం ఆనంద్ చూడలేకపోయాడు.

*　　　　*　　　　*

ఆ సంఘటన జ్ఞాపకం రాగానే ఆనంద్ పిడికిలి బలంగా మంచంకోడుకి తాకింది. నొప్పి తెలిసొచ్చేసరికతను గతస్మృతుల నుండి తేరుకున్నాడు.

అతని కళ్ళనుండి నీళ్ళు ధారావాహికంగా కారిపోతోన్నాయి.

అలా....ఆ నాడు తన చెల్లాయి మీద పశువాంఛ తీర్చుకున్నాడు భూషణరావు. స్పృహతప్పిన స్థితిలో యిద్దర్నీ తీసుకొచ్చి యింట్లో పడేశారెవరో. తెల్లారి లేచే సరికి దూలానికి వురిపోసుకుని చచ్చిపోయింది, తన చెల్లాయి.

తనని ఒంటరిగావదిలి చచ్చిపోయింది. ఉన్న ఆ దిక్కూ కూడ పోయింది తనకి. దాదాపు మూణ్నెల్లు చెల్లాయిని గురించిన జ్ఞాపకాల నుండి తప్పించుకోలేకపోయాడు తను.

అయితే భూషణరావింట్లో ఈ మూణ్నెల్లలో అనుకోని మార్పు జరిగిపోయింది. విమలకి ఓ ఫారిన్ రిటర్న్డ్‌తో పెళ్ళయింది. కొన్నాళ్లుండొద్దామనే వుద్దేశంతో నూతన దంపతుల హనీమూన్ అయిపోగానే తనూ జర్మనీ వెళ్లాడు భూషణరావు. ఇది జరిగి రెణ్నెల్లు దాటింది.

"భూషణరావు ఎప్పుడొచ్చాడు? రామరాజు యెవరు? అతనికీ భూషణరావుకీ ఏ విధంగా సరిపోదు? రామరాజు కుటుంబాని కెలాంటి ద్రోహం చేశాడు భూషణరావు? తెల్సుకోవాలి."

రామరాజు పరిచయం చేసుకొని హోటల్లో మర్రోజు కలవమని చెప్పి వెళ్ళినప్పుడు తన్ననుసరించి వాళ్లిల్లు



నోట్ చేసుకున్నందుకు సంతోషిస్తూ లేచి చెప్పులు తొడుక్కున్నాడు ఆనంద్.

3

అదో చిన్న డాబాయిల్లు. తడికలతో గేటుంది.

తెరచుకొని లోపలికి వెళ్ళాడు ఆనంద్. తలుపులు మూసి వున్నాయి.

"రామరాజూ...." రెండుసార్లు పిలిచాడు. రెండు నిమషాల తర్వాత తలుపులు తెరచుకున్నాయి!

ఓ నడివయసు స్త్రీ.... రెండు కళ్ళూలేవు. "ఎవరు?" అంది.

"నేను ఆనంద్ నమ్మా! మీ అబ్బాయి స్నేహితుణ్ణి."

"అలాగా! రా బాబూ లోనికి. అబ్బాయి బయటికి వెళ్ళాడు...." లోపలికి దారితీసిందామె తడుముకుంటూ.

లోపలికొచ్చాడు. కుర్చీలో కూర్చున్నాడు. ఆమెకూడ నెమ్మదిగా మరోకుర్చీలో కూర్చుంది.

"రామరాజు మీ కుమారుడామ్మా!?" అడిగాడు.

"అవును బాబూ!"

"మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడుగుతాను. దయచేసి దాచ కుండా చెప్పగలరా....?" అంటూ యధాలాపంగా గోడకేసి చూసిన ఆనంద్ తృళ్ళిపడ్డాడు.

గోడపై భూషణరావు ఫోటో ఫ్రేమ్ కట్టబడింది. ఆ ఫోటోకి దండ వెయ్యబడుంది!

రామరాజు, భూషణరావు బ్రతికున్నట్టు చెప్పాడు. మరి యిదేమిటి?

"మీరెవరు బాబూ....!" అన్న ప్రశ్న లీలగా విన్పించింది ఆనంద్‌కి. ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

"భూషణరావు దుష్టచర్యలకి బలైపోయిన వారిలో నేనూ ఒకణ్ణి" అన్నాడు ఆనంద్.

భూషణరావు పేరు వినగానే ఆమె ముఖం పాలిపోయింది. "ఏ భూషణరావు బాబూ...." అంది.

"అదుగో! ఆ ఫోటోలో కన్పిస్తోన్న మహానుభావుడు!" వ్యంగ్యంగా అన్నాడు ఆనంద్.

"బాబూ...." బాధగా అందామె. "ఆయన చెడ్డవాడే కావచ్చు. కాని నా ఎదురుగా ఆయన్ని నిందించకు బాబూ" అందామె ఏడుస్తూ.

దాన్నిబట్టి ఆమెకీ భూషణరావుకీ గల సంబంధాన్ని వూహించాడు ఆనంద్. ఎలాగైనా నిజం రాబట్టాలనుకున్నాడు.

"మరి ఆ ఫోటోకి పూలదండ వేశారుగదమ్మా!" అన్నాడు.

"ఆఁ....!"

"అవును...."

"ఇది మావాడి పనే అయివుంటుంది. బ్రతికినవారికి పూలదండేస్తారా బాబూ ఎవరేనా?"

"బ్రతికినా చచ్చినవాళ్ళతో సమానమే కొందరు. ఆయన అందుకు అర్హుడే!"

"వద్దుబాబూ! అంతమాటనకు. దయచేసి ఆ ఫోటో కున్న పూలదండ తీసెయ్...."

"మనిషి బ్రతికుండగా దండ వేసినంతమాత్రాన చావడు. ఇప్పుడు మీ కుమారుడే తండ్రిని చంపబోతున్నాడు. అతనికి భూషణరావుపై అంత పగ ఎందుకుందో చెబితే మీ అబ్బాయి ఆ ఘోరం చెయ్యకుండా ఆడ్డుకోగలను."

ఆ మాట వినగానే ఆమె ఏడ్వసాగింది. ఆనందే ఆమెని ఓదార్చాడు. కళ్ళు తుడుచుకొని చెప్పటం ప్రారంభించిందామె:

"మేం ముందు విశాఖపట్నంలో వుండేవాళ్ళం. నాకు యిరవయ్యేళ్ళ వయసున్నప్పుడు క్రొత్తగా మా ప్రక్కింటి వాటాలో దిగాడీ భూషణరావు. అప్పటికింకా పెళ్ళికాలేదు. అందంగా చురుగ్గా వుండేవాడు. అప్పటికతని వయసు ముప్పైఏళ్ళు. ఒంటరిగా వ్యాపారం చేసేవాడు. తనవల్ల భార్య యిబ్బందులు పడాల్సొస్తుందని అతను పెళ్ళి చేసుకోలేదు.

"అతని అందం, స్వభావం నా మనసుని కరగించింది. ఆతనివేపుకి ఆకర్షితురాలినయ్యాను. అతనూ నన్నప్పు డప్పుడూ చూసేవాడు. తెగించి ఓ రోజతనికి వుత్తరం వ్రాశాను. అతని మనసునీ వుత్తరంద్వారా తెలియపరచాడు.

"ఓ రోజు హైదరాబాదులో ఆస్తి కొంటానని, అక్కడే వుంటానని చెప్పాడు. నా సంగతెలా అని అడిగాను. తనతో వచ్చెయ్యమన్నాడు.

"ఆ సమయంలో నాకు మరేమీ తోచలేదు. అన్యకుల వివాహానికి మా వాళ్ళు సమ్మతించరు. అతనితో వెళ్ళిపోవ టానికే నిశ్చయించుకున్నాను. ఆసంగతి అతనికి తెలిపాను.

"సంతోషించాను. ఓ రోజు అతనితో కలిసి రైలెక్కాను. హైదరాబాదులో అతను కొన్న ఆస్తినిచూసి ఆనందించాను. సంవత్సరం బాగా గడిచింది.

"ఓరోజు హఠాత్తుగా మెడలో పూమాలలతో ఆయనతో బాటు మరో అమ్మాయి ఇంట్లోకొచ్చింది. విస్తుపోయాను. భయపడ్డాను. కోపగించుకున్నాను. అల్లరి చేస్తానని భయ పెట్టాను. అసహ్యించుకున్నాను.

"వాటన్నిటికీ ప్రతిఫలంగా ఆయన నన్నేం చేశాడో తెల్సా? నా జ్ఞాపకార్థంగా నా కళ్ళు మాత్రం వుంచుకొని, నన్ను బయటికి పంపేశాడు బాబూ!

"అప్పుడు నేను నాలుగునెలల గర్భవతిని. ఆ తర్వాత సంతానంలేని ఓ విధవస్త్రీ నన్ను ఆదరించింది. శీలాన్ని కళ్ళని పోగొట్టుకొని మళ్ళీ పుట్టిల్లు చేరలేకపోయాను. రామరాజుని కన్నాను. ముసలావిడ పోతూపోతూ కొంత డబ్బు బ్యాంకులో వేసింది. ప్రస్తుతం దానికొచ్చే వడ్డీ మాకు జీవనోపాధి. రాముకింకా వుద్యోగం లేదు.

"బాబూ! నా కొడుకులాంటి వాడివైనా సిగ్గువిడిచి నీతో అంతా చెప్పాను. వాడాయనని ఏమీ చెయ్యకుండా చూడు. ఎంతైనా భర్త భర్తే! నామాట మన్నించు బాబూ. కళ్ళులేని దాన్ని. నీకూ తల్లిలాంటిదాన్ని...." ఏడుస్తూ ఆనంద్ చేతులు పట్టుకుందామె.

4

భూషణరావు యింటికెళ్ళి తలుపు తట్టారిద్దరూ. ఎవరూ రాకపోయేసరికి కాలింగ్‌బెల్ మ్రోగించారు.